ఆంధ్రపత్రిక


సచిత్ర వార పత్రిక






మొగ్గ

ఫోటో: ఎ. ఆర్. శోనేపల్లి—



శిల్ప, చిత్రలేఖనాలకు ప్రసిద్ధిగాంచిన అజంతాగుహలు.

—ఫొటోలు : సి. వి. నరసింహా.



సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ

సంపుటము 50
సంచిక 44
4-7-56

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

దుర్ముఖ జ్యేష్ఠ బహుళ ఏకాదశి బుధవారం

ముఖచిత్రం : "టౌన్‌బస్" చిత్రంలో అంజలీదేవి.

వస్త్రోత్పత్తి: అంబర్ చరఖా

వాణిజ్యపరిశ్రమలమంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి యిటీవల వస్త్ర పరిశ్రమలో ఉత్పత్తి కార్యక్రమంపై ప్రభుత్వం అవలంబించే విధానాన్ని ప్రకటించారు. రెండవ పంచవర్ష ప్రణాళిక కాలంలో 170 కోట్లగజాలవస్త్రం అదనంగా కావలసి ఉంటుందన్న అంచనాలనబట్టి వస్త్ర పరిశ్రమలో మూడురంగాలకు వాటాలు కేటాయించారు. ఇందులో చేనేత పరిశ్రమలో చేమగ్గాల రంగానికి 70 కోట్లగజాలు (మిల్లు నూలుతో నేసేవి), మరమగ్గాలు ప్రవేశపెట్టడంద్వారా 20 కోట్లగజాలు, కేటాయించారు. పోతే, అంబర్ చరఖాపై వడికే నూలుతో చేనేతపరిశ్రమలో మరో 30కోట్ల గజాలవస్త్రాలు ఉత్పత్తికావాలని నిశ్చయించారు. ఇక బట్టలమిల్లుల ఉత్పత్తి 500 కోట్ల గజాలకు మించరాదని, కార్వేకమిటీ సూచనపై రెండేళ్లనాడు గరిష్ఠపరిమితి పెట్టారు. కాని అదనపు అవసరాల దృష్ట్యా, మిల్లులకు మరో 35 కోట్లగజాల ఉత్పత్తి కేటాయించారు. అయితే, ఈ 35 కోట్ల గజాలూ పూర్తిగా విదేశాలకు ఎగుమతి చేయడానికే వినియోగించాలని షరతు పెట్టారు. ఆ షరతు ప్రకారమే మిల్లులలో కొత్తమగ్గాలకు లైసెన్సులు ఇస్తారు.

ఇప్పుడు మనదేశం ఎగుమతిచేసే వస్త్రం 85 కోట్లగజాలు. దీనికి ఈ 35 చేర్చితే 120 కోట్లగజాలకు ఎగుమతి పెరగాలి. జపాన్ మార్కెట్ పోటీ తీవ్రతరం అయితే, ఇంత వస్త్రం చెల్లకపోవచ్చునని కొందరు నిపుణుల అభిప్రాయం.

దేశంలో చేనేతపరిశ్రమను ప్రోత్సహించి ఎక్కువమందికి ఉపాధులు చూపడంకోసమే మిలుల ఉత్పత్తికి గరిష్ఠ ప్రమాణాలు విధించారు కాబట్టి, ఒకవేళ యీ మిల్లు వస్త్రం విదేశవిపణులలో చెల్లుబడికాక, కొంత మన దేశంలోనే విక్రయించవలసివస్తే, అప్పుడు దానిపై అదనంగా కొంత ఎక్సైజు సుంకం విధించడం జరుగుతుంది.

శ్రీ కృష్ణమాచారి కేటాయింపు ప్రకారం, మొత్తం 170 కోట్ల గజాలలోను నాలుగువంతులు చేనేత పరిశ్రమకు ఒకవంతు మిల్లులకూ కేటాయించినట్లు తేలింది.

ఇప్పటికి ప్రకటించినవి పోగా, మిగిలే 15 కోట్ల గజాల ఉత్పత్తినీ ఎవరికివ్వాలన్న విషయం, ముందు పరిస్థితులు చూచుకొని వీలువెంట నిశ్చయిస్తారట.

ఇక, చేనేత పరిశ్రమకు అదనంగా కేటాయించిన కోటా ఉత్పత్తి కావడానికి ఇబ్బంది ఉండకుండా, ఈ పరిశ్రమలో ఇప్పుడున్న చేమగ్గాలలో కొన్నిటిసానే, 15 వేలవరకూ ఈ ఏడాది, మరో 20 వేల వరకూ పైఏడాది మరమగ్గాలను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ మరమగ్గాలకు దాదాపు ఆరుకోట్ల రూపాయలు ఖర్చు అంచనా వేశారు. ఇందులో నాలుగు కోట్ల 80 లక్షల రూపాయలు అప్పుగానూ, మిగతాది గ్రాంటుగానూ మంజూరు చేస్తారు. ఇదంతా కట్టుదిట్టంగా సాగడంకోసం



భారత ఉపరాష్ట్రపతి డా॥ రాధాకృష్ణన్ ఇటీవల సోవియట్ రష్యా పర్యటనకు వెళ్లారు. బుల్గానిన్, కృశ్చేవ్, డా॥ రాధాకృష్ణన్, భారతీయ రాయబారి కె. పి. యస్. మీనన్ గార్లను పై చిత్రంలో చూడవచ్చును.

★ వస్త్రోత్పత్తి: అంబర్ చరఖా ★

ఈ మరమగ్గాల వాడకాన్ని చేనేత సహకార సంఘాలకే ప్రత్యేకించారు. ఇంకెవ్వరినీ వాడనివ్వరు. వీటితో కలిపి, మొత్తం ఈ పరిశ్రమలో 20 లక్షల మగ్గాల వరకూ, ఇటుపై పనిచేస్తూ ఉంటాయి.

ఈ పరిశ్రమ ద్వారానే మరో 30 కోట్ల గజాల ఉత్పత్తికి అంబర్ చరఖా నూలును వినియోగించాలని సంకల్పించి, కోటా ప్రకటించారు.

ఈ అంబర్ చరఖా ఇది ఇంకా వాడకంలోకి రాలేదు. దీనివల్ల ఏమాత్రం పనిజరిగేదీ, ఇందులో లాభనష్టాలు, సాధక బాధకాలూ ఎలా ఉండేదీ పరిశీలించడానికి గత ఏప్రిల్‌లో ప్రభుత్వం ఒక సంఘాన్ని నియోగించారు. ఆ సంఘం వారు వర్తమాన ఆర్థిక సంవత్సరంలో 75 వేల అంబర్ చరఖాలను తయారు చేయించి పని ప్రారంభించమనీ, ఈ ప్రయోగాత్మక ఘట్టంలో ఫలితాలు, సాధక బాధకాలు చూచుకొని, పై ఏటికి రెండు లక్షల చరఖాలు సరఫరా చేయించాలనీ సిఫార్సు చేశారు. రెండు మాసాలక్రితమే ప్రభుత్వం ఈ చరఖా సాధకబాధకాలు, ఉత్పత్తిశక్తి తేల్చుకొనడానికై ప్రయోగాత్మకంగా పదివేల చరఖాలు తయారు చేయించాలని నిశ్చయించినా, ఈ సంఘం సిఫార్సులు చూచినమీదట ఈ ఏడాది 75 వేల చరఖాలను ప్రవేశపెట్టడానికి అంగీకరించారు. వీటిని తయారుచేయడానికి 70 లక్షల రూ॥ ఖర్చు అంచనావేశారు. పోతే, ఎక్కువమందికి ఉపాధులు చూపాలన్న విధానం మేరకు, ఈ చరఖాలను, యంత్రాలు వాడే కర్మాగారాలలో తయారు చేయించకుండా, ఆ పనులు గ్రామాలలోని వడ్రంగులకే ఒప్పగించ నిశ్చయించారు. చరఖా తయారవడంతో దీనిపై నూలు వడకడంలో జనానికి శిక్షణ ఇప్పించడానికి ఒక పథకం ఉంది. శిక్షణకాలంలో వారికి ప్రభుత్వం భత్యాలు ఇస్తుంది. ఆపైన, ఈ నూలును చేనేత పరిశ్రమ కేంద్రాలకు సరఫరా చేస్తారు. దూరప్రాంతాలకు రవాణాచేయ నవసరం లేకుండా ఈ చరఖాలను చేనేతకేంద్రాలలోనే ఎక్కువగా ప్రవేశపెడతారు. పోతే, ఈ వస్త్రం ఉత్పత్తికై మొత్తంమీద అమ్మకం ఘట్టంలో రూపాయికి పావలా సబ్సిడీ ఇవ్వాలనికూడా ప్రభుత్వం నిశ్చయించింది.

ఈ ప్రకారం ప్రభుత్వం ఈ పరిశ్రమను ప్రోత్సహించడానికి మొత్తంమీద నాలుగు కోట్లవరకూ ఖర్చు అవుతుంది. చేనేత పరిశ్రమకు సబ్సిడీలు ఇవ్వడానికి అవుతున్న [illegible] నికి కాగల ఖర్చు మొత్తంమీద 12 కోట్ల వరకూ తేలుతుంది. ఇదికాక ఖద్దరును ప్రోత్సహించడానికి ప్రభుత్వం రూపాయకు మూడణాలు సబ్సిడీ ఇస్తోంది.

ఈ దృష్ట్యా ఇంత ధనం సమకూర్చుకోవడానికి కొత్తమార్గాలు ఆలోచించవలసిఉంది.

ఇంత పెద్ద ఖర్చుతో, ఈ కొత్త పరికరాన్ని ఉపయోగించబోవటం ఎంతవరకూ వాంఛనీయమన్నది ఇదమిత్థంగా తేలలేదు. అంబరు వస్త్రం మార్కెట్‌లోకి ఎక్కదని, ఈ చరఖాను నమ్ముకొంటే, నిర్ణీతలక్ష్యం 30 కోట్ల గజాలకు కావలసిన నూలు సరఫరా కాదని, కాగా, అసలు ఈ నూలును వాడటానికి చేనేత పారిశ్రామికులు ఒప్పుకోరనీ, అసలు దీన్ని అమలుజరుపడానికి అవలంబించదలచిన వికేంద్రీకరణ విధానం కూడా ఆచరణసాధ్యం కానిదనీ రకరకాల వాదాలు చేయబడుతున్నాయి. ప్రభుత్వం ఈ ప్రశ్నలకు ఖరారుగా జవాబులు చెప్పుకున్నట్లు కనబడదు. ఈ చరఖాకు సంబంధించిన అనేక అంశాలు స్పష్టంగా తెలియరాలేదు.

అంబర్ చరఖా 24 వ నెంబరు నూలు వడకడానికి బాగా ఉపయోగిస్తుందని, అదే మంచిదని, ఖేరాకమిటీవారు పేర్కొన్నారు. మిల్లునూలులో బాగా నాజూకు రకాలు కూడా నేస్తున్న చేనేత పారిశ్రామికులు ఈ ముతకనూలు వాడకానికి ఇష్టపడక పోవచ్చును. పోతే, ఈ నూలువాడే నేతగాడికి రోజుకు ఏడణాలకుపైన గిట్టదని అంచనా. మిల్లునూలు అయితే రూపాయవరకు పలుకుతుంది. ఈ ఘట్టంలోకూడా ప్రభుత్వం ఆదుకోవచ్చు. ఖాదీమగ్గాలపై కొంతవరకూ ఈ నూలును వాడవచ్చుకాని, నిర్ణీతలక్ష్యం సాధించాలంటే మిల్లునూలు, చేనేతమగ్గాలు వాడక తప్పదు. పోతే తయారయే వస్త్రం అమ్మకానికి సబ్సిడీ ఇస్తారు. ఆపైన ప్రభుత్వం అవసరాలకు అంబర్ నూలువస్త్రాలే కొనాలనికూడా కమిటీ ఒక సిఫార్సు చేసింది.

ఇక ఉత్పత్తిశక్తి కూడా నిర్ధారణ కాలేదు. ఈ చరఖాపై రోజుకు ఆరు చిలపలనూలు తియ్యవచ్చును. ఈ లెక్కన 30 కోట్లగజాల మాట అలా వుండగా మూడు కోట్ల గజాలకు కావలసిన నూలుకూడా లభించదని అనుమానం వెల్లడించబడుతోంది. ఇది ఎంత నిజమైనా కాకపోయినా చరఖా పరిశీలన సంఘంకూడా, దీన్ని అభివృద్ధి చేసి, ఉత్పత్తిశక్తి పెంచడానికి వీలుగా ఇందులో కొత్తరకంగా కొత్త నమూనాలు తయారు చేయడానికై పరిశోధనలు జరిపించాలని ఒక సిఫార్సు చేశారు. ఈ రాట్నంమీద ఆధార [illegible] ఉంటుంది. చిలపకు అణాన్నర చొప్పున ఆరు చిలపలకు తొమ్మిది అణాలు, మహా అయితే ముప్పావలాకన్న రాబడి వచ్చే ఆస్కారంలేదు. పోతే, నూలు విషయంలో, నేతగాళ్లను ఒప్పించడంకూడా ఒక సమస్యే. ఇంతకన్నా నాజూకైన నూలు తీయడానికికూడా మార్గాలు వెతకవలసి ఉంటుంది.

ప్రభుత్వం, ఈ అంశాలన్నిటిపైనా సాధక బాధకాలు ఖరారుగా తేల్చుకోకుండా, "ప్రయోగాత్మక పథకం" పేరిట 70 లక్షల ఖర్చుతో 75 వేల చరఖాలను ముందు తయారుచేయించడం అంత వాంఛనీయం కాదనిపిస్తోంది. ఈ చరఖాద్వారా ఉపాధి చూపదలచిన 40 లక్షలమందికీ ఇంతకన్న తక్కువఖర్చుతో, ఇంకొంచెం గిట్టుబాటు కాగలపద్ధతిలో అమలు జరుపదగు పథకాలు లేవా అని ప్రభుత్వకేంద్రప్రణాళికా సంఘాన్ని అడగడంకూడా జరిగింది.

ఈ పరిస్థితిలో, అంబర్ చరఖాపై, ఐదేళ్లలో 30 కోట్లగజాలవస్త్రోత్పత్తికి నూలుసరఫరా చేసే బాధ్యత వేయడంకూడా సబబుగా కనబడదు. ఈ పథకం అనుకున్నట్టు జరగని పక్షంలో, దీని మేరకు దేశంలో వస్త్రం కొరత ఏర్పడడం, ఆపైన ధరలు పెరిగి ప్రజలు అవస్థపడడం జరుగుతుంది. అందువల్ల దీనికి ఇంత పెద్ద కోటా ఇచ్చే బదులు, ప్రస్తుతానికైనా, కొంతవరకు మిల్లునూలు ద్వారానే చేనేత పరిశ్రమలో చేమగ్గాలపైనో, మరమగ్గాలపైనో ఉత్పత్తిని కేటాయించి, దానికి కట్టుదిట్టాలు చేసిఉంచే బాగుండేది. ముమ్ముందు పరిస్థితులనుబట్టి మార్పులు చేసుకోవచ్చునని అనుకొంటునే ఉన్నారు. కాబట్టి ఈ చరఖా మంచిచెడ్డలు ఖరారుగా తేలినమీదట పాతిక లక్షల చరఖాలూ సరఫరా తీసుకోవచ్చు. ఈ లోగా ఈ ప్రయోగాత్మక పథకాన్ని ఇంత భారీఎత్తున సాగించడం వాంఛనీయం కాదు. ★

1955 లో మనదేశంలో రూ. 3 కోట్ల విలువగల ఎలక్ట్రిక్ మీటర్లు తయారయినాయి.

ప్రతిష్టంభనలో పడిన సైప్రస్ సమస్య

సైప్రస్ సమస్యా పరిష్కారానికి బ్రిటిష్ ప్రభుత్వం కొత్త ప్రతిపాదనలు చేయనున్నట్లు తెలుస్తోంది. సైప్రస్ ప్రజలకు స్వయంపరిపాలన నిర్ణయాధికారాన్ని ఇవ్వడానికి ఒక పద్ధతిని బ్రిటిష్ ప్రభుత్వం నిర్ణయిస్తుందన్నీ, కొత్త రాజ్యాంగాన్ని [illegible] చేయొచ్చునన్నీ, టర్కిష్ సైప్రియట్ల [illegible] ంగా, టర్కీ [illegible] అనుగుణంగా [illegible] గాన్ని [illegible] స్తుందనీ [illegible] ముందుగా [illegible] పోవాల్సి [illegible] ందని [illegible] ోంది.

ఈ ప్రతి[illegible] టర్కీ [illegible] అప్పుడే [illegible] తెలియజేశాయి. ఇక గ్రీకు సైప్రియట్లకు, గ్రీసు ప్రభుత్వానికి ఇది ఎంతవరకూ ఆమోదయోగ్యంగా ఉంటుం[illegible] చూడాల్సిందే.

మధ్యప్రాచ్య రాజకీయాలతో సంబంధం [illegible] బాలకూ, మధ్య ప్రాచ్యంలోని నూనెగనులకూ సంబంధం ఉందని, ఏనాడో తేలిపోయిన విషయమే. మధ్య ప్రాచ్యంలోని నూనెగనుల మీద బ్రిటన్ మొదలైన పశ్చిమ యూరోపియన్ దేశాల ఆర్థికవ్యవస్థ ఆధారపడిఉంది. వాటిని రక్షించుకోవడానికే ఆ ప్రాంతాల్లోని కీలక స్థావరాలపై సామ్రాజ్యవాదదేశాలు ఆధిపత్యం నెరపుతున్న విషయంకూడా స్పష్టమైనదే. సైప్రస్ సమస్యపై కొన్నాళ్ళ క్రితం ప్రస్తావిస్తూ బ్రిటిష్ ప్రధాని "సైప్రస్ లేకపోతే మన నూనె సరఫరాకు రక్షణ సౌకర్యాలు ఉండవు. నూనె లేకపోతే బ్రిటన్లో దారిద్ర్యం, నిరుద్యోగం తప్పవు," అని స్పష్టంగా చెప్పారు. మధ్య ప్రాచ్యనుండి నూనె సరఫరాకు అంతరాయం ఏర్పడినప్పుడు చర్యలు తీసుకోవడానికి సైప్రస్ సైనికస్థావరంగా పనికి వస్తుందని, ఆ కారణంతోనే సైప్రస్ను వదులుకోడానికి [illegible] ఇష్టపడడం లేదని బ్రిటిష్ ప్రభుత్వం వెల్లడిచేసింది

సైప్రస్ 1925 నుండీ బ్రిటిష్ వలసగా ఉంటున్నది. బ్రిటిష్ గవర్నరు ద్వారా బ్రిటిష్ ప్రభుత్వం సైప్రస్ను పరిపాలిస్తున్నది. మధ్యధరా సముద్ర ప్రాగ్భాగంలోని ఈ చిన్న ద్వీపంలో గ్రీకులు అధిక సంఖ్యాకులు గానూ, టర్కిష్ జాతీయులు అల్ప సంఖ్యాకులు గానూ ఉన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదం ఇతరవలసలన్నిటిలోనూ అవలంబించినవిధానాన్నే ఈ ద్వీపంలోనూ అవలంబించి పరిపాలన సాగిస్తున్నది. ఉభయజాతుల వారిలోనూ స్పర్థలు, కలహాలు రెచ్చగొట్టి స్వయం పరిపాలనను నిరాకరిస్తున్నది. గ్రీకులు బ్రిటిష్ ఆధిపత్యాన్ని ప్రతిఘటిస్తూ, స్వయం పరిపాలనకై ఆందోళన చేస్తున్నారు. గ్రీసుతో కలిసిపోవాలని తమ ఆశయమైనట్లు వెల్లడించారు. గ్రీసుకూడా ఈ ఆశయాన్ని బలపరుస్తున్నది.

ఇక అల్పసంఖ్యాకులైన టర్కిష్ జాతీయులు తమకు స్వయం పరిపాలన అక్కర్లేదని బ్రిటిష్ ఆధిపత్యాన్నే బలపరుస్తున్నారు. వీరికి టర్కీ మద్దతు ఇస్తున్నది. ఈవిభేదాలను సాకుగా తీసుకుని బ్రిటిషు ప్రభుత్వం దమన నీతి సాగిస్తున్నది. తత్ఫలితంగా గ్రీకు జాతీయుల ఆందోళన తీవ్రరూపం దాల్చి, దౌర్జన్య కాండకు దారితీసింది. ఉభయ [illegible]లోనూ అనేకులు హింసా చర్యలకు గురిఅయ్యారు. బ్రిటిష్ ప్రభుత్వం సైప్రియాట్లపై అనేకవిధాలుగా ఆంక్షలు విధించింది. పత్రికలనుమూసివేయడం, కొన్ని రాజకీయ పక్షాలను నిషేధించడం, ఆస్తులను జప్తుచేయడం; సమష్టిగా జరిమానాలు విధించడం మొదలైన అనేక తీవ్రచర్యలు తీసుకొని ఆందోళనను అణచివేయ ప్రయత్నించింది. ఈదమననీతివల్ల గ్రీకు [illegible]లో అసంతృప్తి మరింతగా పెరిగిపోయింది. దీనికితోడు ఉత్తర అట్లాంటిక్ మండలిలో సభ్యరాజ్యాలైన గ్రీసు, బ్రిటన్ల మధ్య కూడా వైషమ్యాలు పెచ్చుమీరిపోయాయి. సైప్రస్లో ఒకవిధంగా ప్రతిష్టంభన ఏర్పడినదని చెప్పవచ్చును.

సైప్రస్లోని అన్నివర్గాల ప్రజల అభీష్టాలకూ అనుకూలమైన నిర్ణయాలు జరగాలని, తమకూ, తమతోటి అట్లాంటిక్ రాజ్యాలకూ ఉన్న రక్షణావసరాలకనుగుణంగా అనిర్ణయాలు జరగాలని, అనిర్ణయాలు జరపడంలో గ్రీసు, టర్కీ, బ్రిటన్ల మధ్య సంబంధాలను కూడా పరిగణించాలనీ బ్రిటిషు ప్రభుత్వం వాదిస్తున్నది. దౌర్జన్యకాండకు స్వస్తిచెబితేగాని సంప్రదింపులు జరపమని బ్రిటిషు ప్రభుత్వం పట్టుదల వహించింది. సైప్రస్కు స్వయం పరిపాలన ఇవ్వడంగాని, సైప్రస్ గ్రీసుతో కలవడంగాని బ్రిటన్కు ఇష్టంలేదని, దీన్ని బహిరంగంగా ఒప్పుకోవడం ఇష్టంలేకనే ఏవోసాకులు చెబుతున్నదనీ తేలిపోయింది. సైప్రస్కు స్వాతంత్ర్యంఇస్తే టర్కిష్ జాతీయులను గ్రీకులు అణచివేస్తారని, అందుచేత టర్కిషు ప్రజలకు గ్రీకులతో సమానంగా ప్రభుత్వంలో భాగం ఇవ్వాలని టర్కీ వాదిస్తున్నది. ఇది గ్రీకు జాతీయులకు ఇష్టంలేదు.

> ఎప్పటికైనా తాను బ్రిటిష్ ప్రభుత్వంలో వలస శాఖా మంత్రి కావాలని శ్రీ లెనాక్స్ బాయిడ్ కలలు కనేవారు. తరుణం మించిపోకుండా, తన ఆశయం సాధించుకున్నందుకు ఆయన అభినందనీయులు.
>
> "పంచ్"

ఈ ప్రతిష్టంభన సాధ్యమైనంత త్వరలో పరిష్కారం కాకపోతే బ్రిటన్ రాజకీయ ప్రతిష్ఠ మరింత బలహీనం కాకతప్పదు. ప్రజాభీష్టాన్ని వ్యతిరేకించి సైనిక స్థావరాలను నిలబెట్టుకోవడం కష్టమని బ్రిటన్ గ్రహించాలి. సైప్రియాట్లపై ప్రస్తుతం అమలులో ఉన్న ఆంక్షలను తొలగించి నాయకులతో మళ్లీ సంప్రదింపులు ప్రారంభించడం అవసరం. సైప్రస్ ఉద్యమ నాయకులు తక్షణం దౌర్జన్య చర్యలను విరమించడం కూడా అవసరం. ఈ ప్రాతిపదికపై మళ్లీ సంప్రదింపులు కొనసాగి సైప్రస్కు స్వాతంత్ర్యం చేకూరిన పక్షంలో, సైప్రస్ జాతీయవాదులు, గ్రీసు ప్రభుత్వమూ కూడా సైప్రస్ను బ్రిటిష్ స్థావరంగా అంగీకరించక పోయినా, సైప్రస్లో బ్రిటిష్ స్థావరం ఉండడానికి అంగీకరించవచ్చు. ఆ ఒడంబడికకు బ్రిటన్, గ్రీసు, టర్కీలే కాక ఉత్తర అట్లాంటిక్ మండలిలోని ఇతర రాజ్యాల హామీకూడా ఉన్నట్లయితేముందు ముందు బ్రిటిష్ స్థావరం ఉనికికిభంగం రాగలదనేభయం నిరాధారమవుతుంది. ★

గీర్వాణ భాషాభ్యాసం

౧

సింహళ దేశ రాజకుమారిక లీలావతీదేవికి, హాల శాతవాహన చక్రవర్తికీ వివాహం జరిగి అప్పుడే రెండు మాసాలైంది. నూతన వసంతోదయంతో ప్రతిష్ఠానగరోద్యానాలన్నీ కోకిలకాకలీ కుహూకుహూ రవాలతో కలకలలాడిపోయాయి. నవోఢ లీలావతీదేవి అంతఃపుర ప్రవేశ మహోత్సవ సమయంలో ఆ పరిసరోద్యానవనాలే కాక అంతఃపుర స్తంభాలు కూడా చిగిరించి పుష్పించాయని అందరు అనుకున్నారు.

అయితే హాలశాతవాహన చక్రవర్తి పట్టమహిషి మలయవతీదేవి హృదయానికి మాత్రం ఆ ఉదంతం కేవలం శిశిరర్తువుగా పరిణమించింది.

పట్టమహిషి అయిన తరవాత మరి నూతన వధూ గృహప్రవేశ మహోత్సవానికి వెంచేయకపోవడం సముచితం కాదన్న కారణం చేత దేవి ఆ మహోత్సవానికొచ్చి విచ్చేసింది. మిగిలిన రాణివాసపు రాణులందరూ ఆ కొత్తరాణికి తామె చేజేతులా కర్పూర నీరాజనాలెత్తారు!

కాని మలయవతీదేవి పట్టమహిషీగౌరవ భావంతో తులతూగుతూ లీలావతీదేవినొక్కమారలవోకగా ఆశీర్వదించింది.

అటుపిమ్మట దీపదీపాలవేళ మళ్లీ లీలావతి పట్టమహిషికి పాదాభివందనం చెయ్యడం కోసమని ప్రత్యేకంగా ఆమె భవంతికి విజయం చేసింది.

పట్టమహిషి చెలికత్తెలు, దాసీలు ఆమెకు కర్పూర మంగళహారతులెత్తి, గౌరవంగా ప్రత్యుత్థానం చేసి ఎంతో మర్యాదగా లోపలికి తోడుకుపోయారు. తరవాత కొంతసేపటికి నూతనవధువు తిరిగీ స్వీయ ప్రాసాదానికి మరలిపోయింది.

మలయవతి సంజవేళ కర్పూర నీరాజన కాంతులలో నూతనరాజ్ఞి లీలావతి కజ్జలనీల కటాక్ష రేఖాభంగిమ అంతా అత్యంతాసక్తితో పరిశీలించింది.

“అందగత్తెలైన రాజకుమారికల కన్నికత్వంలోను, వారిని కోరి కోరి వివాహమాడడంలోను చక్రవర్తి బహు సమర్థులు!” అనుకొన్నది పట్టమహిషి మలయవతి. ఆపైన ఒక దీర్ఘ నిశ్శ్వాసం విడిచి పెట్టింది. పిమ్మట ఆమె చెక్కిళ్లపై రెండే రెండు కన్నీటి బిందువులు నెమ్మదిగా నెమ్మదిగా దిగజారాయి.

హాలచక్రవర్తి దక్షిణాపథ సామ్రాజ్య పట్టాభిషేకము, పట్టమహిషి మలయవతీదేవి కల్యాణ మహోత్సవము ఒకే శుభముహూర్తంలో జరిగాయి. నాటినించీ చక్రవర్తికి అప్పుడే నాలుగు వివాహ మహోత్సవాలు జరిగాయి. సింహళ రాజకన్యాపరిణయంతో ఆరవ వివాహం కూడా జరిగిపోయింది!

ఇన్నాళ్లనించీ ఇన్ని వివాహమహోత్సవాలు జరిగినా మలయవతీదేవి పట్టమహిషీ గౌరవ మర్యాదలకు, మన్ననలకు అంతగా లోటుపాటు లేవీ జరగలేదు. కాని కొత్తరాణి లీలావతి యౌవన సౌందర్యాలవలోకించేసరికి పట్టమహిషికి పంచ ప్రాణాలు పైపైనే ఎగిరిపోయినట్టయింది. నాటితో తన ప్రాభవం అంతా అస్తమించిపోయినట్టే అని ఆమె పరిపరి విధాలుగా వాపోయింది.

హాలచక్రవర్తి కప్పుడే యాభైయో పడి ప్రవేశించింది. అయినా అంతలోనే ఆయనకు ఆరు వివాహ మహోత్సవాలు జరిగిపోయాయి!

మంత్రి సామంత పురోహితాది చక్రవర్తి పరివారం అంతా ఆ వివాహాలు ఆర్షధర్మ ప్రతిష్ఠాపనకత్యంతావశ్యకములనీ, చక్రవర్తి వైదికమత ప్రతిష్ఠాపనకోసం భూలోకంలో ప్రత్యక్షంగా అవతరించిన ధర్మదేవతా స్వరూపుడనీ వేనోళ్ల ప్రశంసించారు.

దానికి కొక చిన్న కారణం కూడా లేకపోలేదు. పట్టమహిషివల్ల చక్రవర్తి కొకే ఒక మగసంతతి కలిగింది. ఇక మిగిలిన రాణులెవరికీ సంతానమే కలగలేదు. ఒక కుమారుడున్నా లేకపోయినట్టే అని మన ధర్మశాస్త్రాలుద్ఘోషిస్తున్నాయి కనక చక్రవర్తి తిరిగీ మగసంతు కలిగేవరకు అనవరత కళ్యాణ మహోత్సవాలలో మునిగి తేలుతూండవలసిందేనని పురోహితులంతా ముక్తకంఠాలతో ప్రవచించారు!

చక్రవర్తి మంత్రులందరు దక్షిణాపథ సామ్రాజ్యస్థైర్యానికీ కళ్యాణ మహోత్సవాలు కేవలం పెట్టనికోటలనీ, వీటివల్ల చక్రవర్తి యశోవర్తికి స్వీయనృత్యచాతుర్యంతో దిగ్దిగంతాలలో కవితనీకానికి కనులు మిరుమిట్లు గొలుపుతున్నదనీ ఎన్నో విధాల ఎలుగెత్తి చాటారు.

కాని పట్టమహిషికీస్తోత్ర పాఠాలన్నీ కేవలం అర్థవాదాలవతుగానే వినిపించాయి.

“చక్రవర్తికేమి మహారాజులు! ఆయన నిత్యనూతనప్రియులు. అంతఃపురం అంతా అనవరతంగా నిత్యకళ్యాణాలతోను, పచ్చతోరణాలతోను విలసిల్లుతూండడమే వారికి కావలసింది! నేను నిత్యము గృహదేవతలను కోరుకునేదీ అదే! వారి ఆనందమే నా ఆనందం! లేక లేక నాకు కలిగిన వంశాంకురం పదికాలాలపాటు పచ్చగా ఉంటే నాకదే పదివేలు!” అని ఆమె పక్కగా నిలబడి వింజామర మెల్లమెల్లగా విసురుతూన్న చెలికత్తె సేవంతికకు వినబడీ వినబడనట్టుగా అతి నెమ్మదిగా గొణుకుకొన్నది.

చెలికత్తె సేవంతిక దానికేమీ సమాధానం చెప్పలేదు! అలాగే నెమ్మది నెమ్మదిగా వింజామర వీచింది.

లీలావతి అంతఃపుర ప్రవేశం జరిగినప్పటి నుంచి పట్టమహిషి తన ప్రాసాదం విడిచి పెట్టి ఒక్కమారైనా ఉద్యానవనంవైపు తొంగిచూడలేదు. నాటినించీ ఆమెకేదో తీరని మనోవ్యథ పట్టుకొని వేధిస్తున్నదనీ, అందువల్లనే అలాగ కుమిలి కృశించిపోతున్నదనీ చెలికత్తె సేవంతిక గ్రహించింది. అయినా శాయశక్తులా ఆమెకు కొంత ఓదార్పు కలిగించవలెనని నిశ్చయించింది:

“ఏమైనా అంతంత మిడిసిపాటులు కూడదమ్మా!”

"ఎవరిమాటే! నీవనేది?"

"కొత్తరాణీగారి హెగ్గడికతెలకే మరి పట్టపగాలు లేకపోతే ఇక ఆ అమ్మగారిమాట ఇక చెప్పాలా?"

"మలయవతి తీవ్రంగా బొమముడి విరిచింది:

"ఇంతకీ ఏమి జరిగింది?"

"స్వయంగా కానుకలర్పించబోతే అనంగరేఖా దేవిగారికికూడా చిన్నరాణీగారి దర్శనమే లభించలేదట!"

"ఔరా!"

"నేను విన్నవించేది అవగింజలో అరభాగంకూడా కాలేదు! చిత్తగించదలచితే ఇంకొక్క చిన్నవిశేషం కూడా విన్నవించుకుంటాను"

మలయవతి అలాగే ఆశ్చర్యపోతూ జిజ్ఞాసార్థకంగా సేవంతికవైపు చూచింది:

"చక్రవర్తి నిన్న దీపదీపాలవేళ చిన్నరాణీగారి అంతఃపురానికి విజయం చేశారట!"

"ఓహో అలాగా! ఆతరవాత?"

"వారికికూడా లీలావతిదేవి అంతఃపురద్వారందగిర గడియ సేపటివరకు పడిగాపులు పడిఉండవలిసిన అవస్థ పట్టిందట!"

"అవును మరి! వారంతగా దాసానుదాసులుగా మారిపోయినతరవాత ఎదటివారెంతగానైనా కించపరిచి తీరతారు! ఇందులో వింత ఏముందిలే? ఇంతకీ ఆ లీలావతి కెందుకే అంత మిడిసిపాటు?"

"ఉన్న రాణులందరిలోను మరింక తానే 'మహాసౌందర్యవతిననీ!"

"అంతమాత్రం చేత చక్రవర్తిని కూడా కించెపరచాలా?"

"అంతేకాదు! తానొక గొప్ప గీర్వాణభాషా విదుషీమణిననీ ఇక్కడి రాణులందరూ కేవలం నిరక్షర కుసుమాలనీ ఆమె ఈసడించి కొట్టి మాట్లాడని క్షణమే లేదట!"

"వచ్చి రెండు నెలలయిందో లేదో! అప్పుడే అంత పెద్ద గర్వం, బలిసిందా? ఇంతకీ ఆమె ననవలసిన పనేముందిలే! దీనికంతటికి మూలకారణం ఆయనే లే!"

"మీరింకా పాతకాలం ధోరణిలోనే ఉన్నారమ్మా! లీలావతీదేవిగారి హెగ్గడికతెకూడా తానొక మహారాణి అన్నట్టుగా వన్నె సరించి వేసింది!"

"ఎప్పుడు?"

"మొన్న"

"అలాగా! దాని పేరు?"

"మల్లిక"

అంతలోనే దూరంగా ద్వారందగర మల్లిక ప్రత్యక్షమైంది సేవంతిక "అదెనమ్మా! ఆ మల్లికే ఎందుకో మీ దర్శనానికి వచ్చింది." అని వేలెత్తి చూపించింది.

ఆ పిమ్మట మలయవతి అనుమతి తీసుకొని మల్లికను లోపలికి తోడుకువచ్చింది.

మల్లిక లోపలికి వస్తూనే నుదుటిపై దోసిలి ఒగ్గి నిలబడింది నుగునాటి సాయంకాలం వేళ వసంతోత్సవం జరగనున్నదనీ, తదనంతరం చక్రవర్తి రాణులందరితోను కలిసి అంతఃపురోద్యానవన సరోవరంలో జలక్రీడ లాడనున్నారనీ, దానికి విచ్చేయవలసిందని చక్రవర్తి స్వయంగా అభ్యర్థిస్తున్నారనీ సవినయంగా విన్నవించింది పట్టమహిషి మల్లికకేసి నిశితంగా చూసింది:

"చక్రవర్తి ఇప్పుడెక్కడ ఉన్నారే?"

"లీలావతీదేవి, వారు ప్రస్తుతం చతురంగ ఖేలనంలో తన్మయులై ఉన్నారు"

అని చెప్పి మల్లిక సవినయంగా సెలవు తీసుకొని వెంటనే అక్కడినించి వెళ్ళిపోయింది.

"మాటకారమ్మ దాని పొగరు!" అన్నది సేవంతిక.

కాని పట్టమహిషికదేమీ బోధపడలేదు.

"వెళ్ళేటప్పుడు మల్లిక 'వాడునే నెంతదాన్నో' అన్నట్టుగా నాకేసి చూసి ఒక చిరునవ్వు విసిరి కొట్టింది!"

"నే నది గమనించలేదే!"

"సరే! రేపు మీరు జలక్రీడకు విజయం చేస్తున్నారు గదా! అప్పుడే తెలుస్తాయి మీకా రాణీగారి ఒయ్యారాలు, ఆమె చెలికత్తె మల్లిక వగలూను! ఇంతలోనే తినబోయే వంటకాలు రుచి వర్ణించనేల?"

అని సేవంతిక అల్లాగే ఒయ్యారంగా వింజామరవీస్తూ ఊరుకున్నట్టొక నిట్టూర్పు విడిచిపెట్టింది పట్టమహిషి కూడా అలాగే ఆమెవైపు విస్తుపోయి చూసింది

౨

ఆంధ్రసాతవాహన రాజధాని ప్రతిష్ఠాన నగరం నవ వసంతోత్సవ కోలాహలంతో తలమునకలైనది విశాలదక్షిణాపథ సామంత రాజన్యులందరు ధనకనక వస్తువాహనాది సంపదలతో ఆ వసంతోత్సవానికి విచ్చేసి, హాలసాతవాహన చక్రవర్తికనేకమైన అమూల్యములైన కానుకలర్పించి, చక్రవర్తి కరుణాకటాక్ష వీక్షణానికి పాత్రులై ధన్యులమైనామని భావించారు.

ఆనాడు ధాన్యకటక నగరం కూడా ఆంధ్రసాతవాహన చక్రవర్తులకు రాజధానీ నగరమే అన్నంత మహాప్రసిద్ధి వహించింది సాతవాహన చక్రవర్తులు సంవత్సరంలో చాలాకాలం ధాన్యకటక నగరంలోనే నివసించేవారు అయితే ప్రతిష్ఠానం ప్రాచీన సాతవాహన చక్రవర్తులకు రాజధానిగా పేరు పొందివుండటంవల్ల అప్పుడప్పుడక్కడ కూడా విడిది చెయ్యడం ఆ చక్రవర్తులందరికీ ఒక పరిపాటి.

ఆనాటి వసంతోత్సవానికి ధాన్యకటక నగరంనించి ఎందరెందరో ప్రాకృతగాథా కవీశ్వరులు, వీణా వేణుమృదంగాది వాద్యనిపుణులు, నర్తకీ నర్తకులు మల్లశస్త్రాస్త్ర పారంగతులు, ఇంకా ఎందరెందరో వివిధశాస్త్ర విద్వాంసులు విచ్చేశారు హాలసాతవాహన చక్రవర్తికి ప్రాకృతగాథలంటే ప్రాణం. ఒకొక్క గాథకొకప్పుడు చక్రవర్తి సహస్ర దీనారాలు కూడా సమర్పించడం కద్దు. ఒకొక్క గాథా సంపాదన కోసం చక్రవర్తి చేసే విశ్వప్రయత్నాలు చూచి కవీశ్వరులెందరో అమితమగు గాథారచనలతో ప్రతిష్ఠాననగరానికి విచ్చేశారు.

మొట్టమొదటగా ఆ చిన్న చిన్న గాథలన్నీ పరిశీలించి, వానిలో రత్నశలాకలవంటి గాథలు కొన్ని ఏర్చికూర్చి, అవి చక్రవర్తికి నివేదించే ప్రత్యేకాధికారం ఆ నాటి వసంతోత్సవాలలో గుణాఢ్య ప్రధానామాత్యునిపై పడింది. అయితే చక్రవర్తి స్వయంగా నిర్వహించే ఆ ఘనకార్యం గుణాఢ్య మంత్రి భుజస్కంధాలపై ఒకింతుక ఒరిగిందనగానే చక్రవర్తి అమాత్యవర్గంలో ఒక విచిత్రమైన కల్లోల కలకలం చెలరేగింది!

అందులోను అమాత్యుడు శర్వవర్మకది మరింత కష్టతరంగా తయారయింది చక్రవర్తి మహానుగ్రహకటాక్షాని కది ఒక నాంది ప్రస్తావన కావచ్చునని, ముందు ముందు గుణాఢ్య మహామంత్రి ఇతోధికంగా చక్రవర్తి బహుమానాదరాలకు పాత్రం కావచ్చునని శర్వవర్మ గ్రహించి వేశాడు.

గుణాఢ్యుడే ప్రధానామాత్యుడైనా చక్రవర్తికి శర్వవర్మపై బాగా ప్రత్యేకాభిమానం ఏర్పడింది ఇవతల సింహళరాజకన్యక లీలావతిదేవి కల్యాణోత్సవ రూపకానికి నాంది ప్రస్తావన చేసిన సూత్రధారుడు శర్వవర్మ. ఆ వివాహంద్వారా సాతవాహన సామ్రాజ్యానికి శత్రుమండలంగా నిలిచిన సింహళం మిత్రమండలంగా మారిపోయింది ఇది శర్వవర్మ స్వీయప్రతిభా చాకచక్యంవల్ల

సాధించిన ఘనకార్యమని చక్రవర్తి బహుధా ప్రశంసించాడు.

అయితే ఆ ప్రాకృత గాథారత్న పరీక్షక గౌరవం గుణాఢ్యమంత్రికే కట్టబెట నేల? ఆమాత్రం అల్పగౌరవానికి నేను తగనా? అని అనేకవిధాలుగా మథనపడ్డాడు శర్వవర్మ.

అసలు సామాన్య శ్లోకాలకన్నా హాస్యతరమైన ప్రాకృతగాథల కీవిధంగా సువర్ణ దీనార శత సహస్రాలు గుమ్మరించడం శర్వవర్మకు సుతరామూ రుచించ లేదు. అసలు కవిత్వానికీ అతనికీ పగమెరుక. అందులోను ప్రాకృతగాథా కవిత అంటే అతనికి మరీరోత. ప్రాకృతగాథా కవులంటే కేవలం ఎందుకు కొరగాని వ్యర్థులనీ, నట విట విదూషకులయినా వారికన్నా కొంత నయమే అనీ అతని దృఢాభిప్రాయం!

శర్వవర్మ షట్శాస్త్రాలు క్షుణ్ణంగా పఠించిన మహావిద్వాంసుడు. ప్రత్యేకంగా కౌటిల్యనీతిలో అతి దిట్టమైనా ఘటికుడు! గుణాఢ్యునికన్నా వేయిమడుగు లెక్కువ లోకజ్ఞుడు. అందువల్లనే రాజ్యతంత్ర నిర్వహణలో చక్రవర్తి ప్రత్యేకంగా అతనితోనే మంతనాలు సాగిస్తూ ఉంటాడు.

అయితే ఆ గాథారత్న పరీక్షాధికారం గుణాఢ్య మంత్రి కీయడంలో రహస్యమేమో! దానిలో ఏదో కొంత నిగూఢార్థం ఉండి తీరాలని శర్వవర్మ నిశ్చయించాడు.

శర్వవర్మ ఆస్థానంలో చక్రవర్తి ముఖతః వెలువడిన చిన్నిచిన్ని చిరునవ్వులకుకూడా ఏవో అంతరార్థం ఉండితీరాలని అతి జాగ్రత్తగా పరిశీలిస్తూంటాడు. అలాగే అమాత్యులలోను, చివరి కిక అంతఃపురపరిచారికలలోను బయలుదేరే చిన్న చిన్న ఛలోక్తులలోను, పరిహాస ప్రసంగాలలోను ఏవేవో రహస్య రాజకార్య భాష్యాలు వెలువడుతూంటాయని అతని అభిప్రాయం!

అందుచేతనే ప్రతి చిన్న విషయము వేగులద్వారా పరిశీలిస్తే తప్ప అతనికిక ఆరాత్రి నిద్రపట్టదు. అంతఃపుర పరిచారికలలో కూడా అతని కొందరో రహస్య రాజకార్యా లెరిగించేదూతికన్నారు.

ఆరాత్రి శర్వవర్మ గోదావరీ తీర ప్రాసాదంలో రహస్య మంత్రాగారంలో అంతఃపుర పరిచారిక సేవంతికకోసం నిరీక్షిస్తూ కూర్చున్నాడు.

ప్రతిష్ఠాన నగర రాజవీథులలో హస్త్యశ్వరథాది యానాల సందడి క్రమక్రమంగా సమసిపోయింది. కాని నట విట విదూషకాది విలాసపురుషులు కొందరు కొందరింకా గోదాల నదీ సైకతాల్లో విహరిస్తూనే ఉన్నారు. శర్వవర్మకా నగరం అంతా అప్పుడే చిరువెన్నెలలో గూటికిచేరి నెమ్మది నెమ్మదిగా రెక్కలల్లల్లాడిస్తూన్న ఒక మహావిహంగంలా భాసించింది.

అతని హృదయంలోకూడా ఒక జిజ్ఞాసా విహంగం రెక్కలల్లల్లాడిస్తూనే ఉన్నది. అయితే అతడావిహంగమంపై అధిరోహించి ఆకాశంలో మహామాత్యాధికార తరంగ జలాలలో ఉయ్యాలలూగవలెనని ఉవ్విళ్లూరుతున్నాడు.

అంతఃపురంలో ఏదో ఒక చిన్న గాలి దుమారం చెలరేగిందనీ అది చిలికి చిలికి గాలి వాన కానున్నదనీ అతనికి కొంచెం చూచాయగా తెలిసింది అంతఃపురాభ్యంతర మందిరాలలో చెలరేగిన గాలి దుమారాలు కూడా ఒకొక్కప్పుడు రాజ్యతంత్రంలో పెద్ద గాలివానలుగా చెలరేగడం అనేకమారులతని అనుభూతిలోనికి వచ్చింది. కనకనే సేవంతిక రాకకై అతడంత నిశితంగా నిరీక్షిస్తున్నాడు. ఆమె సామాన్యంగా అతని రహస్యమందిరానికి వచ్చే వేళ ఇంకా దాటిపోలేదు. అయినా ఆమె రాకకోసం అనుక్షణము నిరీక్షిస్తున్న శర్వవర్మకామె బాగా జాగుచేసినట్లే కనిపించింది.

అంతలోనే సేవంతిక లోపలికి వచ్చింది. ఆమెను చూడగానే శర్వవర్మ ఒక చిరునవ్వు నవ్వి—

"నీవీవేళ ఇప్పుడిప్పుడే వికసించిన సేవంతిలాగున్నావే!" అన్నాడు.

సేవంతిక కొంచెం సిగ్గుపడి — "అవును! ఎంత తొందరగా బయలుదేరినా కొంచెం ఆలస్యమే అయింది." అని మరి మాటాడలేక అలాగే నిలుచుండిపోయింది.

ఆమెకావేళ శర్వవర్మ ముఖకవళిక చూడగానే లోలోపల ఏదో గుబులు బయలుదేరింది.

శర్వవర్మ శాక్తేయ మంత్రోపాసకుడు. భ్రూవల్లికలు రెండు ఏకైక వినీల వల్లికగా స్ఫురించే అతని ఫాలంపై దిద్దితీర్చిన కుంకుమ తిలకం తిలకించేసరికి ఆమెకు హఠాత్తుగా నిటలాక్షుని ఫాలలోచనమే సందర్శించినట్టయింది!

శర్వవర్మ ఆమెను కొంచెం ఉల్లాసం కలిగించడానికే ఆ విధంగా పరిహాసప్రసంగం ప్రారంభించాడు. కాని ఘరికాగ్రాల్లా మెరిసే అతని చిన్న చిన్న కన్నుల సూది చూపులు, శూలాగ్రంగా స్ఫురించే అతని శుష్కనాసిక, ఆ సుదీర్ఘ ముఖము పరిశీలించేసరికామె మరి మాటాడలేకపోయింది. శర్వవర్మ అదిగ్రహించి ఒక చిరునవ్వు చిందించి నెమ్మదిగా తిరిగి ప్రసంగం ప్రారంభించాడు:

"నీ ధోరణిచూస్తే అంతఃపురంలో ఏదో పెద్దవిశేషమే జరిగినట్టుందే!"

"పెద్దవిశేషమే జరిగిఉండవచ్చును గాని నాకేమీ తుద, మొదలు తెలియడంలేదు."

"ఇంతకీ ఏమిజరిగిందో!"

"చక్రవర్తి జలక్రీడలాడిన విషయం మీకెరిగిందేగదా!"

"తెలిసిందికాని పట్టపురాణికూడా ఆసమయానికక్కడ ఉన్నారా?"

"ఉన్నారుగాని ఎందుచేతనో జలక్రీడలింకా ముగియకముందే ఎంతో చిన్నబుచ్చుకొని వెంటనే అక్కడినించి వెళ్లిపోయారట!"

"'ట!' అంటున్నావే! ఆ సమయానికి నీవక్కడ లేవన్నమాట!"

"లేను!"

"మరి ఇదంతా నీ కెలాగ తెలిసింది?"

"కొంచెం చూచాయగా విన్నాను"

"అయితే పట్టమహిషి ఆవిధంగా కోప

వినతి

నయాగరా జలపాతం చూడ వచ్చిన జనానికి అక్కడిఉద్యోగి మంచి చెడ్డా. తెలియచెప్పాడు

"ప్రకృతి సౌందర్యం అంతా ఇక్కడే ఉంది. ఈ జలపాతం ధ్వని, ఈసౌందర్యానికి చక్కని ఉపశ్రుతి వంటిది. ఇక్కడి మహిళామణులు ఒక్క నిముషం మౌనం వహిస్తే, మనం అంతా, గంభీరము, మధురాతి మధురమూ అయిన జలపాత గీతికను చెవులారా విని, ఆనందించవచ్చును..."

గించి వెళ్లిపోవడానికి కారణం?"

"చిన్న రాణిగారేదో అని, వెటకారంగా నవ్వారట!"

"ఆమాత్రానికే అంతగా చిన్నబుచ్చుకోవాలా?"

"సాక్షాత్తు చక్రవర్తే ఆ మాటవిని క్షణకాలం ఖిన్నులైనారట!"

"తరవాత?"

"తరవాత లీలావతీదేవి అదేపనిగా విరగబడి నవ్వడం మొదలు పెట్టినదట!"

శర్వవర్మకు ఆమె చెప్పిందేమీ అవగాహన కాలేదు. అతనికి ప్రాణం విసిగిపోయింది.

"ఇంతకీ చివరికి ఏమిజరిగిందో మాత్రం బోధపడలేదు!" అన్నాడు కొంచెం విసుగ్గా.

"ఆ సమయంలో చక్రవర్తి ముఖంలో అంతగా వైమనస్యం గోచరించలేదు గాని అటు పిమ్మట కొంతసేపటికాయన తమ శయ్యాగృహంలోనికి వెళ్లిపోయారట!"

"వెళ్లి?"

"అటుతరవాత మరి ఎవరితోను ప్రసంగించలేదట!"

"రాత్రి భోజనమైనా చేశారా?"

"మరి ఎవ్వరితోను ప్రసంగించడానికే ఇష్టపడనప్పుడిక వారిదగ్గర భోజన ప్రసంగం ఎవరెత్తగలరు?"

"ఇంతకీ వారా రాత్రి భోజనమే చెయ్యలేదన్నమాట?"

"లేదు!"

"దానికి కారణమేమో!"

"శిరోవేదనగా ఉన్నదని అన్నారట!"

"ఇంతకీ లీలావతీదేవి అంతగా విరగబడి నవ్వడానికి గల కారణమేమో!"

"అదే తిన్నగా తెలియడంలేదు!"

కాని ఆ కారణం తెలుసుకోవాలని శర్వవర్మ హృదయంలో విపరీతమైన తహతహలు చేరింది. అయితే ఆమెవల్ల అంతకంటె విశేషాలేవీ తెలిసే అవకాశం లేదని తేలిపోయింది.

తరవాత ఆమెను పంపించివేసి ఇంకా ఇద్దరు ముగ్గురు అంతఃపుర పరిచారికలను పిలిపించి, ఆ విషయమే కొంచెం లోతుగా ప్రశ్నించాడు.

అలాగ కొంతసేపు మథనపడగా శర్వవర్మకు అంతఃపురంలో జరిగిన విషయాలన్నీ సంపూర్ణంగా అవగాహన అయ్యాయి.

వెంటనే ఆ విషయాల మూలంగా కొంత వరకు తన సంకల్పం నెరవేరక ఆశలేకపోలేదని అనుకున్నాడు.

అంతలో అతని హృదయంలో హఠాత్తుగా ఏదో స్ఫురించింది. వెంటనే అతని ముఖంలో చిరునవ్వులు చిందులుదొక్కాయి!

—సశేషం.

పట్టుబడిన రావు

కుమారి శారద

ఆరోజు వ్యాపారం మందగొడిగా ఉంటే వెంకటరత్నం తన షాపులో కూర్చుని తీరుబడిగా ఆరోజు పత్రిక తిరగేస్తున్నాడు. ఇంతలో మెట్లమీద చప్పుడు విని అటువైపు చూశాడు. సుమారు ముప్ఫై ఐదు ఏళ్లుంటాయి ఆజానుభాహు విగ్రహమున్న కళ్లు చికిలిస్తూ అతనివైపే చూస్తూ లోపలికి వస్తున్నాడు.

"ఓరి! నువ్వట్రా రాము!" అంటూ సంభ్రమాశ్చర్యాలతో వెంకటరత్నం ఒక్క గంతులో అతన్ని సమీపించి చేయిపట్టుకుని కుర్చీ దగరకు తీసుకొచ్చాడు.

"ఆ! నేనే!" అంటూ రామారావు కుర్చీలో కూర్చున్నాడు.

వెంకటరత్నం ఇంకా తేరుకోలేదు. నోరు తెరుచుకొని రామారావును ఆపాదమస్తకము పరిశీలిస్తున్నాడు.

"పదిహేను సంవత్సరాలయింది నిన్ను చూసి. చాలా మారిపోయినావు. కాని ఈ నోరుమాత్రం మారలేదు" అన్నాడు రామారావు ఆ గదిని పరిశీలనగా చూస్తూ.

"బసవయ్య తన యింటిని మన రావుకు అద్దెకిస్తున్నానంటే ఎవరో అనుకున్నా. నువ్వని అసలు తట్టలేదు అయితే ఎంతో మాట గట్టావన్నమాటే"

"ఆ! ఫరవాలేదు. ఈ చివరి రోజులు సుఖంగానే గడిచిపోతాయి"

"చివరిరోజులు!"

"ఆ! కాళం. నలభయ్యోపడి దగ్గర పడింది." అన్నాడు రావు గంభీరంగా.

"నీవసలు మారలేదు. నలభై ఏళ్ళంటే నమ్మరెవరూ. కొత్త పెళ్లాం బిడ్డలు వచ్చేదాకన్నా ఆగు"

"అయితే ఇల్లు సర్దుకోనేందుకు నాకేమన్నా సహాయం చేస్తావా? లేదా? ఇంతవరకూ నాదంటూ ఏమీ లేదు. అంగుచేత ఆ ఇంటిని ఎట్లా ఉంచాలో నాకేమీ తెలీదు"

"నా చేతనయినంతా చేస్తాను. కాని తొందరపడి అంత సామాను ఇప్పుడే కొనకు. తీరిగ్గా నీవు పెళ్లిచేసుకుంటే ఆవిడగారికి నచ్చకపోవచ్చు"

రావు నవ్వి "నేనేం పెళ్ళి చేసుకోబోవటంలేదు." అన్నాడు నమ్మకంగా.

"అయితే రామలక్ష్మిని ఇంతవరకూ చూశావా? లేదా?"

రావు ముఖం కొద్దిగా ఎఱ్ఱబడింది. "లేదు. ఎందుకు?" అన్నాడు.

"ఇంకా అవివాహితగానే ఉంది"

"ఉంటే ఏం? నాకేం సంబంధం?"

"అహా! ఏంలేదు, నేను—"

"అయితే?"

"నేను—అదికాదు. నీకు పెళ్ళిచేసుకుందుకు స్తోమతు లేదని, అందుకే నువ్వు ధనార్జనకు ఉత్తరాదివైపుకు పారిపోయావని అనుకున్నారు." అని గొణిగాడు వెంకటరత్నం.

"అబ్బాయి అమ్మాయిల సంగతేనా ఎప్పుడు చూసినా?" అని తీక్షణంగా చూసి "పదిహేను సంవత్సరాలనాటి సంగతది. ఇప్పుడు ఆవిడను చూస్తే గుర్తుపట్టలేననుకుంటా. అన్నట్టు వాళ్ళ అమ్మ బ్రతికుందా?" అని పూర్తిచేశాడు రావు

"నిక్షేపంగా" అంటూ వెంకటరత్నం నొక్కిపల్కాడు. "రామలక్ష్మి అచ్చంగా వాళ్ళమ్మలాగా తయారైంది."

రావు భుజాలు కుదించుకున్నాడు.

"వాళ్ళ ఇంటికి వెళ్ళినపుడు నువ్వే చూస్తావుగా ఇంతకుముందే ఎందుకు రాలేదా అని ఆశ్చర్యపోతారు."

"ఆశ్చర్యపోతే పోనీ. నిన్ను నేను కలుసుకున్నట్లు చూచాయగా వాళ్ళకు తెలియజెయ్యి. వాళ్ళ మనసులో ఇంకా ఏవైనా వ్యతిరేకోహాలుంటే తెలుస్తాయి మెల్ల మెల్లగా ఇతర మిత్రులనుకూడ కలుసుకుంటా. ఇల్లు సున్నము అది కొట్టేవరకూ ఉడిపిలోనే ఉంటా. సరేవస్తా" అంటూ రావు శెలవు తీసుకున్నాడు.

ఇల్లు పూర్తిగా మరామత్తు చేయబడిన తర్వాత ఆ ఇంట్లో ప్రవేశించాడు వెంకటరత్నంతోపాటు మరి కొంతమంది స్నేహితులను టీకి ఆహ్వానించాడు. రావు వెంకటరత్నానికి తన అభినందనములు తెలియజేస్తూ "నీ సహాయమే లేకపోతే ఈ ఇల్లు ఇంత చక్కగా ఉండేది కాదనుకుంటూ" అన్నాడు. "ఆ! దానికేంలే. నిజంగా అన్నీ బాగా అమరినాయి" అంటూ వెంకటరత్నం నలువక్కలూ కలియజూచి అంతా బాగానే ఉంది కాని, గృహ సంరక్షణకు గృహలక్ష్మి తక్కువ" అన్నాడు.

తర్వాత ఐదవ రోజున రామలక్ష్మి, తల్లి నరసమ్మ వచ్చారు. వాళ్ళు వచ్చేటప్పటికి రావు పడకకుర్చీలో పడుకొని సిగరెట్ పొగతో మేఘాలు కల్పిస్తూ ఊహాగానం చేస్తున్నాడు. వాకిట్లో వాళ్ళ గొంతులు విని ఉలిక్కిపడి లేచేసరికి వాళ్ళు గది గడప దగ్గర సాక్షాత్కరించారు. ముఖంమీద చిందర వందరగా పడిన జుట్టును చేత్తో వెనక్కు నెట్టుకుంటూ "రండి రండని" ఆహ్వానించాడు.

నరసమ్మ గదిని, గదిలోని వస్తువులను ఒక్కొక్కటే పరిశీలనగా చూసింది. కూర్చుంటూ మెల్లగా అంది "ఇల్లు చూడ ముచ్చటగా ఉంది. నీవు మా ఇంటికి వస్తావనుకున్నాము కాని పని తొందరలో రాలేక పోయావనుకుంటా. హఠాత్తుగా ఒక్కసారి ఇంటిని రాముడికి చూపి ఆశ్చర్యపరచాలనుకుంటున్నావేమో అని అమ్మాయితో కూడా అన్నాను. కాదుటే రాముడూ?" అని రామలక్ష్మి వైపు తిరిగింది. రామలక్ష్మి అవునన్నట్లు తలూపింది.

నరసమ్మ తిరిగి అందుకుంది "ఇల్లు బాగానే ఉంది కాని ముందుగానే నన్నడిగి ఉంటే ఈ ఖరీదుకే ఇంతకంటె మంచి ఇల్లు చూపించే దాన్ని."

"నాకు ఈ ఇల్లే నచ్చింది. నాకు సరిపోయినట్లుగా అన్ని హంగులూ ఉన్నాయి" అన్నాడు రావు

"అది సరేకాని, నీవు కులాసాగా ఉన్నావా? నిన్ను చూస్తేనే తెలుస్తోందిలే పూర్వమెట్లా ఉన్నావో ఇప్పుడూ అట్లాగే ఉన్నావు. నీవింతవరకు ఒక్క ఉత్తరం ముక్కన్నా రాయలేదేం?"

రావు జవాబుకోసం వెతుక్కున్నాడు. చివరకు ఎట్లాగైతేనేమి "నేను వ్రాయటానికి వీల్లేదు. నా భార్య..." అంటూ ఉండగనే నరసమ్మ అందుకుని "ఏమిటి? నీ భార్యా!" అంటూ ఆశ్చర్యంతో పెద్దగా అరిచింది

రావు ఏమీ తొణకకుండా స్థైర్యంగా "ఆ! నా భార్యకు ఇష్టముండదు." అని పూర్తి చేశాడు.

వరసమ్మ తన గొంతును యథాస్థితికి తీసుకుర వటానికి ప్రయత్నిస్తూ "నీకు పెళ్లయినట్లు వినలేదే! అయితే ఆవిడ ఇక్కడికెందుకు రాలేదు?" అని ప్రశ్నించింది.

"మా ఇద్దరికీ పడలేదు. అది ఒక్క రకం మనిషి. అందువల్ల దానినీ, పిల్లలను వదిలేసి వచ్చేశా." అన్నాడు రావు సత్యవ్రతుడు లాగా.

"పిల్ల...?" అని పూరుకుంది వరసమ్మ మిగతాది పూర్తిచేయలేక.

"ఐదుగురు పిల్లల్ని విడిచి ఉండాలంటే మహా బెంగగా ఉంది. అందులో చంటి వెధవ వాడు నేవచ్చేరోజే పారాడటం మొదలెట్టాడు." అన్నాడు రావు గదవంగా.

ఇంక మాటలు వినిపించుకొనే స్థితిలో లేదు వరసమ్మ. తనను తూడతీసుకుని లేస్తూ "ఎట్లాగైనా పిల్లలు తల్లి దగ్గర ఉండవలసిన వాళ్లే. రాముడూ లేమ్మా" అంటూ అడుగులు వేసింది రావు వాళ్ళను వాకిలివరకు సాగనంపాడు వాళ్లు వెళుతుంటే అక్కడే నిల్చుని వాళ్ళని చూస్తూ నవ్వుకున్నాడు. ఇంట్లోకివస్తూ ఈరహస్యం వీళ్ళతో నే ఆగిపోతుందా?" అనుకున్నాడు.

రావు అనుకున్నంతా ఐంది. ఆ వాడ వాడంతా రావుపెళ్ళి గురించి, భార్యా పిలలున్న సంగతీ తెలిసిపోయింది. ప్రతి వాళ్లు వచ్చి వాళ్ళ సంగతులు అడిగేవాళ్ళే. చివరకు రావుస్థితి ఎంతకు వచ్చిందంటే తన పిల్లల పేర్లను వయస్సుతోసహా కాగితము మీదరాసుకొని కంఠతా పెట్టి తేతప్ప వచ్చిన వాళ్ళకు జవాబివ్వటం కష్టమై పోయింది. ఈ సంఘటనతో రావు వరసమ్మ బారినుండి తప్పించుకున్నాడు. ఇప్పుడు స్వేచ్ఛగా రొమ్ము విరుచుకొని ఉల్లాసంగా ఊళ్లో తిరుగుతున్నాడు.

పాపం రావు ఆనందం ఎక్కువరోజులుండలేదు. కృష్ణవేణి ఆ ఊళ్లో స్కూల్లో టీచరుగా ప్రవేశించటంతో రావు పరిస్థితి తారుమారయింది ఆవిడను నాలుగయిదు సార్లు కలుసుకున్నాడు. రెండుసార్లు ఏదో సందర్భంలో మాట్లాడాడు కూడ.

రావు తనస్నేహితుడు వెంకటరత్నంతో ఆవిడను గురించి మొర పెట్టుకున్నాడు.

"ఆవిడతో నీకేం సంబంధం?" అని వెంకటరత్నం చివాట్లు వేశాడు.

"కృష్ణవేణిని ప్రేమించానురా"

"ప్రేమా! ఆవిషయం తలంచటానికే నీకు హక్కులేదు."

"ఎంచేత?"

"ఏం చేతేమిటి? పెళ్ళాం బిడ్డలున్నారన్న సంగతి మరిచిపోయావా"?

రావు స్థితి పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్టైంది. వెంకటరత్నంవైపు కళ్లప్పగించి చూడసాగాడు. కాస్త తెప్పరిల్లి "నేనేం జేయాలిప్పుడు?" అన్నాడు.

"ఏం జేయక్కర్లేదు పెళ్లాం బిడ్డలను పిలిపించుకో. ఎట్లాగైనా పిల్లల బాధ్యతంతా నీదే ఇంక ఆ సంగతి గురించి ఆలోచించుకో."

సరేనంటూ ఆలోచనగా రావు ఇంటి ముఖం పట్టాడు. రాత్రంతా ఆలోచించాడు. ఆ రాత్రి నిద్రలేదు. తన లేని భార్య గురించి ఆలోచిస్తూ. ఆవిడ మరణం ఎట్లాగా అని బుఱ్ఱ బద్దలు గొట్టుకున్నాడు. చివరకు గుండె జబ్బు నిశ్చయించాడు. ఇంకో రెండు వారాల్లో ఉత్తరాది నుంచి వచ్చిన ఉత్తరంవల్ల రావు భార్య హృద్రోగం వల్ల మరణించిన వార్త ఆ పేటకంతా తెలిసిపోయింది. దాని కనుగుణంగా నే రావు వాపోయాడు. క్లుప్తంగా కర్మలు గూడ చేశాడు. వెంకటరత్నం పరామర్శకు వచ్చాడు. "చివరకు ఆవిడ శాంతంగా నే వెళ్ళిపోయింది." అన్నాడు రావు గంభీరంగా.

"నీవే ఆవిడను చంపావని నా నమ్మకం" అన్నాడు మిత్రుడు. రావు అదిరి పడ్డాడు

"అంటే నీవు ఆవిడను వదిలేయటం వల్ల గుండె పగిలి చనిపోయిందని నా ఉద్దేశం!"

రావు నెమ్మదిగా శ్వాస తీసుకున్నాడు.

"ఇంక ఇప్పుడు పిల్లల సంగతి చూడు. వాళ్లను ఇక్కడికి రప్పించే యత్నం కానియ్యి" అన్నాడు తిరిగి వెంకటరత్నం దృఢంగా.

"వాళ్ళు వాళ్ళ అమ్మమ్మ తాతగార్ల దగ్గర ఖులాసాగా ఉన్నారు. నల్గురు మేనమామలు, ఐదుగురు పినతల్లులు."

"అది అట్లా ఉంచు పిల్లలతో నీ ఇల్లు ఎంత కళకళ లాడుతుందో ఆలోచించావా?" అన్నాడు వెంకటరత్నం.

ఒక్క వెంకటరత్నమే కాదు అట్లా సలహా ఇచ్చింది. పరామర్శకు వచ్చినవాళ్లు అంతా అదేమాట అందులో కొంతమంది పిలల సంరక్షణకు ఆయాలను కూడ కుదిర్చారు.

రావు ఇంక లాభం లేదనుకున్నాడు. కృష్ణవేణన్నా తనకు సానుభూతి చూపుతుందనుకున్నాడు. చాలాసార్లు ఆమెను రోడ్డు మీద కలుసుకున్నాడు. రావు తను ఏకాకి నని మొర పెట్టుకున్నాడు. కాని ఆవిడ చిరునవ్వుతో విన్నప్పటికి మరేమి మాట్లాడేది కాదు. ఈ విధంగా రెండు నెలలు గడిచి పోయినై

తర్వాత ఒకరోజున రావువెంకటరత్నాన్ని కృష్ణవేణి దగ్గరకు రాయబారం పంపటానికి నిశ్చయించుకొని మిత్రుడి దగ్గరకు వెళ్లాడు. "ఇది వీలుపడదు. అప్పుడే ఫోటోగ్రాఫరు వెంకట్రావుతో కృష్ణవేణిని నాలుగయిదుసార్లు చూశాను. అతడు నీకన్నా పది సంవత్సరాలు చిన్నవాడు. అదీ కాక బ్రహ్మచారి. కృష్ణవేణి నడివయస్సులోనున్న ఐదుగురు బిడ్డల తండ్రికంటె అతన్నే వరిస్తుందనుకుంటా" అని జవాబిచ్చాడు.

"ఇక్కడలేరుగా" అని జ్ఞాపకం చేశాడు.

"ఎక్కడున్నా పిల్లల తండ్రి పిల్లల తండ్రే, బ్రహ్మచారి బ్రహ్మచారే."

"ఇదంతా ఎందుకూ? నేనేవెళ్లి అడుగుతాను. కాని ఇంకా కొద్దికాలం ఆగుతాను. కృష్ణవేణి ఆ విగ్రహపుష్టిగాణ్ని పెళ్ళిచేసుకొని తన జీవితమంతా నాశనం చేసుకునే సూచనలు కన్పిస్తే ఆవిడని రక్షించటం నా విధి నేనుకూడా వాళ్ళిద్దర్ని రెండుసార్లు చూశాను. కాని వాడికింత ఊహ ఉందని కలలోకూడ అనుకోలేదు."

ఈవిషయాన్ని గురించే ఆలోచిస్తూ రాత్రంతా నిద్రపోలేదు రావు మరుసటిరోజు ప్రొద్దున్నే లేచి తన అదృష్టాన్ని ఆరోజే తేల్చుకోవాలని దృఢనిశ్చయం చేసుకున్నాడు. సాయంత్రం నాల్గున్నరకి టిప్‌టాప్‌గా డ్రస్సు చేసుకుని స్కూలుముందు కాపలా వేశాడు. కృష్ణవేణి బయటకు రాగానే పలకరించి ఆవిడ ననుసరించాడు. కొంతదూరం మౌనంగా నడిచారు.

"మాడండి మీతో ఒకమాట చెప్పాలి" అన్నాడు రావు. ఏమిటన్నట్లుగా అతడి వైపు చూచింది కృష్ణవేణి

"ఇంక ఈ ఒంటరితనాన్ని భరించలేనండి" అన్నాడు నిరాశగా.

"ఎప్పుడూ అంతేగా" అంది కృష్ణవేణి పొడిగా.

"ఈ వేళ మరీ వేధిస్తోంది"

"అందుకు కారణం నాకు తెలుసు." అంది కృష్ణవేణి మృదువుగా. "రోజంతా పనీ పాటా లేకుండా పనిమనిషి మినహా ఇంట్లో ఒంటరిగా ఉండాలంటే కష్టమే" రావు ఆశగా ఆవిడవైపు ఓరగా చూశాడు.

"అదే గనక పిల్లలకేరింతేలతో సందడిగా ఉంటే వేరుగా ఉంటుంది." అని తిరిగి మొదలు పెట్టింది కృష్ణవేణి రావు ఒక్క క్షణం స్తంభించి పోయాడు. తిరిగి ఆవిడతో నడక సాగించాడు.

"ఇంతకుముందు మీతో ఈ విషయం గురించి నే నెప్పుడూ ప్రస్తావించలేదు. కాని మీ ఒంటరితనానికిగల కారణాన్ని మీరు గుర్తించలేదేమో అని ఇప్పుడు చెప్పవలసి వచ్చింది."

రావు అగాధంలో పడ్డట్టు ఫీలయ్యాడు.

"పాపం! అభాగ్యులు, తల్లిలేని పిల్లలు" అని కాస్తంత తటపటాయించి "తండ్రి ఉన్నాకూడా లేనట్టే" అని నిట్టూర్చింది.

రావు అయోమయంలో పడ్డాడు. ఆలోచించే స్థితిలో లేడు. చివరికి మెల్లగా "నేను పెళ్లి చేసుకుంటే?" అన్నాడు.

"మళ్ళీ పెళ్ళా?' అని కృష్ణవేణి ఆశ్చర్యపోయింది.

"ఎవరైనా వచ్చి పిల్లల బాధ్యత చూడమని ఎట్లా అడిగేది? ఎవరైనా ఐదుగురు బిడ్డల తండ్రిని వివాహం చేసుకుందుకు అంగీకరిస్తారా?"

"ఎందు కంగీకరించగూడదు? అది ఆ స్త్రీ స్వభావంమీద ఆధారపడి ఉంటుంది"

"మాట వరసకి మిమ్మల్ని అడుగుతే?" అనేశాడు రావు తొందరగా.

ఒక్క నిమిషం నిశ్శబ్దం అయిపోయింది. "నాకు తెలీదు. అది పరిస్థితులమీద ఆధారపడి ఉంటుంది" అంది కృష్ణవేణి తనలో తను మాట్లాడుకుంటున్నట్లు.

"అయితే పిల్లలను పిలిపిస్తాను" అన్నాడు రావు జ్ఞాపకం చేస్తూ.

కృష్ణవేణి జవాబివ్వలేదు. అంతలో కృష్ణవేణి ఇల్లు సమీపించారిద్దరు. త్వరగా తలుపు తీసుకొని లోనికి అదృశ్యమైంది కృష్ణవేణి. చివరికి ఎటు తేల్తుందోనని కలత పడిపోయాడు. ఇంటి ముఖం పట్టాడు. రాత్రంతా జాగారం. తీవ్రంగా ఆలోచించాడు. మొదట సంకోచించినా, పిల్లలను నీళ్లలో ముంచేయటానికి నిశ్చయించుకున్నాడు. వాళ్ల తల్లితోనే వాళ్లను కూడా ముగించేస్తే సరిపోయేదని విచారించాడు.

కృష్ణవేణి వేసంగి శెలవులు ముగిసిన తర్వాత తిరిగి వచ్చేటప్పటికి ఇంటి యజమానురాలివల్ల ఆ విషాద వార్త విన్నది. రావు చాలా దుఃఖములో మునిగి ఉన్నాడని పచ్చి మంచినీళ్ళయినా మూడురోజుల వరకు ముట్టుకోలేదని కూడా వింది.

ఒక వారం రోజుల తర్వాత ఆమె అతడిని రోడ్డుమీద కలుసుకుంది. అతడి ముఖం కళావిహీనంగా ఉంది. ఆమే ముందు పలకరించింది.

"ఇప్పుడు నా కెవరూ లేరు. నే చచ్చినా బ్రతికినా నా సంగతి పట్టించుకొనే వాళ్లేలేరు." అన్నాడు రావు దీనంగా.

కొద్దిదూరం నిశ్శబ్దంగా నడిచారు. కృష్ణవేణి మెల్లగా అడిగింది. "అసలు అది ఎట్లా జరిగింది."

"వాళ్ళు త్రోవలో ఒకనదిని దాటాల్సి వచ్చిందిట. వాళ్ళెక్కిన పడవ మునిగిపోయింది"

"కూడా ఎవరున్నారు?"

"వాళ్ళ నౌకరు ఉన్నాడు"

"ఈ విషయం మీ కెట్లా తెలిసింది?"

"మా రెండవ మరదలు ఉత్తరం రాసింది. ఆవిడే మా పిల్లలను తల్లిలాగా చూసేది. ఈ సంఘటనతో మరి ఆవిడ ఇంక మామూలు మనిషి కాలేదు."

"ఆ ఉత్తరం మీ దగ్గర ఉందా?"

రావు తనను తాను సంబాళించుకొని, "లేదు. ఆ ఉత్తరం తలుచుకుంటే నే వణికిపోయేవాడిని. అందుచేత దాన్ని ముక్కలుగా చించి అవతల పారేశాను."

"నాకు ఆ ఉత్తరాన్ని చూడాలని మహా ఉబలాటంగా ఉంది. నా కొక ఊహ తోస్తోంది. మీ మరదలు మీ పిల్లలను చాలా ప్రేమగా చూస్తోందని మీకు గట్టి నమ్మకమేనా?"

"అసలు ఆవిడ వాళ్ళకోసమే బ్రతికి ఉంది."

"నా కృసలు మునిగిపోలేదని నా నమ్మకం. ఇదంతా కుట్ర." అంది కృష్ణవేణి హఠాత్తుగా అతనివైపు తిరిగి. రావు ఆమె వైపు నివ్వెరపోయి చూస్తుండిపోయాడు.

"ఇప్పు డర్థమౌతోంది" కృష్ణవేణి తిరిగి మొదలు పెట్టింది. "మీ మరదలు మీ పిల్లలను ప్రాణ సమానంగా చూసుకుంటోంది. మీ రెప్పుడైన పిల్లలను తీసుకు పోతారని భయపడి ఈ కథ కల్పించింది".

"మా మరదలంత మంచిది ఇంతవరకు పుట్టలేదు." అన్నాడు మనఃక్లేశంతో.

కృష్ణవేణి తల అడ్డంగా ఊపింది. "అందరూ మీలానే మంచివాళ్ళనుకుంటున్నారు. ఇతరులెవరైనా అబద్ధం చెప్తున్నారంటే, మీరు ఊహించుకోలేరు. ఇంతెందుకూ, మీ రెంత ప్రయత్నించినా ఒక్క అబద్ధంకూడ ఆడలేరని నా నమ్మకం".

నీళ్లలో మునిగిపోతున్న వాడిలా రావు నిరాశతో రెప్ప వేయకుండా ఆవిడ వైపు చూస్తుండి పోయాడు.

"నే ననుకొన్నదే నిశ్చయం. మీ మరదలు ఇందులో జయం పొందింది. నా కింకో ఆలోచన కూడా పోతోంది. మీతో మీ పిల్లలు మునిగిపోయారని చెప్పింది. అలాగే వాళ్లతో మీరు చనిపోయారని బహుశా చెప్పి ఉంటుంది. అటువంటి వాళ్లు ఎంతకైన తెగుదురు".

"ఆవిడ సంగతి అసలు మీకు తెలీదు." అన్నాడు రావు ఇంకేమీ అనలేక.

"అయితే అవచ్చు. కాని ఏది ఎట్లాగైనా ఈ సంగతిగురించి నిర్ధారణగా మనం తెలుసుకోవాలి. అక్కడ మీ కెవరైనా స్నేహితులున్నారా?" అని అడిగింది కృష్ణవేణి

"ఏవో కొద్దిమంది ఉన్నారు" అన్నాడు రావు జాగ్రత్తగా.

"అయితే రండి వాళ్లలో ఎవరికైనా టెలిగ్రాం ఇద్దాం"

రావు తటపటాయించాడు, "ఎందుకూ! నేను ఉత్తరంరాసి కనుక్కుంటాను గా. వాళ్లకు టెలిగ్రాం ఇవ్వటం అంత సబబు కాదు అంత మునుకుపోయే దేముందిప్పుడు? నా ముఖ్య స్నేహితుడు రమేష్‌కి వ్రాసి కనుక్కుంటాను"

"ఉత్తరం రాయటంవల్ల లాభంలేదని తెలుసుకోవాలి మీరు."

"ఎందుకు?"

"ఎందుకంటే, మీ ఉత్తరం అక్కడకు చేరలోగా, మీ రమేష్ మేడమెట్లుదిగుతూ జారిపడో; భోజనం చేస్తుంటే పొరపోయో, లేక ఇటువంటిదేదో చిలిపి సాకులతో మరణించాడని అక్కడినుంచి వార్త రావచ్చు" అన్నది కృష్ణవేణి తొణకకుండా.

రావు తన చెవులను తాను నమ్మలేక పోయాడు. మూగవోయి ఆమెవైపు చూచాడు. ఆర్ద్రనయనాలతో కొంటెగా నవ్వుతో తనవైపే చూస్తోంది. తనచేయి చాచి ఆవిడ చెయిని గట్టిగా నొక్కి పట్టి ఆవిడ కళ్ళల్లోకి చూస్తూ "నిన్నొక్కసారిగా పోగొట్టుకున్నానని భయపడి పోయాను కృష్ణవేణీ!" అన్నాడు ఉపశమనం పొందుతూ.

"ఒంటెజబ్బువల్లనా లేక మునిగిపోవటంవల్లనా?" అన్నది కృష్ణవేణి సీరియస్‌గా

[డబ్ల్యు. డబ్ల్యు. జేకబ్స్ ఆధారం.]



(గత అధ్యాయం తరువాయి)

రోజూ మధ్యాహ్నం అలమరలోని పుస్తకాల్లో ఏదో ఒకటి ఏరి పత్తాతో చెప్పి తీసుకుని, వెదురుతోపులోనికి వెళ్ళి, ఏ పచ్చి కొమ్మలో ఆకులతో సహా విరుచుకు వచ్చి నీడను పరుచుకుని, బోరగా పడుకుని, ఆ పుస్తకాన్ని ఆప్యాయంగా చదువుకునేవాడు. అబ్బో! ఎన్ని పుస్తకాలని! ప్రణయ ప్రతిమ, సరోజ్ - సరోజినీ, కుసుమకుమారి, దస్యుదుహిత, ప్రేమపరిణామం, గోపీశ్వరుని గుప్తకథ...లాంటివి ఎన్నో ఉన్నాయి. ఒక్కొక్కటే తీసుకెళ్లి సాంతం చదవనిదే విడిచిపెట్టేవాడు కాదు. కళ్లు మంటలెక్కి కణతలు టకటక కొట్టుకుంటున్నా చదువుతూనే ఉండేవాడు. ఎప్పుడు చెరువుగట్టున చెట్లనీడలు పొడుగైపోయి, చెరువులో నీళ్ళపై నాచుమీదికి ప్రాకిపోయేవో, అసలు ప్రొద్దు ఎలా జారిపోయి పడమటివైపున బుడుంగ్ మనేదో, వాడికా దృష్టే ఉండేది కాదు.

అహా! ఏం కథ...! సరోజ్-సరోజినిని వెంటపెట్టుకుని నౌకలో ముర్షిదాబాద్ వెడుతున్నాడు. మార్గమధ్యంలో నవాబుభటులు నౌకను కొల్లగొట్టి వాళ్లను బందీలుగా పట్టుకున్నారు. నవాబు హుకుం ప్రకారం సరోజ్‌కి మరణదండన విధించబడింది. సరోజినిని ఓ చీకటిగదిలో బంధించి ఉంచారు. అర్ధరాత్రివేళ గది కవాటాలు తెరుచుకున్నాయి. నవాబు తప్ప త్రాగి తూలుతూ వచ్చి ఇలా అన్నాడు.—'సుందరీ నా ఆజ్ఞ ప్రకారం సరోజ్ మరణించాడు. ఇంకెందుకు...' వగైరా...సరోజిని సదర్పంగా శిరస్సు పంకించి అన్నది—'ఓరీ పిశాచమా! రాజపుత్రరమణి యనిన నెట్టిదో యెరుగుదువా? ఈ కంఠమున ప్రాణముండగా....' వగైరా ... ఇంతలో ఎవరి పదాఘాతానికో కారాగారగవాక్షం విరిగి పడింది. త్రుళ్లి పడి చూశాడు. నవాబు ఎదుట జటాజూటధారి, తేజశ్శాలి అయిన ఓ సన్యాసి, యమకింకరుల్లాంటి నలుగురయిదుగురనుచరులు కన్పించారు. సన్యాసి రోషకషాయిత నేత్రుడై 'ఓరీ, నరాధమా! రక్షకుడివి భక్షకుడివి వయ్యెదవా?' అని, తర్వాత సరోజినివైపు తిరిగి, 'తల్లీ! నేను నీ భర్త గురువుని. నా పేరు యోగానంద స్వామి. నీ భర్తకు ప్రాణహాని జరుగలేదు. నా కమండలువులోని జలముతో పునర్జీవితుడయినాడు. నీవిప్పుడు నా ఆశ్రమానికి రమ్ము. తల్లీ! చిరంజీవి సరోజ్ నీ కొరకై ప్రతీక్షిస్తున్నాడు...' అన్నాడు...రచయిత శైలి అద్భుతం! పాఠకులకు తరువాతి అధ్యాయం మీద ప్రబలమైన ఆసక్తిని కల్గింపచేస్తూ ఎంత చక్కగా రాశాడు!...'పాఠక మహాశయా! రమ్ము, వన్యభూమిలో సరోజ్ మరణశిక్షకు గురిఅయినాడా మరల ఎట్లు పునర్జీవితుడయ్యెనో పరికింతము రమ్ము' వగైరా...

అనువాదం
మద్దిపట్ల సూరి

ఒక్కొక్క అధ్యాయమే చదువుతున్న కొద్దీ అపూ కళ్లు మిరుమిట్లుగొలిపి, గొంతు పట్టుకుపోయేది. ఒకటి రెండు నిమిషాలు పైకి చూస్తూ ఏమాలోచించేవాడో, ఆనందంతో, ఆశ్చర్యంతో, ఉత్తేజంతో వాడికి చెవుల్లోంచి ఆవిర్లు వచ్చేవి. ఉగ్గపట్టుకుని తరువాతి అధ్యాయం చదివేవాడు. ప్రొద్దు క్రుంకిపోతూ, చుట్టూ నీడలు పొడుగై, పైన వెదురుచెట్లమీద పక్షుల కలకలం ప్రారంభమయేది. లేద్దాం లేద్దాం అనుకుంటూనే పుస్తకం మరీ కళ్లలోకి పెట్టుకుని, అక్షరాలు అలుక్కుపోయేలా కన్పించేటంత వరకూ అలాగే చదువుతూండేవాడు.

—ఇలాంటి పుస్తకాలిదివరకెప్పుడూ చదవలేదు వాడు. వీటిముందు 'సీతా వనవాసం' 'ధ్రువుని కథలూ' అయితేమాత్రం ఎంత!

ఇంటికి రాగానే తల్లి- 'ఇంత వెర్రివాడివవుతున్నావేంరా! పుస్తకాలమీద అబ్బ కొద్దీ, ఎవరి చేపల కాపలాకో అర్ధాహ్నపు అడవిలోకి ఒక్కడివీ పోయి కూర్చుంటావా? మొత్తానికి నీకే వెర్రే పట్టుకుంది!' అని కేకలేసేది.

కాని ఆ వెర్రిపిల్లవాడికి ఎలాంటి లాభం కలుగుతోందో - వాడి తల్లికి దాన్ని గురించిన ఆలోచనే లేదు. వాడికిప్పుడు 'మహారాష్ట్ర జీవనప్రభాతం', 'రాజపుత్ర జీవనసంధ్య' రెండు పుస్తకాలు దొరికాయి. వాడి కళ్ళకు ఎదుటి చెట్లూ పుట్టలూ అన్నీ మారిపోయి, వాటిలో దృశ్యాలు ఒక్కొక్కటే కన్పిస్తూఉంటాయి. ...అదుగో, జయలేఖ గాయపడిన నరేన్‌కి నదిఒడ్డున పరిచర్య చేస్తోంది...ఔరంగజేబు దర్బారులో అయిదు వేల సైన్యానికి అధిపతులయిన 'మన్సబ్‌దార్ల' మధ్య తనకు ఆసనం ఏర్పాటుచేసినందుకు శివాజీ లోపల్లోపల ఉడికిపోతూ - 'శివాజీ అంటే అయిదు వేల సైన్యానికేనా అధిపతి! ఒకసారి పూనా వచ్చి చూస్తే ఈ శివాజీ సైన్యంలో ఇలాంటి 'మన్సబ్‌దార్'లెంతమంది ఉన్నారో తెలుస్తుంది' అనుకుంటున్నాడు...

రాజపుత్రస్థానం ఎడారుల్లో, ఢిల్లీ—ఆగ్రాలలోని రంగమహల్, శీష్‌మహల్లో మేలిముసుగులు ధరించిన సుందరీమణుల మధ్యనే అపూ రోజంతా గడిపేవాడు...అది ఏ జగత్తో! అక్కడ యెప్పుడూ వెన్నెలే, ఎప్పుడూ కత [illegible]

జరిగినకథ:—

నిశ్చిందిపురం బెంగాల్‌లోని మారుమూల కుగ్రామం. ఆ ఊళ్లో చితికిపోయిన మధ్య తరగతి సంసారి హరిహరరాయ్. అతని భార్య సర్వజయ. కూతురు దుర్గ. హరిహరరాయ్ పెళ్ళయిన తరవాత కొంతకాలం దేశాలు పట్టిపోయి, శాస్త్రాలు, కావ్యాలు చదివి పండితుడై, పదేళ్ళకి తిరిగివచ్చి కాపరంపెట్టాడు. దుర్గ పుట్టిన చాలఏళ్ళకి అతనికి కొడుకు పుట్టాడు. వాడిపేరు అపూ. ఇంట్లో ఎప్పుడుచూసినా 'ఇవాళ ఎలా గడుస్తుందిరా భగవంతుడా' అనే చింతే. కాని పిల్లలకిదేం పట్టింది? దుర్గకి ఒక్కనిమిషం ఇంట్లో కాలు నిలవదు. ఎప్పుడూ ఏ తోటలోనో, ఏ చెట్టుకిందనో ఆడుకుంటూ ఉంటుంది. అపూ ఎప్పుడూ ఊహాలోకంలోనే గడుపుతాడు. వాడికి ప్రతిదీ కొత్తే. ప్రతిదీవింతే. వాడి జీవితపరిధిలోకివచ్చే ప్రతి సాధారణవిషయమూ అసాధారణమైనదిగా, అద్భుతమైనదిగా వాడికి కనిపిస్తుంది. బడి చదువుకూడా వాడికి ఏమీ అంటలేదు. ఇంట్లోనే తండ్రితాలూకు పుస్తకాలన్నీ చదివేస్తూ ఉండేవాడు. ఒకసారి వాళ్ల ఊళ్లోకి ఒకనాటక సమాజం వచ్చింది. వాళ్లువేసిన నాటకాలు చూసి అపూ తన్మయుడైపోయాడు. తనుకూడా పెద్దయ్యాక నాటక సమాజాల్లో చేరి నటుడైపోవాలని కలలు కన్నాడు తను చూసిన నాటకం కథ ఆధారంగా స్వయంగా ఒక నాటకంకూడా రాసేశాడు. మొత్తానికి వాడి ఆదర్శాలకు ఆకాశమే అవధి. దుర్గకి మంచి సంబంధం ఏదన్నా చెయ్యాలని తల్లి ఆవేదన పడేది. కాని మంచిసంబంధాలనేవి హరిహరరాయ్ కుటుంబానికి ఎన్నటికీ అందని ద్రాక్షపండ్లే. ఎప్పుడో ఏదో అదృష్టం కలిసివచ్చి తమ సంసారం బాగుపడుతుందనీ, దుర్గ గొప్ప ఇంటి కోడలైపోతుందనీ, అపూ పెద్దవాడై ప్రయోజకుడై తమ కష్టాలు గట్టెక్కిస్తాడనీ ఆమె కలలు కనేది. కాని ఆ కలలు కల్లలుగానే మిగిలిపోయాయి.

ఒకసారి దుర్గకి జ్వరం పట్టుకుని ఎన్నాళ్ళకీ తగ్గలేదు. హరిహరుడు ఊళ్ళోలేడు. తల్లి, పిల్లలూ తిండికికూడా మొహం వాచిపోయారు. ఆఖరుకి ఒక భయంకరమైన రాత్రివేళ, వర్షం ప్రళయంగా కురుస్తున్నవేళ దుర్గ ప్రాణవాయువులు అనంతంలో లీనమైనాయి. ఆమె జనన మరణ, సుఖదుఃఖ ద్వంద్వాతీతమైన ఏదో అజ్ఞాతలోకానికి వెళ్లిపోయింది. హరిహరుడు ఊరినుంచి తిరిగి వచ్చినతరవాత గాని దుర్గ మరణం వార్త అతనికి తెలియలేదు.

★ పథేర్ పాంచాలి ★

'ఆహీరియా'ల్లో బల్లెములు ధరించి గుర్రాలెక్కి దవిటిమిట్టల్నీ, మొక్కజొన్న చేలను దాటుతూ పరుగెత్తటాలే...

వీరులకు, రాజపుత్రులకు సాధ్యమైనదంతా చేశాడు. ప్రతాపసింహుడు 'హల్ది ఘాట్' పర్వత మార్గంలో ప్రతి రాతిమీద అతడి వీరగాథ లిఖితమై ఉంది. మేవార్ రణక్షేత్రంలోని పన్నెండువేలమంది రాజపుత్రుల హృదయరక్తంతో అతడిగాథ శాశ్వతంగా చెరిగిపోకుండేట్లు ఉల్లిఖితమై ఉంది.

వృద్ధయోధులు ఆ హల్దిఘాట్ అద్భుత వీరగాథ — చాలాకాలంవరకు చెపుతూ కూర్చునేవారు.

అదృశ్యహస్తంతో విపరీత బలం వచ్చిపడింది...అపూ ఈ గ్రామంలో, ఈ పచ్చ[illegible] ఈ తడిసిన [illegible] వాసనలమధ్య పుట్టి పెరిగినవాడు. అయినప్పటికీ రాజపుత్రస్థానంలోని భిల్లప్రదేశం, ఆరావళి, మేవార్‌లలో ప్రతిచోటూ, పాహీరా, దుర్గాల అపూర్వవన్యసౌందర్యం వాడికి బాగా పరిచితమైనవే...పర్వతం మీదనుంచి దిగి వస్తున్న శస్త్రపాణి అయిన తేజసింహుని మూర్తి — ఎంత రీవిగా ఉంది!...

...సూర్యగడ్ యుద్ధం, సేనాపతి కాహ్ బాజ్ ఖాన్, అపురూపసుందరి నూర్జహాన్, వీర బాలుడు చందన్ సింహ్ — చాలా దూరం పోతున్నాయి ఆలోచనలు. అయినా ఎంత వాస్తవికం, ఎంత సన్నిహితమైనట్టుంటాయి!...

చిత్తూరు రక్షింపబడలేదు. రాణా అమరసింహ్ బాదుషా సన్మానాన్ని స్వీకరించాడు. సర్వస్వాన్నీ కోల్పోయిన తండ్రి ప్రతాపసింహ్, ఇరవై అయిదు సంవత్సరాలు, అరణ్యాల్లో, పర్వతాల్లో నానా కష్టాలూపడి తిరుగుతూ యుద్ధాలు సాగించిన వీరాధివీరుడు. వ్యథాక్షుబ్ధహృదయంతో ఎక్కడఉండి చూస్తున్నాడో ఇదంతా!...

"వేసి కన్నీటిచుక్కలు జారి...మళ్లీ యీ చెరువు, చెట్లూ, పుట్టలూ అన్నీ అల్లుకుపోయినట్లు కన్పించేవి అపూదృష్టికి...

ఆ రోజున మధ్యాహ్నం వాళ్ళ నాన్న కాగితంమడత ఒకటి చూపిస్తూ "చూడు; ఇది. ఏమిటో చెప్పుకో చూద్దాం" అన్నాడు నవ్వుతూ.

అపూ చటుక్కున లేచి కూర్చుని, ఎక్కడలేని ఉత్సాహంతో "పత్రిక కాదూ నాన్నా?" అని అడిగాడు.

ఆ రోజున 'రామకవచం' వ్రాసి ఘట్టి బిహారీఘోష్ అత్తగారి దగ్గిర మూడు రూపాయలు సంపాయించాడు హరిహరుడు. భార్యకొపంగతి చెప్తుండా, వాటిలో

రెండు రూపాయలు పత్రిక చందా పంపించాడు. భార్యకు తెలిస్తే ఇంట్లో ఎప్పుడూ ఏదో ఒకటి లేకపోవటం మామూలే గనుక వాటి కింద ఖర్చు అయిపోయేవి. ఈ రెండు రూపాయలూ మిగిలేవి కావు

అపూ తండ్రిచేతులోంచి ఆ కాగితం చుడతి లాక్కుని విప్పి చూశాడు. పత్రికే! పెద్ద పెద్ద అక్షరాల్లో 'వంగవాసి' అని ఉంపటం, ఆ క్రొత్త కాగితాల వాసన, ఆ అచ్చు అంతా అదే పత్రిక! ఏడాది క్రితంవరకు ప్రతి శనివారం పోష్టు బంట్రోతు ఎప్పుడొస్తాడా అని భువన ముఖర్జీగారి మంటపంలో 'తీరంలో కాకి' లాగా అవురావురమంటూ ఎదురుచూస్తూ కూర్చునేవాడే - ఈ పత్రికకోసమే! పత్రిక! పత్రిక! ఏం క్రొత్తవార్తలున్నాయో!

రెండు రూపాయలు ఖర్చుపెట్టినందువల్ల కుర్రవాడి ముఖంలో వ్యక్తమైన ఆనందం-ఏ తాకట్టునగో విడిపించుకుని వచ్చినంత సంతృప్తికంటె ఏవిధంగానూ తక్కువ కాదు.

అపూ కాస్త చదివి—"చూడు నాన్నా! ఓ 'విదేశ యాత్రికుని లేఖలు' పడుతున్నాయి ఇందులో. ఇవాళే మొదటి లేఖ వచ్చింది: మంచి సమయంలో వచ్చింది మనకు పత్రిక. కాదు నాన్నా" అన్నాడు.

"నీ పుస్తకంలో నువ్వేమిటిరా రాసింది? అని అడిగింది ఒకరోజున రాణి.

అపూ ఆశ్చర్యంతో "ఏ పుస్తకంలో? నువ్వెలా..." అని అడిగాడు.

"— నేను ఆ రోజున మధ్యాహ్నం మీ యింటికి రాలేదూ? నువ్వు లేవు ఇంట్లో. పిన్నితో కూర్చుని చాలాసేపు మాట్లాడాను. పిన్ని నీకు చెప్పలేదూ? అప్పుడు చూశానులే నీ దస్తరంలో. ఎర్రట్టపుస్తకంలో ఏమిటి రాశావ్? - నా పేరుంది. ఒకటి దేవీసింహో ఏదో ఇంకొక పేరు—"

అపూ సిగ్గుతో కందగడ్డయిపోయి—"అదొక కథ" అన్నాడు.

"ఏం కథ? నాకు చదివి విన్పించాలి మరి!"

మర్నాడు రాణి చిన్న బైండుపుస్తకం ఇస్తూ "ఇందులో నాకొక కథ రాసిపెట్టు నువ్వు. మంచికథగా ఉండాలి రాసి ఇస్తావా? నువ్వు బాగా రాయలేవన్నది అతసి రాసి ఇయ్యి. నేను అతసికి చూపెడతాను" అన్నది.

అపూ రాత్రి ప్రమిదదీపం దగ్గర కూర్చుని రాస్తున్నాడు. "ఇంకొక గరిటెడు నూనె వెయ్యి అమ్మా! ఈ కాస్తా రాసి కటిపెడతాను ఇవాళికి" అన్నాడు అపూ. "ఇవాళ రాత్రి కింక వీల్లేదు అసలున్నదే రెండు గరిటెల నూనె. మళ్లీ రేపురాత్రి



"పథేర్ పాంచాలీ" లో అపూ.

(డిజైన్: సత్యజిత్‌రాయ్)

వంట ఎలా చేసేది? ఇక్కడ వంట చేస్తున్నాగా, ఈ నెలుతురులో వచ్చి కూర్చో..." అన్నది తల్లి. అపూ జగడమాడాడు.

"రాత్రిఅయాక వస్తాయి ఎక్కడలేని చదువులు, రాతలు. పగలల్లా ఏం వెలగబెడుతున్నట్లో! ప్రొద్దున్నేం చేస్తావ్? పో, నే నివ్వను నూనె" అని కసిరింది తల్లి

చివరకు అపూ పొయ్యిమంట వెలుతురులోకి పుస్తకం తెచ్చుకుని కూర్చున్నాడు— సర్వజయ తనలో తాను అనుకున్నది — "అపూ ఇంకొస్త పెద్దవాడైతే వాడికి మంచి సంబంధంచూసి, పెళ్లి చెయ్యాలి! ఈ పాతకొంపకి బదులు గట్టియిల్లు అమరాలి. వచ్చేయేడు ముందు వడుగు చేసేస్తే, తర్వాత గంగూలీగారింట్లో పూజకి కుదిరితే-"

నాలుగయిదురోజు లయినాక అపూ రాణికి పుస్తకం తిరిగి ఇచ్చేశాడు. రాణి ఆదరా బాదరా పుస్తకం తెరుస్తూ "రాశావా?" అని అడిగింది.

అపూ నవ్వుముఖం పెట్టి "తీసి చూడరాదూ?" అన్నాడు.

రాణి పుస్తకం తీసిచూస్తే, ఆనందంతో

★ పథేర్ పాంచాలీ ★

"చాలా రాశావే! ఉండు, అతసీని పిలిచి చూపించాలి" అన్నది.

అతసీ చూసి, "అపూ రాశాడా, ఇంకేవ రయినా—ఇష్-ఇదంతా ఏదో పుస్తకంలో చూసి రాసింది..." అన్నది.

"పుస్తకం చూసి రాసిం దెందు కయింది! నేను కథ లలుతాను—ఇంకా పటూని అడిగి చూడు అతసీదీ! వాడిని సాయంకాల మప్పుడు ఏటిఒడ్డున కూర్చోపెట్టుకుని ఎన్ని కథలల్లి చెప్పేవాణ్ణని!" అన్నాడు అపూ.

"కాదు అమ్మాయ్, అపూ యే రాశాడు, నాకు తెలుసు. వా డిలాంటివి రాస్తూ ఉంటాడు సొంతంగా నాటకంరాసి నాకు చదివి వినిపించాడు కూడా....." అని అపూతో—"నీ పేరు రాసుకోలేకేం? రాసి ఇయ్యి" అన్నది రాణి

అపూ ఈ సారి కొంచెం తెల్లబోతూ "కథంతా ఇంకా పూర్తి చెయ్యలేదు, పూర్తి చేశాకగా చివర పేరు రాసుకోవటం" అన్నాడు. 'సచిత్ర యావనే—యోగినీ' నాటకం ధోరణిని కథ మొదలుపెట్టాడు. కాని దాన్ని చివరకు ఎలా ముగించాలో ఎంత ఆలోచించినా ఇంకా తోచలేదు వాడికి. ఎక్కువరోజులు పుస్తకం తనదగ్గరే పెట్టుకుని కూర్చుంటే రాణూదీ—ముఖ్యంగా అతసీదీ తనరచనాసామర్థ్యాన్ని గురించి ఏం సందేహం పెట్టుకుంటుందో అన్న భయంతో అసంపూర్ణంగా ఉండగానే పుస్తకం తెచ్చిఇచ్చాడు

వాళ్లనాన్న ఊళ్లోలేడు. ప్రొద్దున్నే లేచి, ఊళ్లో అందరితోపాటు పారుగుపోరు శ్రాద్ధ భోజనానికి వెళ్లాడు. అపూతోపాటు సునీల్ కూడా వెళ్లాడు. చాలాదూరం నుంచి—అయిదారు క్రోసులదూరంనుంచీ కూడా నడిచి భోజనాలకు వచ్చారు చాలా మంది. కొందరు నలుగురయిదుగురేసి పిల్లల్ని కూడా వెంటతీసుకువచ్చారు ముందు విస్తళ్లలో నాలుగేసి పూరీలు వడ్డించి, తర్వాత వడ్డనవాళ్లు కూరతీసుకువచ్చేసరికి అందరి విస్తళ్లలో పూరీలూ మాయమయిపోయాయి. అందరూ అంగవస్త్రాల్లో మూటలుకట్టుకుని ప్రక్కన పెట్టుకున్నారు. ఒక కుర్రవాడింత గ్రహింపులేక విస్తట్లో పూరీ తుంచి తినబోయాడు—వాళ్లనాన్న విశ్వేశ్వర భట్టాచార్య, వాడిచేతిమీద ఒక్కటేసి, ఆ పూరీలు లాక్కుని, ప్రక్కన ఉన్న అంగవస్త్రంలో పెట్టి, "ఇవి ఇలా ఉంచు, మళ్ళీ తీసుకువచ్చి వేసినప్పుడు అవి తినొచ్చు" అన్నాడు

తర్వాత కొంతసేపు పెద్దగందరగోళం... 'ఆ పూరీల పళ్లెం ఈ పంక్తికి రానీయండి' 'గుమ్మడికాయకూర అసలే వెయ్యలేదు నా విస్తట్లో' 'అర కాస్త వేడివేడివిగా తీసుకురండోయ్' 'మీ చేతులేపి ఒక్కసారి చూడనీయండి బాబూ! ఒక్తి కుక్కరకం మైదాతో'—ఇదీ గొడవ యజమానికి బ్రాహ్మణులకు ఇంటికెంత మూటకట్టుకు తీసుకువెళ్లాలి అన్న విషయంమీద తగాదా వచ్చింది. ఎవరో కేకలువెయ్యటం మొదలెట్టారు—'అయితే ఇక్కడికి పెద్దమనుష్యులు భోజనానికి రావలసిందికాదు, నాలుగయిదు పుంజీల పూరీలు మూటకట్టుకు తీసుకువెళ్ళే హక్కు మొదటినుంచీ ఉన్నదే. బల్లాల్ సేన్ కాలంనాటినుంచి వస్తున్న సంప్రదాయం ఇది. మాకేం అక్కర్లేదు ఇలా అయితే కందర్పముజుందార్ ఇలాంటిచోట ఎప్పుడూ—'

యజమాని కందర్పముజుందార్ని కాళ్లా గడ్డం పుచ్చుకుని ప్రసన్నుణ్ణి చేసుకున్నాడు.

అపూకూడా ఓమూట తెచ్చుకున్నాడు. సర్వజయ గబగబా బయటకివచ్చి నవ్వుమొహంతో "అబ్బ, ఎంతమూట తెచ్చావురా? విప్పు చూస్తాను ఎన్ని తెచ్చావో! పూరీలు ఎన్ని, లడ్డూ లెన్ని? మూతపెట్టి అట్టేపెడతాను. ప్రొద్దున్నే తిందువుగాని" అన్నది.

"మరి నువ్వుకూడా తినాలి అమ్మా! నీకోసం నేనింకోసారి అడిగి లడ్డూలు వేయించుకుని మూటకట్టుకువచ్చాను" అన్నాడు అపూ.

"ఆఁ, మా అమ్మ తినేందుకు ఇంకొసిని పెటండి అని అడిగావా ఏరా నువ్వు? నువ్వు ఒట్టి వెర్రిమొహానివిరా!" అన్నది సర్వజయ

అపూ తల, చేతులూ కూడా త్రిప్పుతూ "ఊఁ. అలా అడుగుతావా ఏమిటి! ఊరికే నే అడిగాను, నేనే తింటానని అనుకున్నారు వాళ్లు" అన్నాడు

సర్వజయ సంతోషంతో మూట ఇంట్లోకి తీసుకుని వెళ్ళింది.

కొంచెంసేపయాక అపూ సునీల్ వాళ్లింటికి వెళ్ళాడు. వాళ్ల వసారాలో అడుగు పెట్టగానే - 'అవన్నీ మూటకట్టుకుని ఎందుకు తీసుకువచ్చావ్ ఇంటికి? ఎవరు తీసుకురమ్మన్నారు నిన్ను?' అని సునీల్ తల్లి కొడుకును కేకలెయ్యటం విన్పించింది. అందరూ మూటలు కట్టుకురావటం చూసి, సునీల్ కూడా కట్టుకుని వచ్చాడు. 'ఏం అమ్మా? అందరూ తెచ్చుకున్నారు. అపూ తెచ్చాడుగా!' అన్నాడు సునీల్.

"అపూ, ఎందుకు తెచ్చుకోడు! వాడు బ్రాహ్మణార్థాలవాళ్ల అబ్బాయి! వాడిహ పూజలూ అవీ చేయిస్తూ భోజనాలకి వెళ్ళిన చోట్లనుంచి ఇలాగే మూటలుకట్టి తెచ్చుకుంటాడు - అదే వాళ్ల అనువాయితీ! వాళ్ల అమ్మ అంతే, ఒట్టి వాపిరిగొట్టు. ఇందుకనే నేను మిమ్మల్ని అప్పుడు ఈవూరు తీసుకురావటానికి ఒప్పుకోనిది! వీళ్లతో కలవటంవల్ల ఎంత పాడుగుణాలు అలవడ్డాయి! పో, వెళ్ళి అపూని పిలిచి అన్నీ ఇచ్చేసిరా, లేదా అవతల పారెయ్. భోజనానికి పిలిస్తే వెళ్ళి భోంచేసిరావాలి అంతే కాని, లేకివాళ్లలాగా అవన్నీ మూటకట్టి తెచ్చుకుంటారా?" అన్నది సునీల్ తల్లి

అపూ భయపడి ఇంక వాళ్ళింట్లోకి వెళ్ళలేదు. ఇంటికి వస్తూ వస్తూ తనలో తాను అనుకున్నాడు. 'అమ్మ చూసి అంత సంతోషించింది! పెద్దమ్మ వాటినే చూసి ఇంత కోప్పడింది ఎందుకనో! మిఠాయి ఉండలూ అవీ, ఏం మట్టిగడ్డలా పారెయ్యటానికి? తన తల్లి వాపిరిగొట్టుదా? తాను బ్రాహ్మణార్థాలవాళ్ళఅబ్బాయా? సునీల్ వాళ్లమ్మ పూరీలు, మిఠాయి ఉండలూ ఎన్నో తిని ఉంటుంది! తన తల్లి యెప్పుడూ అంతగా తిని యెరుగదు. నిజానికి నేనుమాత్రం ఇలాంటివన్నీ యెప్పుడు తిన్నాను గనక! సునీల్ విషయంలో అన్యాయమయితే అది తన విషయంలో కూడా ఎలా అన్యాయం అవుతుంది!'...

వాడేమీ పెద్దచదువు చదువుకోలేదు. వాడిలాంటిపనులే చేస్తూ తిరగాలి. బ్రాహ్మణార్థాలు చెయ్యటం, భోజనానికి వెళిన చోటనుంచి మూటలుకట్టి తెచ్చుకోవటం, తండ్రితోపాటు శిష్యుల యిళ్లకు వెడుతూండటం, చేపలుపట్టటం! ఆ చిన్నకుర్రవాడు పటూ—బెస్తవీథికి గోళీ లాడటానికి వెళ్ళి



అమిత సౌందర్యము కొరకు
మీ చర్మమును యౌవనంగాను, ఉల్లాసితంగాను—
శుభ్రంగాను, మనోహరంగాను ఉంచుకొనుడు. మనోహర
మైన సహజ సౌందర్యమును రూఢిగా పొందుడు.
"'హేజ్‌లైన్' స్నో" మీ చర్మమును చల్లగాను,
కాంతివంతముగాను, సుందరముగా నొనర్చును.
"'HAZELINE' SNOW"
(TRADE MARK)
"'హేజ్‌లైన్' స్నో" (ట్రేడ్‌మార్క్)
బరోస్ వెల్‌కమ్ & కం. (ఇండియా) ప్రైవేట్ లి పి. ఒ. బాక్సు 290, బొంబాయి
HAZELINE SNOW

★ పథేర్ పాంచాలీ ★

చేతుగా దెబ్బలు తినివచ్చినవాడు — ఇలాంటి విషయాలన్నిటిలో అపూకి తోడు. ఇప్పుడు వాడు ఇంకొంచెం పెద్దవాడయినాడు-చాలా తెలివిమీరాడు. ఎప్పుడూ అపూతోనే తిరుగుతుంటాడు. అపూతో ఆడుకోటానికి ఆ వీథినుంచి ఈ వీథి కింతదూరం వస్తాడు. ఇంకెవరితోనూ అంతగా కలసి ఆడకోడు. తనను కాపాడబోయి అపూదా బెస్తపిల్లల చేతిలో దెబ్బలుతినటం వాడింతవరకు మరిచిపోలేదు.

చేపలు పట్టటం అంటే అపూకి చాలా సరదా. సోనాడాంగా మైదానానికి దిగున ఇచ్ఛామతినది అంచున, 'కాంచికాటా' కొలను పుట్టినచోట గాలంవేస్తే కావలసినన్ని చేపలు దొరుకుతాయి సాధారణంగా వాడు అక్కడికేవెళ్ళి, నదిఒడ్డున ఓ పెద్ద పొన్న చెట్టుక్రింద చేపలు పడుతూ కూర్చుం టూఉంటాడు. ఆ చోటు వాడికి బాగా నచ్చినచోటు. నిర్జనంగా ఉంటుంది నదికి అటూ యిటూ ఒడ్డునఉన్న ఎన్నో చెట్లు నీళ్లలోకి ఒరిగి పడిపోతున్నట్లు ఉంటాయి అటువైపున పచ్చటి ఉల్లుగడ్డి పొలాలు అక్కడక్కడ తీగెలు వ్రేలాడుతూంటే కడిమిచెట్లు, బూరుగుచెట్లు, ఊదారంగు అడవి బచ్చలి పూలతో నిండి ఉండేపొదలు, దూరంగా మాధవపురం వెదురుతోపు, పక్షుల కలకలాలతో, చెట్లనీడలతో, ఉల్లుగడ్డి శ్యామలత్వంతో అలుముకుపోయిన స్నిగ్ధమైన ఏకాంతప్రదేశం!

చిన్నప్పుడు ఆ నీలిమైదానానికి వెళ్ళినప్పట్నుంచి వాడికీ నగులవాన్న, అడవులన్నా, మైదానాలన్నా ఒక విచిత్ర వ్యామోహం ఏర్పడింది గాలం నీళ్లలో వేసి, పొన్న చెట్టుక్రింద కూర్చుని వాలుగుపైపులా చూడగానే వాడి మనస్సు పులకితమైపోతూంటుంది. చేపలు దొరకనీ, దొరకకపోనియ్ — సాయంకాలం మైదానం అంచునఉన్న ఖర్జూరపుపొదలలోని అరముగ్గిన పండు గుప్పున వాసనలు కొడుతూంటాయి వాలుగుపైపులనుంచి కోకిలల కూజితాలు, చల్లగాలిలో తేలివచ్చి వినిపిస్తూ ఉంటాయి ప్రతి చెట్టుకొమ్మమీదకి సూర్యుడు తన స్వర్ణకాంతుల్ని ప్రసరింపచేసి, సోనాడాంగా మైదానంలోని ఆ దొంగలముర్రి



చాటుకువెళ్ళి క్రుంగిపోతూంటాడు. నదిలోని నీళ్లు నలుపు తిరుగుతాయి. నీటిగోరువంకలు కలరవాలు చేస్తూ గూళ్ళకు చేరుకుంటూ ఉంటాయి. అలాంటప్పుడు వాడి మనస్సు పరవశమైపోతూంటుంది పులకితగాత్రుడై వాలుగుపైపులా పరికించి చూస్తూంటే — చేపలు దొరకకపోయినా రోజూ ఇక్కడికి — సరీగ్గా "ఈ పొన్నచెట్టు క్రిందికి వచ్చి కూచుంటే చాలదూ, ఇంకేం కావాలి?" అనిపిస్తుంది.

చేపలు సాధారణంగా దొరికేవి కావు. గాలం చివర కట్టిన బెండు నిశ్చలంగా అలా నీటిమీదే తేలిఉండేది ఒకచోట చాలాసేపు ఊరికే కాచుకుని కూర్చోటం గిట్టేదికాదు వాడికి అటూ యిటూ హడావిడిగా తిరిగి, చెట్లల్లో, పొదల్లో పక్షిగూళ్లు ఎక్కడెక్కడ ఉన్నాయో వెదకి, వచ్చి చూస్తే ఆ గాలం బెండు కాస్త కదులుతున్నట్లనిపించేది. గాలంతీసిచూసి భ్రమపడేవాడు. తర్వాత ఇహ అక్కడనుంచి లేచి కొంచెం దూరంగా నాచు ఉన్నచోటికి పోయి ఎరపెట్టి చూసేవాడు అక్కడ నీటిలోతు, నలుపుచూస్తే అక్కడ పెద్ద పెద్ద రోహితమత్స్యాల్లాంటివే దొరుకుతాయనిపించేది. ఆ భ్రమ తొలగిపోవటాని కెంతోసేపు పట్టేదికాదు గాలం బెండుకి నిర్వికల్పసమాధిస్థితి పట్టేది......

ఒక్కొక్క రోజున ఏదైనా పుస్తకం వెంట తెచ్చుకునివచ్చి కూర్చునేవాడు

గాలం వేసి, పుస్తకం తెరుచుకుని కూర్చునేవాడు. సురేష్ దగ్గర్నుంచి చిన్న సైజు ఇంగ్లీషు పుస్తకం-బొమ్మలతో కూడా ఉన్నది, దాని అర్థాలపుస్తకంకూడా అడిగి తెచ్చుకున్నాడు ఇంగ్లీషు వాడికి అర్థం కాదు అర్థాలపుస్తకం చూసి, బెంగాలీలో ఉన్న ఆ ఇంగ్లీషు కథలు చదివేవాడు. ఇంగ్లీషు పుస్తకంలోని బొమ్మలుమాత్రం చూసేవాడు. దూరదేశాల కథలు, ధైర్య సాహసాలకి సంబంధించిన కథలూ అంటే చిన్నప్పట్నుంచీ వాడికి చాలా ఇష్టం అలాంటి కథలీ పుస్తకంలో చాలా ఉన్నాయి. ఎక్కడో ఓ విదేశయాత్రికుడు ఎడారిలాంటిచోట ప్రయాణిస్తూ మంచు తుపానుకి దారితప్పి, ఎంతసేపటికీ అక్కడే తిరుగుతూ, చివరికి చలికి ఎలా బిగుసుకుపోయి చచ్చిపోయాడో, క్రిస్టఫర్ కొలంబస్ సముద్రంమీద ఒయలుదేరి అమెరికాని ఎలా కనుగొన్నాడో — అన్నీ ఇలాంటి కథలు... ...

సర్ ఫిలిప్స్ సిడ్నీ సంగ్రహగాథ చదివేసరికి వాడికి కళ్లు చెమగిలాయి. సురేష్ దగ్గరకెళ్ళి - "సురేష్‌దా! నీకు తెలుసా ఈ కథ కాస్త వివరంగా చెప్పవూ?" అని అడిగాడు.

"ఓ, జుట్‌ఫెన్ (Zutphen) యుద్ధగాథా?"

అపూ తెల్లబోతూ "ఏమిటి సురేష్‌దా! జుట్‌ఫెన్నా? ఎక్కడున్నదది?" అని అడిగాడు. సురేష్ అంతకు మినహా ఇంకేమీ చెప్పలేదు.

నెల్లాళ్ళ తర్వాత ఓ రోజున...

చేపలు పట్టటానికై వెడితే అపూ గాలానికి ఓ పెద్ద చేప చిక్కింది.

ఇంకా అంతంత చేపలు దొరుకుతాయనే ఆశ కొద్దీ వాడింక ఆ చోటు విడిచి పెట్టలేదు చెట్ల కొమ్మలు విరుచుకువచ్చి పరచుకుని కూర్చున్నాడు.

క్రమంగా ప్రొద్దు వాలిపోతోంది ఏటి ఒడ్డున నిశ్శబ్దంగా ఉండే ఆ మైదానం, అవతలిగట్టున సుదూర వ్యాప్తమైన పచ్చని ఉల్లుగడ్డి బయలు, రెల్లుపొదలు కడిమి-బూరుగు చెట్ల చిటారు కొమ్మల మీదినుంచి జారిపోతున్న - తన ఆ బాల్యమిత్రమయిన బంగారు కాంతులీనే నీరెండ — ఏవేవో స్మృతికి తెలుస్తున్నాయి

"వంగవాసి"లో విదేశయాత్రికుని లేఖల్లో చదివిన ఆ చక్కని వీరగాథ వాడికి జ్ఞాపకం వచ్చింది

సురేష్ దగ్గిర ఉన్న ఇంగ్లీషు మ్యాప్‌లో ఫ్రాన్సు దేశం ఎక్కడున్నదీ చూశాడు. పూర్వం ఒకప్పుడు ఫ్రాన్సు మీదికి విదేశీయులు దండెత్తి వచ్చారు. దేశానికి ముప్పు వచ్చి పడింది, రాజు దుర్బలుడు దేశమంతటా అరాచకం జాతికి తలవంపు లొచ్చి పడుతున్న ఈ తరుణంలో ఓ పేద గొర్రెల కాపరి కూతురు - గొర్రెల్ని యథేచ్ఛగా పోనిచ్చి ఏకాంత ప్రదేశంలో ఆకాశంలోకి చూస్తూ దేశదుస్థితిని గురించి ఆలోచిస్తూ కూర్చునేది రోజుల తరబడి ఇలా ఆలోచిస్తూ కూర్చుంటే-"నువ్వే ఫ్రాన్సును రక్షించవలసిన దానివి, నువ్వు కత్తిపట్టుకుని, రాజసైన్యానికి అండగా నిలబడి యుద్ధం చెయ్యి దేశాన్నీ జాతినీ రక్షించవలసిన భారం నీమీద ఉంది." అని ఎవరో చెప్పినట్లు వినిపించింది.

తర్వాత కొత్త బలాన్ని ఉత్సాహాన్ని

RATNAM'S 'N' OIL

సేవించిన పూర్తి సంతోష సౌఖ్యము లనుభవించగలరు.

1 సీసా రూ. 11-4-0.

ఎడ్రెస్సుతో జాబు వ్రాయండి.

డాక్టర్. రత్నం సన్స్,

మలకపేట బిల్డింగ్స్, హైద్రాబాదు - 3

తెచ్చుకున్న ఫ్రాన్సు సైన్యం, శత్రువుల్ని దేశంలోనుంచి ఎలా తరిమి వేయగలిగిందో, ఆ బాలిక కత్తి చేతపట్టి మళ్ళీ తమ రాజును ఎలా సింహాసనం మీద కూర్చోపెట్ట గలిగిందో, తర్వాత అజ్ఞానాంధులైన ప్రజలు ఆమెని ఎలా సజీవ దహనం చేశారో - ఆ కథంతా వాడిటీవల చదివాడు.

ఈ సాయంత్రం వప్పుడు, ఈ యేటి ఒడ్డున కూర్చుని ఆ కథను జ్ఞప్తికి తెచ్చుకుంటూంటే వాడి మనస్సు కేవేవో అపూర్వ భావాలు కలుగుతున్నాయి.

'ఆ బాలిక యుద్ధం చెయ్యటం—జయించటాన్ని గురించి వాడంతగా ఆలోచించ లేదు. వాడికి కళ్లకు కట్టినట్లు కన్పించే దృశ్యం ఇదీ! ఆలోచనా తత్పరురాలై ఏకాంతంగా కూర్చున్న బాలిక, చుట్టూ స్వేచ్ఛగా తిరుగుతున్న గొర్రెలు, క్రింద పచ్చని మైదానం, పైన వినీలాకాశం. ఒక వైపున దుర్ధర్షులయిన విదేశీ శత్రువర్గం, క్రౌర్యం, విజయలాలస, రక్త వాహిని— మరొక వైపున సరళహృదయ, దివ్యశక్తి సమన్విత, వినీలనేత్రి అయిన గ్రామీణ బాలిక...

మరొక చిత్తరువు జ్ఞప్తికి వచ్చేది. నాలుగు వైపులా చాలా దూరంవరకు నీలసముద్రం, మధ్య మార్టినిక్ ద్వీపం. చుట్టూ చెరుకు తోటలు - పైన నీలాకాశం. ఎంతోదూరం - చాలా దూరంవరకూ అంతే నీలాకాశం, నీల సముద్రం. అంతా ఒక్క నీలం. ఇంకా అదేమిటో తెలియటంలా. అసలు—చెప్పటానికి ఎలా!

గాలం తీసేసి, అపూ ఇంటికివెళ్లే సన్నాహంలో ఉన్నాడు. ఏటి ఒడ్డున వున్న తుమ్మచెట్టు, సీమ తుమ్మచెట్లు పల్లటి నదీ జలాలలో పూవుల్ని రాలుస్తున్నాయి. పోనాడాంగా మైదానం మధ్యన దొంగల మర్రి చాటున ఎర్రటి సూర్యబింబం క్రుంగిపోతోంది—ఏ దేవశిశువో మందాకినిలోని ఎర్రని పురుగును స్వర్ణ సముద్రంలోంచి ఊది బుడగగా చేసి, విలాసంగా వియత్తానికి విసిరి ఉంటాడు. అది ఇప్పుడే పశ్చిమ దిగంతంలో చెట్లచేమల మరుగున క్రిందికి పడిపోతుందల్లే వుంది!

వెనకనుంచి ఎవరో వాడికళ్లు మూశారు. అపూ బలవంతాన ఆచేతులు కళ్ళమీదినుంచి లాగివేసుకునే సరికి పటూ కిలకిలా నవ్వుతూ ఎదుటికివచ్చి, "ఎన్ని చోట్ల వెతికినా నువ్వు ఎక్కడా కనపడలేదు అపూదా! తర్వాత అనుకున్నా—నువ్వు చేపలు పట్టటానికి వెళ్లి వుంటావని. అందుకని ఇలా వచ్చాను. చేపలు దొరకలేదా? ఒక్కటి కూడా...? పోనీలే పద, నావయెక్కి కాసేపు తిరిగి వద్దాం" అన్నాడు.

(ఇంకావుంది)

దృశ్య నాటిక:

శ్రీమతులు - శ్రీయుతులు

అంగర సూర్యారావు

: పాత్రలు :

నళిని

సుమిత్ర

రాజ్యం

సావిత్రి

గంగాభవాని

(స్థలం: మహిళామండలి కార్యాలయం.
సమయం: రాత్రి 7 గంటలు.

హాలులో మధ్య ఒక టేబిలు కుర్చీ వున్నాయి. సుమిత్ర కుర్చీలో కూర్చుని దీక్షంగా ఆలోచిస్తూ రాస్తోంది. వయస్సు 30 సంవత్సరాలు. ముఖంలో తెలివి, ఉత్సాహం కనిపిస్తూ వుంటాయి. ఆమెకు యిరువైపులా రెండేసి ఖాళీకుర్చీలు వున్నాయి గోడలకు సరోజినీనాయుడు, కస్తూరీబాయి గాంధీ, దుర్గాబాయి దేశ్ ముఖ్, ఇందిరాగాంధీ, కమలానెహ్రూ మొదలైనవారి ఫోటోలు వున్నాయ్. హాలు అందంగా అలంకరించబడివుంది.)

సుమిత్ర: (రాత ముగించి ఉద్రేకంతో లేచి ముందుకువచ్చి) అన్యాయం, దౌర్జన్యం, యిక సహించడానికి వీల్లేదు. పురుషుల నియంతృత్వాన్ని ఎదుర్కోవాలి. నారీ జగత్తు యావత్తు సంఘటితమై యీ అన్యాయాన్ని ప్రతిఘటించాలి. స్త్రీలు చదువుకోకూడదట! ఉద్యోగాలు చెయ్యకూడదట! యువయాతన అనుభవిస్తూ వంటయింట్లో కుమిలి కృశించాలట! (సావిత్రి కుడివైపునుంచి వస్తుంది. అందంగా అలంకరించుకొంది. వయస్సు 20 సంవత్సరాలు. సుమిత్ర మధ్య, మధ్య చేతిలోని కాగితంకేసి చూస్తూ తన ప్రసంగాన్ని యింకా కొనసాగిస్తూ వుంది. సావిత్రి ఆశ్చర్యంతో ఆమె ప్రక్కకు వచ్చి నిలబడుతుంది.) నీవు భారత స్త్రీవి. భర్త [illegible] గురిచేసినా భరించావు. 'ఛా! ఛీ! పుట్టింటికి పో' అంటే పోయావు. తిరిగి రమ్మంటే వచ్చావు. ఏమన్నా కిమ్మనకుండా వూరుకున్నావ్.

సావిత్రి: (మధ్యలో అందుకొని) వూరుకోక వురిపెట్టుకోమంటారా సుమిత్రాదేవి గారూ!

సుమిత్ర: ఉరి అంటే జ్ఞాపకం వచ్చింది. మగవాళ్ల దౌర్జన్యాలను సహించలేక ఎంతమంది స్త్రీలు ఆత్మహత్య చేసుకోవడం లేదు? (బాహ్య ప్రపంచంలోకి వచ్చి కాగితం మడతపెడుతూ) యింతకూ నాగురించి కాదు సావిత్రీ నేను మాట్లాడుతున్నది. రేపటి మహిళాసంఘం వార్షికోత్సవానికి అధ్యక్షోపన్యాసం తయారుచేసుకుంటున్నాను.

సావిత్రి: అంతేనా! నన్ను చీవాట్లు పెడుతున్నారేమోనని జడిశాను. ఈ సంవత్సరం వార్షికోత్సవం చాలా బాగుండి తీరాలి స్త్రీల సమస్యలను చిత్రించే కొత్త తరగతి నాటకంకూడా వేస్తున్నాం.

సుమిత్ర:- నాటకంలో పురుష పాత్ర వెయ్యడానికి మనవాళ్లెవరూ అంగీకరించడం లేదు. అదొక పెద్దసమస్యఅయి కూర్చుంది.

సావిత్రి: రాజ్యంచేతనే వేయిద్దామనుకున్నాం కాదూ?

సుమిత్ర: ముందు అలాగే అనుకున్నాం. కానీ నిన్న మాటమీద మాటవచ్చి 'మగవాడి పాత్రవంటి నిర్భాగ్యపుపాత్ర నేను చస్తే వెయ్యన'ని రాజ్యం ప్రతిజ్ఞచేసింది.

సావిత్రి. అంతపనీ చేసిందీ!! నేను అనుకుంటూనేఉన్నాను—అయితేమనం ఇంత అద్భుతమైన నాటకాన్ని యిక మానుకోవలసిందేనా?

సుమిత్ర: నిరుత్సాహపడకు సావిత్రీ! రాజ్యం కౌసల్యచేత ఆవేషం వేయిస్తానని చెప్పి వెళ్లింది. బహుశా ఇప్పుడే వస్తుంది

సావిత్రి: (ఉత్సాహంతో) అవును రాగానే వేషాలతో ఫైనల్ రిహార్సల్సు ప్రారంభిద్దాం.

సుమిత్ర: ఏమి చేసినా యిప్పుడే చెయ్యాలి. యిక మనకు టైంలేదు—తరవాత మరోవిషయం. మన వార్షికోత్సవానికి పురుషులకే ఎక్కువమందికి ఆహ్వానాలు పంపించాం.


సావిత్రి: మంచిపనిచేశారు. మన సమస్యలను మగవాళ్లకు తెలియజెయ్యడం చాలా అవసరం. మన బృందగీతం విన్నా, మన నాటకం చూసినా వాళ్ళలో కొంచెమైనా మార్పు రావచ్చు.

సుమిత్ర: (జాలిగా) ఎంత వెర్రిదానవు సావిత్రీ నువ్వు! మగవాడిది రాతిగుండె. ఇటువంటి చిన్న సంఘటనలకు అది కరగదు.

సావిత్రి: మన స్త్రీలలో ఐకమత్యం వుంటే ఏనాడో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చి వుండేవాళ్లం. పెళ్లి దగ్గర నుంచి చావువరకూ స్త్రీ బతుకు అధ్వానం. వేలకువేలు డబ్బు కుమ్మరిస్తేగాని మగాళ్లు మనల్ని పెళ్ళి చేసుకోరు. 'అయ్యో! ఇంత డబ్బు లాగేశాం కదా!' అని అయినా ఆలోచించి మనల్ని సుఖంగా చూస్తారా అంటే అదీలేదు పెళ్ళయిన మర్నాడే వంటయింట్లోకి తోలుతారు. అంటే మనం డబ్బు ఇచ్చి బానిసత్వాన్ని కొనుక్కుంటున్నాం. మన చేతులతో మనమే మనగొయ్యి తవ్వుకుంటున్నాం—యీ అపాయాన్ని పసికట్టిన వెంటనే నేను వరకట్న నిర్మూలన శాఖను స్థాపించాను. (తోలు సంచిలోంచి కాగితాలు తీస్తూ) యిప్పటికి రెండు వేల ఐదువందలవి థైమున్నర స్త్రీలు నా సంఘంలో చేరారు.

సుమిత్ర: మగవాళ్ళు చేరలేదా?

సావిత్రి: చాలా మంది మగవాళ్లు సంఘంలో చేరతామని ఉత్తరాలు రాశారు. ఆ ఉత్తరాలు చాలా తమాషాగావున్నాయి. కొందరు కార్యరంగంలో దూకడానికి నడుం బిగిస్తున్నాం అన్నారు కొందరు దూకుతున్నాం అన్నారు మరికొందరు అప్పుడే దూకేశాం అన్నారు. అయినా [illegible]



ధవళేశ్వరం ఆనకట్టవద్ద పార్కు.

—ఫొటో: నేమాని సూర్యారావు, రాజమండ్రి.

సంఘంలో చేర్చలేను. కాని కొద్దిరోజులలో......... ...

(సరిగ్గా యీ సమయంలో రాజ్యం కేకలు వేస్తూ ధూమధుమగా కుడివైపునుంచి— వీధి కేసి చూస్తూ—వెనక్కి వస్తూ ప్రవేశిస్తుంది ముఖం చూడగానే యిట్టే కోపం వచ్చే స్వభావమని తెలుస్తుంది ఎత్తు మడమల జోళ్ళు, జార్జెట్ చీర, చేతిలో హేండ్ బేగ్ వయస్సు 25 సంవత్సరాలు)

రాజ్యం (కుడి చివర నిలబడి వీధిలోకి చూస్తూ) రాస్కెల్! జాగ్రత్త! యీ మహిళామండలి కార్యాలయానికి వంద గజాల చుట్టుకొలతలో తిరిగి కనిపించు! నీ సంగతి తేలుస్తాను. ఎత్తు మడమల జోళ్ళలో

సుమిత్ర } సావిత్రి } : (ఆత్రుతతో) ఏమయ్యిందీ? ఎవరదీ?

రాజ్యం: (కోపంతో) ఆఁ! ఏం లేదు వాడెవడో దమ్మిడీముండ! నా వెనక పడి 'రాణీ రాజ్యం' 'రాణీ రాజ్యం' అని కాకి గోల ప్రారంభించాడు [illegible] మీ చే బుద్ధి చెబుదామనుకున్నాను కాని దొరకలేదు

సుమిత్ర. ఈ మధ్య మన ప్రాణానికి యిది ఒక కొత్త సమస్య వచ్చిపడింది ఆడది ఒంటరిగా వెళ్లడం భయం

సావిత్రి: నాగరికత ఎక్కువవుతున్న కొద్ది ప్రణయగోపులుకూడా ఎక్కువవుతున్నారు

కుంటూవుంటే యింకా అవుతారు ఈ ప్రణయగోపులకు చికిత్స లేడీస్ బూట్, నక్క కాటుకు చెప్పుదెబ్బ అన్నారు.

సుమిత్ర అబ్బ! నువ్వు చాలా చురుకుగా మాట్లాడతావు రాజ్యం.

రాజ్యం: మగవాళ్ల విషయంలో మనం చాలా చురుకుగా వుండాలి లేకపోతే దెబ్బ తింటాం—రోడ్డుమీద ప్రణయాన్వేషులై తిరిగే యీ యువకులే కొంపలు కూల్చుతున్నారు వీళ్ల విషయంలో చురుకుగా వుండితీరాలి ఈ మగవాళ్లు స్త్రీలలో 'పతిత' లనే ఒక శాఖను సృష్టించారు. మగవాళ్లలో మాత్రం 'పతితులు' లేరట!

ఉంటే [illegible] తెలుస్తుంది. రాజ్యం: (కోపంతో) [illegible] మగవాళ్లలో [illegible]

★ శ్రీ మ తు లు - శ్రీ యు తు లు ★

యీ పతిత స్త్రీలు ఎక్కడినుంచివచ్చారని నా ప్రశ్న ?

సావిత్రి : (సంతోషంతో) అహో ఘనమైన ప్రశ్న. యీ ప్రశ్నకు జవాబు చెప్పడానికి మగాళ్లు తల్లక్రిందులుగా తపస్సు చెయ్యాలి.

రాజ్యం : ఈ పరిస్థితులను చక్క బరచడం కోసమే నేను "పతితస్త్రీ జనోద్ధరణ శాఖ"ను స్థాపించాను. (నిస్పృహతో) కాని యీ శాఖలో చేరడానికి మన స్త్రీ లెవరూ ముందుకు రావడం లేదు.

సుమిత్ర : వస్తారు రాజ్యం. మొదటలో అంతే! మన స్త్రీలు సంఘాలలో చేరడానికి జడుస్తారు. చేరినతరవాత మాత్రం విడవకుండా పనిచేస్తారు. మగవాళ్ళకుమల్లే మనలో ఆరంభ శూరత్వం లేనందుకు మనం గర్వించాలి. (అసలు విషయంలోకి వస్తూ) యింతకూ నువ్వు వెళ్లిన పని ఏ మయ్యింది రాజ్యం?

రాజ్యం : ఆ విషయం చెబుదామనే నేను తొందరగా వస్తూవుంటే దారిలో ఆ మజ్నా తగిలాడు.

సావిత్రి : కౌసల్య వస్తున్నదా?

రాజ్యం : ఇప్పుడే వస్తుంది. కాని మగ వేషం వెయ్యడానికి ఆమెకూడా ఒప్పుకో లేదు.

సుమిత్ర : అయితే ఎలా? మనం రేపు నాటకం మానుకోవలిసిందేనా?

రాజ్యం : (దృఢ నిశ్చయంతో) మనం ఆ నాటకం మానడానికి ఎంతమాత్రంవీల్లేదు. నేను వెళ్ళి 15 నిముషాలలో ఎవరినో ఒకరిని తీసుకువస్తాను. ఇప్పుడే రిహార్సల్సు వేసి చూసుకుందాం (కుడివైపు తొందరగా వెళ్ళి పోతుంది.)

సుమిత్ర : ఉద్రేకం ఎక్కువన్న మాటే కాని రాజ్యం యిటువంటి అవసర సమయాలలో చాలా హుషారుగా పనిచేస్తుంది.

సావిత్రి : మీ రేమన్నా సరే! సోషల్ వర్కు చేసే వాళ్లకు కోపం తగదండి.

సుమిత్ర : ఒకొక్కక్కరిలో ఒకొక్కక్క దౌర్బల్యం వుంటుంది. దానికి మనం ఏమీ చెయ్యలేం సావిత్రీ.

సావిత్రి : బృందగీతం మరొక సారి పాడించి చూద్దామా? (కుడి వైపునుంచి బెదురు చూపులుచూస్తూ నళిని ప్రవేశిస్తుంది. తెల్లగా, సన్నంగా, పొడవుగా వుంటుంది ఆమె ముఖంలో భీతి, విచారం కనిపిస్తూ వున్నాయి. జుత్తు చిందరవందరగా ముఖం మీద పడుతోంది. విశాలమైన కళ్లు, బాణంలా వంగిన పెదవులు, ఆమెఅందాన్ని చాటుతున్నాయి. మాసిన చీర కట్టుకొంది వయస్సు 20 సంవత్సరాలు)

సుమిత్ర : ఎవరి అమ్మాయి వమ్మానువ్వు? కూర్చో!

నళిని : మా యిల్లు యీ వీధిలోనే వుందండి రోజూ యిక్కడకు ఎందరో ఆడవాళ్లు వచ్చి వెడుతూ వుండడం చూస్తున్నాను. ఏమిటో చూద్దామని వచ్చానండి.

సావిత్రి : ఇది మహిళామండలి కార్యాలయం. వీరి పేరు సుమిత్రా దేవిగారు. మన పట్టణ మహిళా సంఘానికి అధ్యక్షులు.

సుమిత్ర : ఇదివరకు ఈ కార్యాలయం పై వీధిలో వుండేది మనసంఘాన్ని ఇంకా విస్తరింప చెద్దామనే ఉద్దేశంతో ఈ కొత్త భవనాన్ని తీసుకున్నాం. కాని ఈవీధిలోని స్త్రీ లెవరూ మా కార్యక్రమంలో ఉత్సాహంతో పాల్గొనడం లేదు.

సావిత్రి : కనీసం మీలాంటి యువతులైనా సంఘంలో సభ్యురాండ్రుగా చేరి రోజూ వస్తూవుంటే ఎంతో బాగుంటుంది.

నళిని : (భయంతో) హమ్మయ్యో! రోజూ రావడమే!-మా అత్తను తప్పించుకొని ఒక్క క్షణం యిలా రావడానికే తాతలు దిగివచ్చారు.

సుమిత్ర : ఏం? మీ అత్తగారికి యిటువంటి విషయాలంటే యిష్టం వుండదా?

సావిత్రి : మీ చాదస్తంకాని— యీ కాలంలో అభ్యుదయ భావాలున్న అత్తలు ఎక్కడైనా వున్నారండీ?

సుమిత్ర : అయితే అత్తలు అందరూ [illegible]

'న య మే'

ఖగోళ శాస్త్రజ్ఞుడొకాయన ఒక సభలో మాట్లాడుతూ, ఇప్పటికి వేసిన అంచనాల ప్రకారం 35 కోట్ల సంవత్సరాలలో ప్రళయం వచ్చేసి. భూగోళం ధ్వంసం అయిపోతుం దని ప్రకటించాడు.

ముందువరసలో కూర్చున్న ఒక శ్రోత త్రుళ్ళిపడి లేచాడు. "ఎంతకాలం అన్నారండి?" అని అడిగాడు.

"35 కోట్ల సంవత్సరాలు"

"అమ్మయ్య" అని నిట్టూర్చాడు శ్రోత.

"నయమే. ఇంకా 30 కోట్ల ఏళ్లేనని వినబడింది లెండి" అన్నాడు స్తిమితపడుతూ.

రాక్షసులు, కోడళ్లందరూ దేవతలు అనా నీఉద్దేశం? ఉభయులలోనూ మంచివాళ్లూ వుండవచ్చు, చెడ్డవాళ్లూ వుండవచ్చు. (నళినితో) నీ పేరేమిటమ్మా?

నళిని : నళిని.

సుమిత్ర : నీలాగే నీ పేరుకూడా అందంగా వుంది మీ అత్తగారిని మంచి మాటలతో ఒప్పించి రోజూ వస్తూవుండు!

నళిని : మా అత్తగారిని ఒప్పించడం మానవ మాత్రుల తరంకాదండి! ఎవరు ఏం చెప్పినా వినదు. ఆవిడకు ఎంత తోస్తే అంత!

సావిత్రి : పోనీ మీవారితో చెప్పి ఒప్పించండి. మహిళామండలి కార్యాలయానికి రావడానికి మీ భర్తకు అభ్యంతరం ఉండదనే నేను అనుకుంటున్నాను.

నళిని : (నిట్టూర్చి) నా జీవితం అందరి జీవితం వంటిది కాదండి. మీకు తెలియక అలా అడుగుతున్నారు. జన్మించినది మొదలు నేటివరకూ నా జీవితంలో ఒక వెలుగురేఖ అయినా చూచి ఎరుగను. (గద్గదస్వరంతో) ఈ దుర్భర జీవితాన్ని ముగించుకోవాలని ఎన్నోసార్లు ప్రయత్నించాను.

సుమిత్ర } : నీభర్త మంచివాడు కాదా!
సావిత్రి } : [illegible]

అన్నారా!

నళిని : ఎంతో మంచివారు. కాని అమాయకులు ఏమీ తెలియదు. ప్రపంచజ్ఞానం రవంతకూడా లేదు.

సావిత్రి : అయితే వెర్రివాడన్నమాట!

నళిని : పూర్వులు సంపాదించిన ఆస్తి బాగా వుంది. డబ్బుపిశాచి మావాళ్లు నన్ను బలవంతంగా ఈ నరకకూపంలోనికి నెట్టారు.

సుమిత్ర : (సానుభూతితో) చాలా అన్యాయం! స్త్రీకి స్వాతంత్ర్యం కావాలంటే మగవాళ్ళు ఇవ్వరుగా. ఇటువంటి సంఘటనలను చూచి అయినా పాఠం నేర్చుకోరు.

నళిని : (విచార స్వరంతో) నిలుచోడానికి స్వేచ్ఛలేదు కూర్చోడానికి వీల్లేదు చివరకు వచ్చిన చిరు కళ్లుకోడానికి కూడా హక్కులేదు. మా అత్తగారు కూర్చోమంటే కూర్చోవాలి నిలుచోమంటే నిలుచోవాలి పని చెయ్యమంటే చెయ్యాలి ఒక సంవత్సరం పూర్తిగా యీ కష్టాలను సహించాను ఇక నాలోని సహనం నశించిపోయింది. నూతిలోనో గోతిలోనో దూకి చావటం కంటే నాకు మార్గాంతరం కనిపించటంలేదు.

సావిత్రి : ఆత్మహత్య చేసుకోవటం చేతకానితనం. మనం — స్త్రీలం — ధైర్యంతో దౌర్జన్యాలను, అక్రమాలను ప్రతిఘటించాలి. మన హక్కులను సాధించుకొని ప్రశాంతమైన జీవితాలను కొనసాగించాలి.

సుమిత్ర : మునుపటికీ యిప్పటికీ పరిస్థితులు చాలా మారినై! నళినీ! మన మహిళా సంఘాలు చేసిన కృషివల్ల మనం నేడు చాలా హక్కులను సంపాదించుకున్నాం. మన భారత రాజ్యాంగం స్త్రీకి పురుషులతో సమానమైన హక్కులను యిచ్చిందంటే దానికి కారణం సుసంఘటితమైన మన సంఘాలు!

సావిత్రి : ఎన్ని హక్కులు వున్నప్పటికీ నళినివంటి అమాయకపు యువతులెందరో దారుణ హింసలకు గురిఅవుతున్నారు.

సుమిత్ర : ఈ అన్యాయాలను అరికట్టడమే యిప్పుడు మనం చెయ్యవలసిన పని.

నళిని : (చుట్టూ చూస్తూ) ఇక్కడ ఎంత ప్రశాంతంగా వుంది! ఇటువంటి నిర్మలమైన స్థలంలో రోజుకు ఒక గంట గడిపితేచాలు! బ్రతుకు భారం కనిపించదు. కాని నాకు అటువంటి అవకాశంలేదు.

సుమిత్ర : ప్రతిరోజూ వస్తూవుండమ్మాయి! నేను ఒకసారివచ్చి మీ అత్తగారితో మాట్లాడతాను.

నళిని : (భయంతో) దయచేసి ఆపని మాత్రం చెయ్యకండి నా అంతట నేనే ఏదోవిధంగా రావడానికి ప్రయత్నిస్తాను.

★ శ్రీమతులు - శ్రీయుతులు ★

మీరు వచ్చి చెప్పారంటే నన్ను కాలు కదప నివ్వదు.

(రాజ్యం తొందరగా కుడివైపునుంచి వస్తుంది. చేతిలో ఒక పత్రిక వుంది.)

రాజ్యం: (కోపంతో) చూడండి సుమిత్రాదేవిగారూ! రోజురోజుకూ యీ మగవాళ్ళ దుండగాలు హెచ్చు అవుతున్నాయి చూడండి యీ పెద్దమనిషి ఏం రాస్తున్నాడో! (పత్రిక చదువుతూ) స్త్రీలు యీ మధ్య యువకులపై ఒక కొత్త రకం దుమారం తీసుకు వచ్చారు. అందమైన అమ్మాయిలు కనిపిస్తే వెంటాడి అల్లరి చేస్తున్నారట యువకులు! ఈ వార్త విన్న వెంటనే 'వాళ్ళకు యిదేం పోయేకాలం' మని ఆడవాళ్లు, మగవాళ్లు కూడా అనుకుంటున్నారు. దానిలోని యదార్థాన్ని ఎవరూ గ్రహించినట్లు కనిపించదు. నిజం తెలుసుకున్న తరవాత యువకులది తప్పని ఎవరూ, అనరు. అనడానికి వీల్లేదు ఆడవాళ్లు గోళ్లకు, పెదాలకు రంగులు వేసుకోవడం ఎందుకు? చిత్ర విచిత్రమైన వేషధారణ చెయ్యడం ఎందుకు? ఆకర్షణకోసం కాదని ఎవరైనా చెప్పగలరా? అలా అడిగే వారిని ఎదురు తిరిగి ఒక ప్రశ్న వెయ్యవచ్చు. స్త్రీలు యింటిలో ఉండేప్పుడు నిరాడంబరంగా వుండడం ఎందుకు? వీధిలోకి వచ్చేప్పుడు మాత్రం పురుషులను రెచ్చగొట్టే......

సుమిత్ర:- (కోపంతో) ఇక ఆపు చెయ్యి! ఆ వ్యాసం రాసిన వాడికి ఒక 'నిరసన పత్రం' పో చెయ్యి



రాజ్యం:- (పత్రిక కేసి చూస్తూ) ఎవడో మారు పేరుతో రాశాడు. అయితే అటువంటి అసభ్యకరమైన వ్యాసాన్ని అచ్చువేసుకున్నందుకు ఆ పత్రికా సంపాదకులకు నిరసన పత్రం పంపుదాం ఏది సావిత్రీ—ఒక కార్డు యిలా అందుకో!

సావిత్రి:- (టేబిలుమీది కాగితాల లోంచి ఒక కార్డు తీసియిస్తూ) నిరసన పత్రాలు అన్నీ అయిపోయాయి మరో రెండు మాత్రం వున్నాయి

రాజ్యం:- రేపు రెండువేల కార్డులు అచ్చువేయించండి సుమిత్రాదేవి గారూ! ఇంకా మనం చాలా మందికి నిరసన పత్రాలు పంపించవలసి వుంది.

సుమిత్ర:- పార్లమెంటులో 'స్త్రీ వారసత్వపు బిల్లు'ను ప్రతిఘటించినవారి లిస్టు తయారు చేశావా సావిత్రీ?

సావిత్రి:- ఓ! చాలా వరకూ పూర్తి అయ్యింది.

రాజ్యం:- అయితే ఆలస్యం చెయ్యకండి వారి కందరికీ నిరసన పత్రాలు వెంటనే పంపండి.

నళిని:- (ఆశ్చర్యంతో) నిరసన పత్రాలా!!

రాజ్యం:- (నళినిని, నఖశిఖ పర్యంతం చూస్తూ) ఎవరా అమ్మాయి? జంతువులా మాట్లాడుతోంది నిరసన పత్రాల గురించే తెలియదా?

సుమిత్ర:- ఆ నోటి గురుసు కూడ దంటాను రాజ్యం. ఆ అమ్మాయి మన పరిసితులకు అలవాటు పడలేదు నాలుగు రోజులుపోతే నిన్ను మించి మాట్లాడుతుంది

రాజ్యం: దానికేంగాని (నళినిని పరిశీలించిచూస్తూ) ఈ అమ్మాయి పురుష వేషానికి చాలా బాగుంటుంది (తోలు సంచి లోంచి కాగితాలు తీసియిస్తూ) యిదిగో అమ్మాయి, నీ పేరేమిటో నాకు తెలియదు.

సావిత్రి: నళిని!

రాజ్యం: చాలా బాగుంది పేరు. ఈ పోర్షన్ జాగ్రత్తగా చదువు పదిహేను నిమిషాలలో రిహార్సల్సు ప్రారంభిద్దాం

నళిని. (భయంతో) నేను నాటకంలో వేషం వెయ్యడమే!

సుమిత్ర. నీకేం మతి లేదేమిటి రాజ్యం వాళ్ళ అత్త అసలే రాక్షసిలాంటిదట! ఆమె ఏదో మనల్ని చూసిపోదామని వస్తే వేషం వెయ్యమంటా వేమిటి?

రాజ్యం: (కోపంతో) వాళ్ళ అత్తకాదు కదా సాక్షాత్తు బ్రహ్మరాక్షసివచ్చినా ఈ రాజ్యంముందు తల వంచవలసిందే! (నళినితో) అమ్మాయి! నామాట విను! ఈ నాటకంలో వేషంవేసి మా పరువు నిలబెట్టు! మీ అత్త అంటావా? అది ఏమంత గొప్పసమస్య కాదు. ఆ వ్యవహారం నేను పరిష్కరించుకుంటాను.

నళిని: నేను యిదివరకెప్పుడూ నాటకములో వేషం వెయ్యలేదు

రాజ్యం: అయితే యింకా మంచిది. నటనలో పూర్తిగా సహజత్వం ఉంటుంది.

నళిని: నేనేం వేషంవెయ్యాలి?

సావిత్రి: మగవేషం వెయ్యాలి.

రాజ్యం: మగవాడి నడక, తల ఎగరెయ్యడము, ఆడవాళ్ళదగ్గర తలబిరుసుగా మాట్లాడడం వగైరా పురుషలక్షణాలన్నీ నేను చెబుతానులే ఈలోపున పోర్షన్ చదువుతూవుండు.

సుమిత్ర: (రాజ్యంతో) అమ్మాయిలందరూ ఆ వరండాలో కూర్చుని నీకోసం ఎదురుచూస్తున్నారు. వాళ్ళతో బృందగానం పాడించి చూడు.

రాజ్యం: సారీ! మరిచిపోయాను. (తొందరగా ఎడమవైపు నిష్క్రమిస్తుంది)

నళిని: (భయంతో) నేను వెంటనే ఇంటికి వెళ్ళాలండి ఆలస్యం అయితే మా అత్త నన్ను బ్రతకనివ్వదు

సుమిత్ర: మరేం ఫర్వాలేదమ్మా! మహిళాసంఘం కార్యాలయానికి వెళ్లావని తెలిస్తే నిన్నెవరూ యేమీ అనరు పైగా మీ అత్తే నీకు చెప్పలేదు.

సావిత్రి. పోర్షన్ చదవండి నాటకం చాలా సరదాగా ఉంటుంది ఇప్పుడే రిహార్సల్సు ప్రారంభిద్దాం

నళిని: తోటిస్త్రీలతో తిరగడమన్నా, హాయిగా ఆటలతో, పాటలతో కాలం గడపడమన్నా నాకెంతో ఇష్టం-కాని పరిస్థితులకు తలవంచి, ఆనందాన్ని చంపుకొని, జీవచ్ఛవంలా కాలాన్ని గడపవలసివస్తోంది.

సుమిత్ర ఇక నీకు ఏవిధమైన భయం లేదు నళినీ! నీ సుఖప్రదమయిన జీవితానికి మేం హామీ యిస్తున్నాం—నీవంటి అభాగినుల హృదయాలలో ఆశారేఖను సృష్టించ గలిగితే చాలు మా మహిళా సంఘం కృషి సార్థకమైనట్లు భావించుకుంటాం

సావిత్రి: (నళినితో) ఇక మీరు నిశ్చింతగా ఉండండి

(నళిని తన పోర్షన్ శ్రద్ధగా చదువుకుంటూ మధ్య మధ్య నవ్వుకుంటూ వుంటుంది. సుమిత్ర, సావిత్రి మాట్లాడుకుంటూ ఉంటారు.)

సావిత్రి ఆడవాళ్లు ఉద్యోగాలు చెయ్యకూడదని, ఎప్పుడూ యింటిని వదలకుండా వుండాలని యీ మధ్య ఒక ఇస్లాం ప్రముఖుడు ఒక ప్రకటన చేశాడు. మీరు చూశారా?

సుమిత్ర: చూశాను సావిత్రీ, ముస్లిం

మహిళలు మనకంటే కఠోర నియమాలకు గురి అవుతున్నారు. వాళ్లలో మగవాళ్లు ఎందరు స్త్రీలనయినా పెళ్ళి చేసుకో వచ్చుట!

సావిత్రి: ఇది చాలా దారుణమయిన విషయం.

సుమిత్ర: అందుకే ముస్లింస్త్రీలు బహు భార్యాత్వాన్ని నిషేధించాలని పెద్ద ఉద్యమం లేవతీశారు.

సావిత్రి: వాళ్ల ఉద్యమానికి మనం కనీసం సానుభూతి తీర్మానమయినా చేసి పంపాలి.

గంగాభవాని: (నేపథ్యం లోంచి బిగ్గరగా) నళినీ! నళినీ!

నళిని: (ఉలికిపడి లేచి భయంతో) అమ్మయ్యో! మా అత్త!

సుమిత్ర. భయపడకు నళినీ! నేను సమాధానం చెబుతానులే! నువ్వు లోనికివెళ్ళి రాజ్యం దగ్గర కూర్చో!

(నళిని తొందరగా ఎడమవైపు నిష్క్రమిస్తుంది. కుడివైపునుంచి పిలుస్తూ గంగాభవానీ ప్రవేశిస్తుంది వయస్సు 50 సంవత్సరాలు 'జుతు కొద్దిగా నెరిసింది. ముఖం ఎప్పుడూ ఘుమఘుమ లాడుతూ వుంటుంది తెల్లని చీర కట్టుకొంది.)

గంగా: (చుట్టూ కలయజూస్తూ) ఇది ఎవరి కొంప? ఈ వేషాలేమిటి? (సావిత్రిని పరిశీలనగా చూస్తూ) గొర్రి కొమ్ములలా ఆ జుత్తేమిటి? ఎలకకొరికినటు ఎర్రగా ఆ పెదాలేమిటి? ఆవు గిట్టలలా ఆ జోళ్లేమిటి? ఇది యేమైనా సంసారి కొంపేనా అంట!

సుమిత్ర: ఎవరుమీరు? ఇలా మామీద అమాంతంగా దండెత్తడానికి కారణం?

గంగా· ముందీ యిలు ఎవరిదో చెప్పండి

సావిత్రి. ఇది మహిళాసంఘ కార్యాలయం!

గంగా: (కోపంతో) అంటే యేమిటి అంట?

సుమిత్ర: ఆడవాళ్ళ మంచికోసం యీ సంఘం పాటుపడుతుంది

గంగా: అఘోరించినట్టే వుంది మీ తెలివి. కట్టుకున్న మొగుడు వుండగా ఆడదాని మంచి చెడ్డలు మీరు చూడడం ఎందుకూ అంట?

సావిత్రి: మగవాళ్లు స్త్రీకి స్వేచ్ఛ యిచ్చి మర్యాదగా చూస్తే మేం సంఘం స్థాపించవలిసిన అవసరమే లేదు.

గంగా. అయ్యయ్యో! ఇది ఎక్కడి అన్యాయమురా! ఆడదానికి స్వేచ్ఛ కావాలా? అదిగాకపోయినా కట్టుకున్న భర్త, చేసుకున్న భార్య వుండగా మధ్య మీ కెందుకీ ఆయాసం? ఆవూ దూడా పూరుకుంటే మళ్ళీ 'రాట' అరిచిందట! రాట!!

సుమిత్ర: (కోపంతో) మీవంటి ఆడవాళ్లు యింకా వుండడం వల్లనే యీనాటికీ స్త్రీల బ్రతుకు యింత అధ్వాన్నంగా వుంది.

సావిత్రి: (కోపంతో) మీ నాయనమ్మ కబుర్లు మా దగ్గర చెప్పకండి.

గంగా: ఇంతకీ మీకు మొగుడూ మొద్దులూ లేరట్రా?

సావిత్రి (కోపంతో) ఉన్నారు. కాని వారిని రెక్కపట్టుకుని ఓ మూల కూర్చో బెట్టాం

గంగా: అయ్యో! దిక్కుమాలిన కలికాలం! కట్టుకున్న వాళ్ళను పూజించడం పోయి మూలకూర్చోబెటి యిక్కడ మీరు తైతెక్కలాడుతున్నారా? - హాయిగా తెల్లవారుఝామునే లేచి, మొఖానికి యింత పసుపు రాచుకొని, శుచిగా స్నానంచేసి భర్తకు పిల్లలకు యింత వండి పెట్టి హాయిగా కొంపలో కాలం గడిపితే యిటు యిహమూ దక్కుతుంది, అటు పరమూ దక్కుతుంది.

సావిత్రి. ఆ రోజులు వెళ్ళిపోయాయి నాయనమ్మగారూ! ఇప్పుడు మేం ఉద్యోగాలు చేసి మగవాళ్ళతో సరిసమానంగా డబ్బు సంపాదిస్తున్నాం

గంగా: అయితే వంట, యింటిపని యివేమీ చెయ్యక్కర్లేదా?

సావిత్రి: ఆ పనులు చెయ్యడానికి వేరే నౌకర్లను పెట్టుకుంటాం లేకపోతే హోటలు నుంచి భోజనం తెప్పించుకుంటాం

గంగా: (హేళనగా) మీ నాగరికత తగలేసినట్టే వుంది! హోటలులో భోజనం చేస్తాం. ఆసుపత్రిలో మరణిస్తాం అంటే అది మీ ఖర్మ! దానికెవరేం చేస్తారు?

సుమిత్ర: ఇంతకూ మీరు వచ్చిన పని చెప్పారు కాదు.

గంగా: (కోపంతో చుట్టూచూస్తూ) ఏదీ మా కోడలు! ఇలా వచ్చిందని విన్నాను.

సుమిత్ర. ఓహో! నళిని మీ కోడలా! చాలా మంచి పిల్లండి!

గంగా: ఏడిసినట్టే వుంది దాని మంచి మీ గె మెచ్చుకోవాలి జోగీ జోగీ రాసుకుంటే బూడిదరాలిందట! ఏదీ? అదెక్కడ తగులడింది?

సావిత్రి: లోనవుంది లెండి మాతో సరదాగా కాసేపు కాలక్షేపం చేసివస్తుంది మీరు వెళ్లండి.

గంగా: (కోపంతో) చాలు, చాలు, చెప్పొచ్చావ్. నిక్షేపంలాంటి యిలుండగా యిక్కడ కాలక్షేపం చేస్తుందా? అలాంటి వేషాలు యీ గంగాభవానీ దగ్గర ఎంత మాత్రం సాగవు మర్యాదగా వస్తుందా వస్తుంది లేదా కొప్పు పట్టుకొని యీడ్చుకు వెళతాను. అంతేకాని యీ స్వేచ్ఛ కొంపలో ఒకక్షణం వుండనివ్వను.

సుమిత్ర: (సమాధానంగా) చూడండిగంగాభవానీగారూ! మన స్త్రీల అభ్యుదయానికి స్త్రీలే అడ్డుగా నిలవడం న్యాయంకాదు.- ఒకప్పుడు భర్త చచ్చిపోతే ఆడదాన్ని అమాంతంగా భర్తతోపాటు కాష్ఠంమీద పెట్టి కాల్చి చంపేసేవారు. అటువంటిది నేడు-మహనీయులు కందుకూరి వీరేశలింగం పంతులుగారి ధర్మాన-స్త్రీలు తిరిగి పెళ్లి చేసుకునే హక్కు కూడా సంపాదించారు.

గంగా: (రెండుచెవులూ మూసుకొని) శివ శివా! ఆడదానికి మళ్లీ పెళ్లా!!— ఓ బ్రహ్మదేవుడా, నువ్వు రాసిన రాతను యీ మనుషులు తుడిచి పారేస్తుంటే చూస్తూ వూరుకుంటా వటయ్యా?

సావిత్రి: చూడలేకపోతే ఆ బ్రహ్మదేవుడూ మీరూ కూడా కాసేపు కళ్లు మూసుకోండి

గంగా: కలికాలం! పాపం పేరుకు పోతోంది! వస్తుంది యెప్పుడో ప్రళయం! తొందరపడకండి!

—మిగతా వచ్చేవారం

బారసాల

జొన్నభట్ల సింహాచలం

అప్పుడే ఆఫీసు నుండి వచ్చి, వాలు కుర్చీలో మేను వాల్చి తను అందించిన కాఫీ రెండు గుక్కలు త్రాగి సేదదీర్చుకున్నాక భర్తను అడిగింది రాజ్యం "అల్లుడికి ఉత్తరం వ్రాయరూ?" అని. మిగిలిన కాఫీ ఒక్క గుక్కతో త్రాగి గ్లాసు భార్య చేతికిచ్చి భారంగా నిట్టూర్చాడు సుబ్బారావు.

"ఆటంకాలవల్ల పనకొంపోర్లోనా చెయ్యటానికి వీలులేకపోయింది ఇర్వ ఒకటో నాడయినా చెయ్యకపోతే బావుండదు కాంతికూడా వుందాయె అబ్బాయిని చూడాలని అల్లుడు ఎంత యిదవుతున్నాడో" ఏకరువు పెట్టింది రాజ్యం. కాసేపు ఆలోచించి భార్య సంతృప్తికోసం "సరే" అని మళ్ళీ ఆలోచనలో పడ్డాడు సుబ్బారావు. కూతురూ, అల్లుడు బారసాల పీటలమీద కూర్చుంటే చూడాలని తనూ ముచ్చటపడుతున్నాడు. కాని బారసాలకు కనీసం వందరూపాయలన్నా వుండాలి తను ఎక్కడనుండి తేగలడు? నెల్లాళ్లు బండచాకిరిచేస్తే జీతం పేరుతో యిచ్చిన వందరూపాయలు రెండురోజుల్లో హారతికర్పూరంలా హరించుకుపోయాయి ఎట్లాంటే అప్పులు అట్లాగే వున్నాయి మళ్ళీ అప్పుపుట్టటం కష్టమే. అయినా బారసాల చెయ్యక విధిలేదు. పెద్దమ్మాయి తొలిచూలు. అందులోనూ మగపిల్లాడు ఆమాత్రం ముద్దు ముచ్చటలు తీర్చకపోతే అమ్మాయి ఏమనుకుంటుంది? అల్లుడు మంచివాడే అతడికి ఏ పట్టింపులూ లేవు తన స్థితిగతులు అతడికి తెలుసు. కానీ అయినా కట్నం పుచ్చుకోకుండా కేవలం అమ్మాయిని చూసి చేసుకున్నాడు కూటికి గతిలేని సంబంధం అని వియ్యాలవారు ఆడిపోసుకుంటున్నా, అల్లుడు తనలోనిహాసవటం వల్ల, వాళ్ళ కూతలకి తను ఎప్పుడూ ఖాతరు చేసేవాడు కాదు. బారసాల యిప్పుడు చెయ్యకపోతే వియ్యాలవారు దప్పువేసి చాటుతారని తనకు తెలుసు. అందుకనే ఏదోవిధంగా కార్యం అయిందనిపించాలి వారంరోజులు సెలవు పెట్టి బారసాలకు రమ్మని అల్లుడికి ఉత్తరం వ్రాశాడు.

ఆనాడు ఆదివారం. బుధవారమే బార
సాల దెబ్బ జతపడితే తక్కిన ప్రయ అప్పు అడిగాలి ప్రాణం, సంధ్య అయినాక
త్నాలు చేసుకోవచ్చును ఎవరినయినా కాఫీ త్రాగి బయలుదేరి నేరుగా రాముం



త్యాగరాజు "రాగసుధారస పానము"

—చిత్రకారుడు: డి. పి. రాయుడు, మద్రాసు

యింటికి వెళ్లాడు. వీధివసారాలో కూర్చుని దినపత్రిక తిరగవేస్తున్నాడు రామం. కాసేపు పిచ్చాపాటీ అయినాక అసలు విషయం బయటపెట్టాడు సుబ్బారావు "అరె! నిన్ననే మా ఆవిడ పేర మూడువందలు జమ కట్టేశాను. ఎప్పుడూ అడగనివాడివి నీకు సహాయం చెయ్యలేక పోయినందుకు చింతిస్తున్నాను" అన్నాడు. రూపాయికి చే నడ్డీయిసే రూపాయలవర్షం కురిపించగ. రామం స్తోమతు సుబ్బారావుకి తెలుసు. అయినా ఒకే ఆఫీసులో పనిచేస్తున్న స్నేహితుడయిన రామం ఆ మాత్రం సహాయం చేస్తాడని కొండంత ఆశవుండేది తనకి.

"మరి వెళ్ళొస్తా" నంటూ లేచాడు సుబ్బారావు

సుదర్శనాన్ని అడిగితే లేదనడు. ఉద్యోగ ప్రయత్నంలో సుదర్శనానికి తను సహాయపడ్డాడు. అసలు తనవల్లే ఉద్యోగం అయిందని అప్పుడప్పుడూ తనకి కృతజ్ఞత తెలుపుతూ వుంటాడు. భార్యపేరుమీద కిరాణా వ్యాపారం కూడా చేస్తున్నాడు. వాడి పని యిప్పుడు మూడు పువ్వులు, ఆరు కాయలుగా వుంది. కాఫీజాడితూచి, పొట్లాలుకట్టి, అమ్మకానికి సిద్ధం చేస్తున్నాడు సుదర్శనం. అడిగి మళ్ళీ లేదనిపించుకోవాలేమో అని సంశయిస్తున్నాడు సుబ్బారావు. చలకు వచ్చి ముంతిదాపట కొందుకని అడిగేశాడు.

"సుదర్శనం! ఓ వందరూపాయిలు అప్పుగాయిస్తే ఎలాగో బాపతుచూసి సాధ్యమైనంత త్వరలో తీర్చేస్తాను. బుధవారం మా మనవడి బారసాల చేద్దామనుకుంటున్నాను"

"సారీ సుబ్బారావుగారూ! మీకు యీ మాత్రం సహాయం చెయ్యలేనందుకు సిగ్గుపడుతున్నాను. నిన్ననే మాఆవిడకు నాలుగు వందలిచ్చి నెక్లెస్ కొన్నాను. మీరేమీ అనుకోకండి" సుదర్శనం క్షమాపణ చెప్పుకున్నాడు.

నిజమేమరి తనకి వందరూపాయిలు అవసరమని విశేషం కలగన్నాడా! ఉంటే సర్దుబాటు చెయ్యవలసిన మనిషే. తనకి అప్పు తీర్చే తాహతు లేదని మరెవరయినా అనుమానిస్తారేమోగాని, సుదర్శనం విషయంలో మాత్రం తను అట్లా ఊహించుకోలేడు. ఇంతకీ తన దురదృష్టం. పోతే, కృష్ణమూర్తిని కూడా అడిగి, లేదనిపించుకున్నాక, భార్యమెడలోని మిగిలిన రెండుపేటల గొలుసు మార్వాడీపరం చెయ్యవచ్చునన్న నిర్ణయానికి వచ్చేడు సుబ్బారావు.

అప్పటికి పదకొండయింది. వేసవి ఎండకు నెత్తి మాడుతోంది. పాదరక్షలు లేని సుబ్బారావు కాళ్లు పొక్కు లెక్కుతున్నాయి. చెమటలు కక్కుతూ కృష్ణమూర్తి యింటికి వచ్చేడు. ఇక్కడా చుక్క ఎదురే. కృష్ణమూర్తిగారి పెద్దబ్బాయి వేణు "నాన్నగారు యింట్లో లేర"ని మర్యాదగానే చెప్పేడు. తన స్థితిచూసి జాలివేసిందేమో, కాసేపు కూర్చోమని, "మంచినీళ్ళు కావాలా బాబయ్యగారూ!" అని అడిగేడు. తనకీ కాసేపు కూర్చుంటే నేగాని ఇంటికి వెళ్లటం కష్టమనిపించింది. వేణు యిచ్చిన చల్లటినీళ్ళు ఒక్క గుక్కలోనే తాగి "హమ్మయ్య" అంటూ నిట్టూర్చాడు సుబ్బారావు "మరి వెళ్ళొస్తా" నంటూ లేచాడు "ఏదో పనిమీద వచ్చారల్లెవుంది" అడిగేడు వేణు "అవును కృష్ణమూర్తితో అర్జంటు పనివుంది. బుధవారం మా మనవడి బారసాల. అందుచేత కృష్ణమూర్తి-వస్తే వాడితో నే మాట్లాడతాను" తన పరిస్థితి యీ అబ్బాయితో చెప్పి లాభంలేదనేమో మధ్యసంలో ఆగిపోయాడు. వేణు మరేమీ ప్రశ్నించలేదు.

సుబ్బారావు ఇంటికి బయలుదేరేడు. వీధి గడప దిగుతూండగా తళతళ మెరుస్తూ పర్సు ఒకటి అగుపించింది. తనకళ్ళను తనే నమ్మలేకపోయాడు. కృష్ణమూర్తిగారి గేటుకు చేరువలోనే ఉంది. వీధి నిర్మానుష్యంగా ఉంది. సుబ్బారావుని సాగనంపి వేణు ఇంట్లోకిపోయాడు. చుట్టూచూశాడు సుబ్బారావు. ఎవరూ లేరు. పాపం! ఎవరిదో ఆ పర్సు! తియ్యటానికి ధైర్యం చాలేదు. తీసుకున్నప్పుడు ఎవరయినా చూస్తే! చూస్తే ఏం? తనకి పర్సు కాజెయ్యాలని లేదే! వారిది అని ఎవరయినా అడిగితే ఇచ్చేస్తాడు. తియ్యకుండా తనదారిని తనుపోతే ఆ పర్సు మరెవరి చేతుల్లోనో పడుతుంది. కృష్ణమూర్తి ఇంటవద్దే పడివుంది. వాడిదే నేమో! వచ్చేటప్పుడు తను చూడలేదే! ఎవరిదయినా సరే! వాళ్ళబ్బాయిని అడిగితే తనది కాకపోయినా తనదే అంటాడేమో! క్షురకారుని నమ్మలేం. డబ్బువిలువ వాళ్ళకు తెలియదు. ఆ డబ్బు సినీమాలకు, సిగరెట్లకు తగలేసి జల్సా చేస్తాడు. కష్టసుఖాలు వంటబట్టిన తనయితే ఆ డబ్బుని సద్వినియోగం చేస్తాడు. డబ్బుకి తనుపడే అవస్థలు చూసి భగవంతుడే కనికరించి, ఆ పర్సుని తనకోసమే అక్కడ సృష్టించాడేమో! ఇంతకీ ఆ పర్సులో వున్నదెంతో? ఏ గుమాస్తాగాడి పర్సో అయితే చెత్తకాగితాలు మినహా మరేమీ వుండవు. వెశ్యడిదో, వేశ్యదో. వైద్యుడిదో అయితే ప్రజలకళ్ళల్లో కారం జల్లి సంపాదించిన డబ్బు ఇనప్పెట్టెల్లో చోటు లేక, పొంగి పొరలి కట్టలు తెంచుకుని పర్సులోకి ప్రవహిస్తుంది. తను మీనమేషాలు లెక్కపెడ్తూ కూర్చుంటే చేతికి దొరికిన ఎరను ఏ గద్దో తన్నుకుపోతుంది. తనంత తానువస్తూన్న సిరిని కాలదన్నుకోవడం తెలివి తక్కువ. మరోసారి చుట్టూ చూశాడు. ఎవరూ లేరు.

పాదంలో గుచ్చుకున్నది ఏదో తీస్తున్నట్లు నటించి, వణుకుతూన్న చేతులతో పర్సు తీసి పక్క జేబులో భద్రపరిచాడు. వెనుక నుండి ఏదో శబ్దం వినిపించింది. సుబ్బారావు గతుక్కుమన్నాడు. గుండె ఆగిపోయిందేమో అనిపించింది. ధైర్యం తెచ్చుకుని వెనక్కి చూశాడు. ఎవరో ఇల్లాలు పులిస్తరాకులు కాలవలోకి విసిరింది. కొంతలో తప్పిందిగాని అవి తనమీద పడాల్సిందే. ఆ ఇల్లాలు నాలుక కరచుకుని, మందహాసంతో వయ్యారంగా పోయి, దబీమని తలుపు వేసుకుంది. ఆమె తనని కనిపెట్టిందేమో అని తడబడుతూనే ముందుకు అడుగు వేశాడు సుబ్బారావు. వెనక్కి చూడకుండా దొంగతనం చేసినవాడిలా భయపడుతూ, పొక్కు లెక్కిన కాళ్ళతో, చెమటతో తడిసి ముద్దయిన బట్టలతో. లేని ఓపిక తెచ్చుకుని త్వరగా అడుగులు వేస్తూ యింట్లో పడ్డాడు సుబ్బారావు.


కాళ్ళు కడుక్కుని భోజనానికి రమ్మంటూన్న భార్యమాటలు వినిపించుకోకుండా, తన గదిలోకి పోయి, తలుపులు బిగించి, కుర్చీలో కూలబడ్డాడు. జేబులోంచి పర్సు తీశాడు. ఆతృతగా లోనికి చెయ్యి పోనిచ్చాడు. కాగితాలకట్ట చేతికి తగిలింది. పైకి తీశాడు. అన్నీ పదిరూపాయిలనోట్లు. దొంగనోట్లు కావుగదా! లెక్కపెట్టేడు. ఇరవై నోట్లు. రెండు వందల రూపాయలు. తనకి రెండు నెలల జీతం. సుబ్బారావు కళ్లు ఆనందంతో మెరిశాయి. ఉదయాన్నే ప్రతి రోజూ ముక్కు మూసుకు చేస్తున్న కొంగ జపానికే తనని భక్తశేఖరుల జాబితాలో చేర్చి, భగవంతుడే తన కీవిధంగా సహాయం చేశాడు. రేపటినుండి తను యింకా ఎక్కువ నిష్ఠానియమంతో భగవంతుణ్ణి ధ్యానించాలి. ఈ రెండు వందలతోను అతి వైభవంగా బారసాల చెయ్యవచ్చును. అల్లుడు పంచెలు కట్టలేడు సూటు కుట్టించాలి. అమ్మాయికి మంచి సిల్కుచీర కొనాలి. మనవడికి వస్తువులు, ఉంగరం చేయించాలి. తరువాత ఏమయినా మిగిలితే సమారాధన చెయ్యాలి. "కాళ్ళు కడుక్కోండి" అన్న భార్య కేక విని ఊహాప్రపంచంలోంచి వాస్తవప్రపంచంలో పడ్డాడు సుబ్బారావు


బారసాల వైభవంగానే జరిగింది. నలభై మందికి పైగా సమారాధన చేశాడు. సుబ్బారావు యింత గొప్పగా చేస్తాడని ఎవరూ అనుకోలేదు. అప్పటికి పావలా కన్న ఎక్కువ చేతులో పెట్టని సుబ్బారావు పది రూపాయిలు తాంబూలంలో పెట్టి యిచ్చేసరికి బారసాల చేయించిన పేరి సోమయాజులు, కపాళానికి ఎక్కేటట్టు నశ్యం పీల్చి "సుబ్బారావు పంతులు చేతికి ఎముకే

(౪౦-వ పేజీ చూడండి)

బెస్తలు

ఫొటో: జి. ఎస్. శర్మ.








బిమల్ రాయ్ నిర్మిస్తున్న "పరివార్" లో కొత్తనటి నమితాగుహ..



నరసువారి హిందీచిత్రం "సితారోంసే ఆగే"లో వైజయంతిమాల.



లక్ష్మీ ప్రొడక్షన్స్‌వారి "ఇలవేలుపు" లో పద్మగా కృష్ణకుమారి, గణపతిగా రేలంగి.

బొంబాయి సినిమా లేఖ

చలన చిత్రాలపై వినోదం పన్ను విధింపులో అంచెలవారి పద్ధతి తొలగించి, టూటికి ఎంతో కొంత చొప్పున పన్ను వేసే పద్ధతి ప్రవేశ పెట్టాలని బొంబాయి ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు ముఖ్యమంత్రి శ్రీ మురార్జీదేశాయ్ ఎగ్జిబిటర్ల సభలో వెల్లడించారు. ఏ పద్ధతి అయినా మొత్తంమీద వినోదం పన్నును తగ్గించడం మటుకు సాధ్యం కాదని ఆయన స్పష్టపరచారు. అంచెలవారీ పన్ను విధింపు పద్ధతికన్న ఈ 'శాతం' నిర్ణయించి వసూలు చేయడమే ఉన్నంతలో కొంత మెరుగు. డబ్బు గిట్టుబాటు కాని నిర్మాతలకు దీనివల్ల కొంత మేలు జరగవచ్చు.

* * *

సినీ కెమేరాలు, ప్రొజెక్టరు, ఇతర ఫొటోగ్రఫీ పరికరాలు, రసాయనిక పదార్థాలూ మనదేశంలోనే ఉత్పత్తి చేయడానికి రెండవ పంచవర్ష ప్రణాళిక క్రింద ఏర్పాట్లు జరగవచ్చు. బొంబాయి రాష్ట్రం ఇందుకు పూనుకొని, కేంద్రానికి ప్రతిపాదనలు అందచేసింది. ఈ ప్రయత్నాన్ని ఫిలిం పరిశ్రమ ప్రముఖులు అంతా హర్షించారు. నిజానికి ఈ పరిశ్రమలు నెలకొల్పడం ఎంత అవసరమో, అది ఎంత త్వరగా జరగాలో మన పరిశ్రమ దిగుమతి చేస్తున్న పరికరాల జాబితా వాటి ఖర్చు చూస్తే తేటతెల్లమవుతుంది. అందులో బ్రిటన్‌నుండి దిగుమతులు ఇటీవల బాగా పెరిగాయి. 1954 లో ఆ దేశంనుండి మనం కొన్న పరికరాల విలువ 66,200 పౌండ్లు కాగా, గత సంవత్సరం 1,39,691 పౌండ్లకు పెరిగింది. అమెరికా ప్రభృతి దేశాల నుండి కొనే సరుకుల విలువకూడా జోడిస్తే ఈ పరిశ్రమ అవసరాలు ఎంత పెరిగాయో ఎంత డబ్బు విదేశాలకు వెళ్తోందో బాగా తెలుస్తుంది.

ఐ. ఎం. పి. పి. ఎ. వారు ఈ స్థితిగతులన్నీ పరిశీలించి, ప్రభుత్వం తలపెటిన పరిశ్రమలే కాక, స్టుడియో బల్బులు, మేకప్ సామగ్రి, ముడి ఫిలిం కూడా ఇక్కడే ఉత్పత్తి చేయడానికి ఏర్పాట్లు చేయాలని కోరారు. పోతే, 'కలర్ లెబారెటరీ'ల స్థాపనకు ప్రభుత్వం సహాయం చేయాలని కూడా వీరు కోరారు. కొన్నాళ్ళక్రితం ముడి ఫిలిం పరిశ్రమ నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వం, మైసూరు ప్రభుత్వం ఆలోచించడం జరిగింది కాని, దరిమిలా ఏ కారణంవల్లనో అది విరమించుకున్నట్లు కనబడుతుంది. ఇప్పుడు ఆ ప్రయత్నం తిరిగి తలపెట్టగలరని ఆశించబడుతోంది.

* * *

తార మీనాకుమారి ఈ మధ్య ఎవరికీ చెప్పకుండా హఠాత్తుగా దక్షిణ భారత యాత్రకి వెళ్లి 22 రోజులు తిరిగి వచ్చింది. నిర్విరామంగా సెట్స్‌మీద పనిచేయడంతో చాలా హైరాణ పడిపోయి ఆమె వెళ్లింది. చిత్ర నిర్మాతలంతా మాత్రం కార్యక్రమం తల్లక్రిందులై అవస్థ పడ్డారు. మొత్తంమీద మూడు వారాలు విశ్రాంతి తీసుకున్నందు

వల్ల మీనాకుమారి ఇప్పుడు మంచి ఉత్సాహంతో, విధ్యుక్త ధర్మం నెరవేర్చగలదని భావిస్తున్నారు.

నిమ్మీ పరిస్థితి ఇందుకు దాదాపు విరుద్ధంగా ఉంది. మూడేళ్ల నాడు ఒకసారి ఆమె సెట్ మీద పనిచేస్తూ పడిపోయింది. అప్పట్నించి ఆమె ఆరోగ్యం అంతంత మాత్రంగానే ఉంటోంది. ఈ సమస్య తరచుగా సుస్తీచేస్తూ ఉండడంతో, ఆమె పాల్గొంటున్న చిత్రాల నిర్మాణం కూడా మందగిస్తోంది. మీనాకుమారిలాగ, రెండు మూడు వారాలు పూర్తి విశ్రాంతి తీసుకోవడం ఆమెకి చాలా మంచిది, అవసరం కూడాను కాని, అదే వీలులేకుండా పోతోంది.

* * *

స్వాతంత్ర్యం వచ్చిన తరువాతనుండి, భారతప్రభుత్వం, అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలపట్ల ఎక్కువ శ్రద్ధచూపిస్తోంది. ఇటీవలగా బెంగాలీ చిత్రం "పథేర్ పాంచాలీ" దేశదేశాల ప్రశంసలందుకోవడం, అంతర్జాతీయరంగంలో మనదేశం ప్రతిష్ఠ పెరగడానికి తోడ్పడిందంటే దాన్ని నమ్మవచ్చును. అయినా, మొత్తంమీద ఈ ఉత్సవాల విషయంలో ప్రభుత్వం తగినంత కట్టుదిట్టంగా వ్యవహరించటం లేదనిపిస్తోంది. ఆయా ఉత్సవాలకు పంపడానికని ప్రభుత్వం ఎన్నిక చేసే చిత్రాలు కళ, సాంకేతిక విషయాలలో మనదేశం అందుకున్న ప్రమాణాలను ప్రతిబింబించటం లేదు. మనదేశంలో బహుమతులిచ్చి గౌరవించతగ్గ చిత్రాల ఎన్నిక విధానంకూడా అలాగే ఉంది. శ్రీ శాంతారాం ప్రభృతులు ఈ చిత్రాల ఎన్నికవిధానాలు తమకేమీ బోధపడటం లేదని, అంతా కంగారుగా ఉన్నట్టు కనబడుతుందని విమర్శిస్తున్నారు. నియమితమైన పద్ధతి రూపొందించాలంటూ వీరు కొన్ని సూచనలుకూడా చేశారు. ప్రభుత్వం వీటి సంగతి పట్టించుకోకపోవడంతో వీరిలో ఒకరకమైన ఉపేక్షాభావం బయలుదేరింది. శ్రీ శాంతారాం తాము నిర్మించిన "ఝనక్ ఝనక్ పాయల్ బాజే" చిత్రాన్ని ఈసారి పోటీకి దాఖలు చేయకపోవడానికి కారణం అదే.

* * *

'ఆర్ పార్', 'మిస్టర్ అండ్ మిసెస్ 55' వంటి చిత్రాలతో విశేష ఖ్యాతిగడించిన సంగీత దర్శకుడు ఓ పి నయ్యార్ ఇటీవల బి ఆర్ చోప్రా కొత్తచిత్రం "నయా దౌర్"కు సంగీత దర్శకుడుగా బుక్ అయ్యారు. ఈ చిత్రంలో దిలీప్‌కుమార్ ఒక టాంగావాలాగా నటిస్తారు. మధుబాల, జానీవాకర్, మన్మోహనకృష్ణ, రాధాకిషన్, చాంద్ ఉస్మానీ ప్రభృతులుకూడా పాల్గొంటున్నారు.

రాజ్‌కపూర్ చిత్రం "జాగ్ తేరహో" నిర్మాణం పూర్తి అయి, విడుదల కాబోతోంది. ఈ చిత్రంలో రాజ్‌కపూర్‌కు జంటగా బెంగాలీ తార సుమిత్ర నటించింది. మోతీలాల్, స్మృతి బిశ్వాస్, బుగుతవ్యాసీ ఇందులో నటించారు. ఈ చిత్రం కొంత కలకత్తాలోను, కొంత బొంబాయిలోను తయారైంది.

* * *

ఫిలిం ఆర్ట్స్‌వారి 'హమ్ ఔర్ తుమ్'లో జబీన్, దేవానంద్‌లు బుక్ అయ్యారు.

పంజాబ్ రాజకీయరంగంలో ఒకప్పుడు ప్రముఖుడుగా పేరుగడించుకున్న పండిట్ న్యాయశర్మ ఇప్పుడు చలనచిత్ర నిర్మాత. ఆయన నిర్మిస్తున్న "కినారే కినారే"లో మీనాకుమారి, దేవానంద్ నాయకీ నాయకులు. చేతన్ ఆనంద్ దర్శకత్వాన "కినారే కినారే" చురుకుగా తయారవుతోంది.

(ఆంధ్ర వారపత్రిక బొంబాయి విలేఖరి)

★

రామన్ ప్రొడక్షన్స్‌వారి తొలిచిత్రం

బాక్సాఫీస్ దర్శకుడుగా పేరుగడించుకున్న ఎం వి. రామన్, (భాయ్ భాయ్ దర్శకుడు) ఇప్పుడు రామన్ ప్రొడక్షన్స్ పేరిట చిత్రనిర్మాణానికి పూనుకొన్నారు. హిందీ, తమిళభాషలలో నిర్మించనున్న ఈ చిత్రానికి "ఆశా" అని పేరు పెట్టారు.

జూన్ 11వ బొంబాయి మోహన్ స్టుడియోలో ఈ చిత్రానికి ప్రారంభోత్సవం జరిగింది. వేదగానంతో, మంగళవాద్యాలతో వైభవంగా జరిగిన ఈ ఉత్సవానికి బొంబాయిలోని నటీనటులూ, దర్శకనిర్మాతలూ పలువురు వచ్చారు. బాలనటి డెయిసీ ఇరానీ క్లాప్ కొట్టింది. వైజయంతిమాల కెమేరా ఎదుట నిలచి మొదటి 'డైలాగ్' చెప్పింది.

వైజయంతిమాల రెండు చిత్రాలలోనూ నాయికగా నటిస్తుంది. తమిళ వెర్షన్‌కు ప్రసిద్ధ తెలుగునటుడు నాగేశ్వరరావు నాయకుడు. హిందీ చిత్రంలో ఈ భూమికను కిశోర్‌కుమార్ నిర్వహిస్తారు. నైనా, ప్రాణ్, మినూముంతాజ్, లలితాపవార్, ఓంప్రకాశ్ కూడా ఇందులో ఉంటారు. హిందీ చిత్రానికి సి రామచంద్ర, తమిళ చిత్రానికి ఎస్. ఎం సుబ్బయ్యా సంగీత దర్శకులు. తమిళ రచయిత 'జవార్' సీతారాం ఈ చిత్రానికి కథ వ్రాశారు.

* * *

వరసూవారి హిందీ చిత్రం "సితారోంసే ఆగే" వరసూ స్టుడియోలో తయారవుతుంది. గ్యాన్ ముఖర్జీ దర్శకత్వాన నిర్మించబడుతున్న ఈ చిత్రంలో అశోక్‌కుమార్, వైజయంతిమాల, జగదీప్ సేఠీ, జానీవాకర్, రాజాసులోచన నటిస్తున్నారు. సంగీతం శచిన్ దేవ బర్మన్.

★



'హలాకూ' లో మీనాకుమారి, అజిత్.



'సజని' లో సులోచన, అనూప్‌కుమార్.

'వానిషింగ్ ప్రేరీ'

జనపదాలు విస్తరించిన కొద్దీ అడవులు క్రమ క్రమంగా హరించుకపోతూ ఉంటాయి. వాటితోపాటే అపురూపమైన జంతువులు కూడా క్రమంగా అంతరించి జాతి నామరూపాలు కూడా లేకుండా పోతూ ఉంటాయి. అమెరికాలోని "ప్రేరీలు" ఈ కోవకి చెందినవి. ఒకనాడు మానవుడికి దుర్భేద్యంగా నిలచిన ఈ ప్రేరీ తూర్పున మిసిసిపి నదినుండి పడమట రాకీ పర్వత శ్రేణివరకూ ఉత్తరాన కెనడా సరిహద్దు నుండి దక్షిణాన మెక్సికోవరకూ పరచుకొని ఉంది. ఈ ప్రేరీలో జంతు కోటి జీవన విధానాలను ప్రసిద్ధ అమెరికన్ చిత్ర నిర్మాత వాల్ట్ డిస్నీ అతిరమ్యంగా తెరమీద చిత్రించారు.

పుట్టినప్పటినుంచి గిట్టేవరకూ ప్రతిప్రాణి తన మనుగడకు, తన జాతి మనుగడకూ పడే తాపత్రయం, క్షణక్షణానికీ వచ్చిపడే గండాలు గడచి గట్టెక్కడానికి పడే అవస్థలూ, పన్నే ఉపాయాలూ, చూస్తే అరణ్యంలో బ్రతికే ఈ జంతు కోటి కష్టసుఖాలకీ నాగరిక జనారణ్యంలో మానవుడి అవస్థలకీ, తేడా కనబడదు. ఎటొచ్చీ మనసులో ఉన్న భావాలను దాచుకోగల అభినయానికీ, దాన్ని సమర్థించుకోవడానికీ, తెలివిగా అబద్ధాలు చెప్పడానికీ వీలుగా భాష, మానవుడికి ఉన్నాయి.

జంతువులకు ఈ వసతులు లేవు. ఆకలి వేసినా, నిద్రవచ్చినా, జంటకావాలన్నా, చిన్న చిన్న జంతువులను చంపదలచుకున్నా, అనవసరంగా తోటిజంతువు తనజోలికి వచ్చి చికాకు కలిగించినా, ఆ భావం, దాచుకోలేవు, దాచుకోవు. ఈ జంతుకోటి కష్టసుఖాలను, భయం, సంతోషం, ఆశ్చర్యం మొదలైన రసాలనూ, మనస్సుకు హత్తుకుపోయేలా వాల్ట్ డిస్నీ ఇందులో చిత్రించారు. మనుగడకోసం జరిగే ఈ నిత్య సంగ్రామంలో, పులి, లేడి, తోడేలు, (కాయోట్) కుందేలు, ఎనుము (బైసన్) పొటేలు, డేగ, ప్రేరీడాగ్, ఇవే పాత్రధారులు.

ఈ బలవంతుల, బలహీనులమధ్య, ఇంకో విచిత్రమైన, అహింసామయమైన పాత్ర కనబడుతుంది అది ప్రేరీ డాగ్. ఉడతలా ఉంటుంది. చిన్న కుందేలంత ఉంటుంది. దీనిపళ్ళు మహా వాడి. బుద్ధి మహా మెరుగు. తేలికశరీరం. ఇట్టే పారిపోగలదు. ఈ ప్రేరీ డాగ్ నివాసం ఏడెనిమిది అంతస్తుల మేడ. అయితే ఇది భూగర్భంలో ఉంటుంది. నిద్రామందిరానికి సవాలక్షమార్గాలు ఎంతో కష్టపడి త్రవ్వకుంటుంది. తనని చంపే జంతువు ఏదైనా లోపలికి ప్రవేశిస్తే, దాన్ని ముప్పుతిప్పలా పెట్టేస్తుంది.

ఈ సమయస్ఫూర్తి, దూరదృష్టి, ప్రకృతి ఈ చిన్న జంతువుకిచ్చిన ఆయుధాలు. దీని మీద, దీనికలుగు మీద చాలా జంతువులకు దృష్టి ఉంటుంది. గుడ్లగూబ దంపతులు పిల్లలకి 'విద్యలు' నేర్పుకోడానికి, సరాసరి ప్రేరీ డాగ్ ఇంటికొచ్చి తిష్ఠ వేస్తాయి. 'ఇది మాయిలు' అని ఇంటాయన కొంచెం ఆశ్చర్యపడుతూ చెబితే, పిల్లలు తెల్లమొహం వేసినా పెద్ద గుడ్లగూబ గుడ్లు రుముతుంది. ఫెరెట్ అని ఇంకో జంతువుంది. ప్రేరీ డాగ్‌కన్నా కొంచెం పెద్దది. మహా మోటు. ఇది కూడా అతి చొరవగా ఇంట్లోకొచ్చేస్తుంది. ఎక్కడా వేట దొరకక, ఆకలితో నకనకలాడే తోడేలుకి కూడా ఈ ప్రేరీడాగ్ మీదే పట్టరానంత కోపం వచ్చేస్తుంది. అంత కోపంతోటే అది కూడా దీనిమీదే వచ్చిపడుతుంది. ఆ గండం గడిచి 'అమ్మయ్య' అనుకునే వరకు గండభేరుండం వంటి డేగ రివ్వున దూసుకు వస్తుంది. అదృష్టవశాత్తు అదీ తప్పినా, బ్రతుకు జీవుడా అని ప్రేరీడాగ్ కలుగులో దూరుతుంది. కొంప మునిగిపోయినట్టు మళ్ళీ ఇవతలికి వచ్చి చుట్టూ పరకాయించిచూచి, 'ఎంతగండం దాటింది' అనిపిస్తుపోతుంది. అంతలోనే మళ్లీ ఆ డేగ రివ్వున వాలు

తుంది. ప్రేరీడాగ్ జీవితమే అంత. అయినా బొత్తిగా బెఖాతరీ అందరికీ లోకువైనా ఆ సేవులకన్న బలహీనురాలైనా నిత్యచైతన్యస్ఫూర్తితో ఎప్పుడూ ఆనందిస్తూ, ఆశ్చర్యపోతూ, జీవితం కులాసాగా గడుపుతుంది. ఈ భీకరమైన సమరంలో దీని చిలిపిచేష్టలు, అమాయకపు ఊహాలూ, దాని మటుకు దానికి ఎలాఉన్నా చూచేవాళ్ళకి ఆహ్లాదకరంగా ఉంటాయి ...

ఎక్కడో మెరుపు మెరుస్తుంది ఓమూల నిప్పంటుకుంటుంది. పచ్చిక బయలు భగ భగ మండుతూ మధ్యనున్న జంతుకోటిని చుట్టుముట్టుతుంది. బ్రతికేవి బ్రతుకుతాయి మిగిలేవి మిగులుతాయి ఈలోగా, ప్రకృతే ఆ మంటని చల్లార్చడానికి కుంభవృష్టిగా వాన కురిపిస్తుంది ఏరులు పొంగుతాయి నదులకు వరదవస్తుంది. ఈ ఉత్పాతాలమధ్య జంతువులు ఉక్కిరి బిక్కిరై చెల్లాచెదరుగా పరుగులు పెడతాయి దిక్కుతోచక, చిక్కులో ఒకదానితో ఒకటి పోట్లాడుకుంటాయి. కొన్ని బ్రతుకుతాయి, కొన్ని చనిపోతాయి......

ఈ చిత్రానికి పాల్ స్మిత్ చక్కని సంగీతం కూర్చారు టాంమాక్ హ్యూ, జేమ్స్ సైమన్, మొదలగువారు ఛాయాగ్రహణం నిర్వహించారు. దర్శకుడు జేమ్స్ ఆల్గార్.

వాల్ట్ డిస్నీ నిర్మించిన చిత్రాలలో, సీల్ ఐలెండ్, బీవర్ వాలీ, నేచర్స్ హాఫ్ ఏకర్, లివింగ్ డెజర్ట్ ఈకోవకు చెందినవి. జంతుకోటి జీవితవిధానాలను చిత్రించే ఈ చలనచిత్రాలను శాస్త్రజ్ఞులు పలువురు ప్రశంసించారు. కేవలం విషయబోధన ఒకటే ప్రధానం కాకుండా, దానితోపాటు చక్కని సహజమైన వినోదాన్ని జోడించి, డిస్నీ ఈ చిత్రాలను ఆహ్లాదకరంగా రూపొందించారు. ★



అమెరికన్ దున్న 'బైసన్' బండతనానికి బలానికీ పెట్టింది పేరు. తోక పైకెత్తి తల ముందుకువంచి, అది దూకుడుగా వచ్చేస్తూంటే ఆపగలిగినవారెవరూ లేరు. "అపకారం చెయ్యటంలేదు; ఊరికే ఫోటో తీస్తాం" అని చెప్పినా అది వినిపించుకోకపోవచ్చు. విన్నా సహించకపోవచ్చు. అందుకని ఈ తరహా జంతువులకు అనుమానం కలుగకుండా వాటిని 'సెల్యులాయిడ్'లోకి ఎక్కించుకోవాలంటే వాటిలాగే వేషం వేసుకోవాలి. 'వానిషింగ్ ప్రేరీ' చిత్రనిర్మాణంలో మచ్చికకాని, శిక్షణలేని జంతువులను చిత్రించడానికి ఈ ఉపాయం అవలంబించారు.

డిటెక్టివ్ సీరియల్

మూలం: ఎడ్గార్ వాలెస్

అరుణ వలయం

అనువాదం: ప్రద్యుమ్న

22. అరుణ వలయం నుండి అజ్ఞాతవ్యక్తి

"మీరు తెలివైనవారు, మంచి డిటెక్టివ్ అనుకున్నాను. ఇంత మూర్ఖులని ఎప్పుడూ అనుకోలేదు"

హార్వే ఫ్రాయంట్ విపరీతమైన ఆగ్రహంతో ఊగిసలాడిపోతున్నాడు. అతని ఎదురుగా బల్లమీద చక్కగా అమర్చిన బ్యాంకినోట్లు చూస్తే ఆగ్రహ కారణం తెలిసిపోతుంది

ఫ్రాయంట్ అసలే లోభి. అంతధనం ఒక్కసారిగా చేజేతులా పోగొట్టుకుంటున్నానే అని, కుతకుత లాడిపోతున్నాడు. ఎన్నిసార్లు ప్రయత్నించినా అతని చూపులు తిరిగి తిరిగి తన ధనం మీదికే వచ్చి వాలుతున్నాయి

ఫ్రాయంట్ దూషణకు డెరిక్ యేల్ చలించలేదు సాధారణంగా అతనికి ఆగ్రహం తెప్పించడం కష్టం

"కావచ్చు, నేను మూర్ఖుణ్ణే కావచ్చు. కాని నా అపరాధ పరిశోధన విధానం నేను మార్చుకోను థాలియా డ్రమండ్ ద్వారా అరుణవలయం రహస్యం ఛేదించవచ్చునని నేను భావిస్తున్నాను అందుచేతనే ఆమెను ఉద్యోగానికి తీసుకున్నాను నా అభిప్రాయం మార్చుకోవలసిన అవసరంకూడా లేదు" యేల్ అన్నాడు.

ఫ్రాయంట్ డిటెక్టివ్ ముఖంలోకి తర్జని ఊపుతూ "ఇదుగో చెబుతున్నా వినండి ఆ యువతి మంచిది కాదు. ఆమెకు హంతకులముఠాతో సంబంధం ఉంది. ధనం తీసుకుపోవడానికి వచ్చే అజ్ఞాతవ్యక్తి ఆమెయేనని నా నమ్మకం," అన్నాడు

"అలాగైతే ఆమెను వెంటనే అరెస్టు చెయ్యొచ్చు నేను చెప్పేది వినండి మిస్టర్ ఫ్రాయంట్! ఈ ధనం పోగొట్టుకోవడం నాకూ ఇష్టంలేదు. అరుణ వలయంవారు ఈ ధనం దొంగిలిస్తే దాని బాధ్యత నాదే అవుతుంది; మీది కాదు. మీ ప్రాణం కాపాడటం, మీ మీద అరుణ వలయానికి ఉన్న ఆగ్రహాన్ని నా మీదికి మళ్ళించడం నా కర్తవ్యం."

"అవును, నిజమే, నిజమే," ఫ్రాయంట్ అంగీకరించాడు "మీరు నేననుకున్నంత తెలివి తక్కువ మనిషి కాదు. సరే మీ ఇష్టం వచ్చినట్లే చెయ్యండి" నోట్లుతీసి ప్రేమగా నిమిరాడు వాటి నొక పొడుగాటి కవర్లో పెట్టి, అయిష్టంగానే డిటెక్టివ్ చేతి కందించాడు ఆ కవరును డిటెక్టివ్ యేల్ జేబులో వేసుకున్నాడు.

"బ్రబజాన్ సంగతి ఏమీ తెలియలేదా? నేను మార్ల్ వ్యాపారంలో పెట్టిన రెండు వేల పౌనులూ బ్రబజాన్ కాజేశాడు"

"మీకు మార్ల్ గురించి ఏమన్నా తెలుసా?" అని యేల్ తలుపు తెరుస్తూ అడిగాడు.

"అతడు పచ్చి మోసగాడని మాత్రం తెలుసు."

"అది అందరికీ తెలుసు. ఇంకా ఏమైనా తెలుసా? అతని పుట్టు పూర్వోత్తరాలు, ఎక్కణ్ణించి వచ్చాడో..."

"ఫ్రాన్సు నుంచి వచ్చాడనుకుంటాను. నా కెక్కువగా తెలియదు జేమ్సుబియర్డ్‌మోర్ అతన్ని నాకు పరిచయం చేశాడు. ఫ్రాన్సులో ఏవో భూముల వ్యాపారపు కేసుల్లో అతడు ఖైదు శిక్ష అనుభవించాడని ఒక వదంతి ఉన్నది. దాన్ని నేనంతగా పట్టించుకోలేదు. అతడు నాకు ఉపయోగించాడు, ఉపయోగించుకున్నాను, అంతే నేను అతని వ్యాపారాల్లో పెట్టిన పెట్టుబడిమీద నాకు బాగా లాభాలొచ్చాయి," అన్నాడు ఫ్రాయంట్.

డెరిక్ యేల్ తన ఆఫీసుకి తిరిగి వచ్చాడు పార్ అతనికోసం వేచి ఉన్నాడు జాక్ బియర్డ్‌మోర్ కూడా అక్కడే ఉన్నాడు

జాక్ అక్కడ ఉంటాడని యేల్ ఊహించలేదు థాలియాను చూడాలని వచ్చి ఉంటాడనుకున్నాడు. థాలియాను ఏదో పనిమీద పంపవలసి వచ్చిందందుకు క్షమాపణ కోరాడు.

"పార్! మిస్ డ్రమండ్‌ను ఇంటికి పంపివేశాను. ఇవ్వాళ జరగబోయే సంఘటనలో ఆమె ఇరుక్కోవడం నా కిష్టంలేదు. కొంచెం గడబిడ జరిగినా జరగవచ్చు," అంటూ జాక్ కేసి చూసి "దానికి నువ్వు సిద్ధపడే ఉన్నావనుకుంటాను," అన్నాడు.

"ఓ. గడబిడ జరక్కపోతేనే నేను ఆశ్చర్య పడవలసి ఉంటుంది," అని జాక్ ఉత్సాహంగా అన్నాడు

నీ ప్లాను ఏమిటి?" పార్ అడిగాడు.

"అరుణవలయ వ్యక్తి రావడానికి కొన్ని నిమిషాలముందు నేను నాగదిలోకి వెడతాను. నేను రెండువైపుల తలుపులూ లోపల గడియలు వేసుకుంటాను ఈ తలుపు తాళం చెవి మీ చేతికిస్తాను మీరు బయట తాళం వేసెయ్యండి మీరు ముందుగా తలుపు తట్టిన చప్పుడు వినిపించి, నేను లేవడం, తలుపు దగ్గిరికి వెళ్ళడం, తలుపు తీయడం వినిపించినప్పుడు అజ్ఞాతవార్తాహరుడు వచ్చినట్లు తెలుసుకోండి. తలుపు మళ్లీ మూసిన చప్పుడు కాగానే మీరు వెళ్లి నడవలో కాపలా కాయండి"

పార్ సమ్మతి తెలిపాడు "తేలికగానే కనిపిస్తోంది" అంటూ పార్ కిటికీదగ్గిరికి వెళ్లి జేబురుమాల ఊపాడు. యేల్ బావుందన్నట్లు మందహాసం చేశాడు

"పార్! తగిన జాగ్రతలన్నీ తీసుకున్నావనుకుంటాను ఎందరు పోలీసుల్ని తీసుకొచ్చావు?"

"దాదాపు పన్నెండుమంది ఉండవచ్చు. ఇంటిని పూర్తిగా ముట్టడించారు"

యేల్ ఇలాగన్నాడు: "ఒకటి గుర్తుంచుకోవాలి అరుణవలయంవారు మా మూలవ్యక్తి నెవరినైనా పంపవచ్చు అటువంటప్పుడు ఆవ్యక్తిని వెంబడించాలి అరుణవలయం యజమాని చేతుల్లోకే ఈ ధనం పోవాలని నా ఉద్దేశం అని చాలాముఖ్యం"

"అవును, నిజమే కాని నా అనుమానం అసలు యజమాని రాడని ఏదీ నీ ఆఫీసుగది ఒక్కసారి చూడనీ" అని పార్ గదిలోకి వెళ్ళాడు. ఆగదిలో ఒక టెలిఫోనుంది అది తెరిచిఉంది ఒకమూల బట్టలు పెట్టుకునే బీరువాఉంది పార్ అది తెరిచి చూశాడు. అందులో ఒక కోటుతప్ప ఇంకేమీ లేదు.

"యేల్! నువ్వేమీ అనుకోక, ఒక్క సారి అవతలకి వెడతావా? నేను ఒక్క సారి తలుపులు వేసుకుని వెదకాలి. ఎవరన్నా చూస్తూ ఉండగా వెదకడం నాకు బావుండదు."

యేల్ నవ్వుతూ బయటికి వెళ్ళాడు. పాల్ తలుపువేసేసి రెండో వైపు ఉన్న తలుపు తెరిచాడు. నడవలోకి ఒకసారి తొంగి చూశాడు. వెంటనే అది కూడా మూసేశాడు.

"ఇక లోపలికి రావచ్చు. చూడవలసినదంతా చూశాను," అని పిలిచాడు. పాల్ పొగగొట్టంకేసి చూస్తున్నాడు. అది చూసి యేల్ నవ్వుతూ "దొంగ ఆ గొట్టం ఎక్కి పారిపోతాడనా నీ ఉద్దేశం? ఈ గదిలో నేనెప్పుడూ నెగడు వెలిగించను. నాకెప్పుడూ చలి అంటూ వెయ్యదు," అన్నాడు.

పోదా తతంగమంతా జాక్ శ్రద్ధగా తిలకిస్తున్నాడు. డిటెక్టివ్ బల్లమీద చిన్న పిస్టల్ ఉంది. అది తీసి పరిశీలించ బోయాడు.

"జాగ్రత్త. అది ముట్టుకుంటే పేలుతుంది" అన్నాడు యేల్. జేబులోంచి నోట్లకవరు తీసి పిస్టల్ పక్కన పెట్టాడు. తరవాత గడియారంకేసి చూశాడు. "ఎందుకైనా మంచిది. ఈ గదికి బయటకూడా తాళం వేద్దాం," అంటూ బయటికి వెళ్ళి నడవ వైపున తలుపు తాళం వేశాడు.

"చాలా అద్భుతంగా ఉంది" అని జాక్ అన్నాడు. బిగ్గరిగా మాట్లాడితే ఏమైపోతుందో అని నెమ్మదిగానే అన్నాడు.

"అంత అద్భుతంగా ఉండదనుకుంటాను" యేల్ అన్నాడు. జాక్, పాల్ బయటికి వెళ్ళారు. తలుపు బయట తాళం వేశారు. జాక్ థాలియా క్రెమండ్ మామూలుగా కూర్చునే కుర్చీలో కూర్చున్నాడు. అది థాలియా కుర్చీ అని ఊహించగానే అదిరిపడి లేచాడు.

ఆమె అరుణవలయం మనిషా? పాల్ ఒకసారి సూచనగా అదేమాట అన్నాడు. జాక్ పళ్ళుబిగించాడు. ఒకవేళ తన కళ్ళారా తాను చూసినప్పటికీ ఆమెనుగూర్చి చెడు నమ్మలేడు. ఆమె పై ప్రేమ తగ్గిపోవడానికి బదులు పెరుగుతోంది. ఆమె మామూలు వ్యక్తిగాదు. ఒకవేళ దోషి అయినా-

జాక్ తల ఎత్తిచూశాడు. పాల్ అతనికేసే చూస్తున్నాడు.

"నేను యేల్ మాదిరిగా అసాధారణ ప్రజ్ఞావంతుణ్ణి కాను గాని, నువ్విప్పుడు థాలియా క్రెమండ్‌నుగూర్చి ఆలోచిస్తున్నావని మాత్రం చెప్పగలను."

"అవును, నిజమే. ఆమె నిజంగా చెడ్డదనే మీ నమ్మకమా?" అని జాక్ అడిగాడు.

"ఫ్రాయంట్ ఇంటోనుంచి బుద్ధవిగ్రహం దొంగిలించినమాట, కేవలం నా నమ్మకం కాదు అక్షరాలా యథార్థం."

జాక్ మౌనం వహించాడు. ఆమె నిరపరాధిని అని పాల్‌ను ఒప్పించడం కష్టం. పైగా ఆమె తన అపరాధం స్వయంగా ఒప్పుకున్న తరవాత అపరాధిని కాదని వాదించడం కూడా అవివేకం అనుకున్నాడు.

"నిశ్శబ్దంగా ఉండండి" అని యేల్ లోపల్నుంచి కేక వేశాడు. "ఊఁ" అన్నాడు పాల్.

తరవాత గాఢ నిశ్శబ్దం ఆవరించింది. యేల్ అటూ ఇటూ తిరుగుతున్నట్లు అడుగుల సడి వినిపించింది. తరవాత అతడుకూడా నిశ్శబ్దంగా కూర్చున్నాడు. గడువు సమీపిస్తోంది. ఇన్‌స్పెక్టర్ పాల్ జేబులోంచి గడియారం తీసి బల్లమీద పెట్టాడు. మూడున్నర అవుతోంది. అజ్ఞాతవ్యక్తి రావలసిన సమయమది. పాల్ చెవులు రిక్కించుకుని వింటున్నాడు. అంతా నిశ్శబ్దం.

ఇంతలో యేల్ గదిలో చప్పుడైంది. యేల్ బరువుగా కూలబడినట్టు చప్పుడు వినిపించింది. పాల్ లేచి నుంచున్నాడు.

"ఏమిటది?"

"ఏమీ లేదు. నేను దేనికో తగిలిపడ్డా నుకే. అరవకు, హూష్," అని యేల్ కంఠం వినిపించింది.

మరోక అయిదు నిమిషాలు నిశ్శబ్దం. పార్ పిలిచాడు:

"యేల్! ఏం జరిగింది?"

సమాధానం లేదు.

"యేల్! వినిపిస్తోందా?"

పార్ ఇంకా బిగ్గరిగా అరిచాడు. సమాధానం రాకపోయేసరికి ఒక్క ఉదుటున పోయి గదితలుపు తెరిచి లోపలికివెళ్లాడు. అతనివెనక జాక్ కూడా వచ్చాడు.

వారు చూసినదృశ్యం పార్ కంటే అనుభవజ్ఞుడైన అధికారినికూడా చకితుడుగా చేయగలదు.

డెరిక్ యేల్ నేలమీద పడిపోయి ఉన్నాడు. అతని ముఖంపై తువ్వాలొకటి కప్పివేయబడిఉంది. మణికట్లకు, కాళ్లకు సంకెళ్లు బిగించబడినాయి. కిటికీ తెరిచే ఉంది. కాని క్లోరోఫారమ్, ఈథర్ వాసన బాగా వేస్తోంది. బల్లమీద ఉండవలసిన నోట్లకట్ట మాయమైంది. మూడు సెకండ్ల తరవాత వృద్ధుడైన తపాలాబంట్రోతు ఒకడు ఆ ఇంటి హాలులోంచి బయటికి వెళ్లాడు. అతడు భుజానికి తగిలించుకుని ఉన్న టపాసంచీ చూసి పోలీసులతన్ని ఏమీ సందేహించకుండా వెళ్లిపోనిచ్చారు.

23. బట్టల బీరువాలో ఖాలియా

డిటెక్టివ్ ముఖంమీది తువ్వాల లాగి వేసి పార్ పరీక్షగా చూశాడు. యేల్ కళ్లు తెరిచి చుట్టూ చూశాడు.

"ఏమైంది?" అని యేల్ కంగారుగా అడిగాడు. ఇన్స్పెక్టరు పార్ మాట్లాడకుండా యేల్ చేతి సంకెళ్లు ఊడదీసి కింద పడేశాడు. జాక్ కాలి సంకెళ్లు ఊడదీశాడు. యేల్ను పైకి లేవనెత్తారు.

"ఏం జరిగింది?" అని యేల్ ప్రశ్నించాడు.

"అదే నేనూ అడుగుతున్నాను. ఎటు వెళ్ళారు వాళ్లు" అని పార్ ఎదురు ప్రశ్న వేశాడు.

యేల్ తల అడ్డంగా తిప్పాడు.

"నాకు తెలియదు. నాకేమీ జ్ఞాపకం లేదు. తలుపు తాళం వేసే ఉందా?"

జాక్ తలుపు వద్దకు పరుగెత్తి గుంజి చూశాడు. తాళం లోపలనుంచే వేసి ఉంది. అందుచేత దొంగ అటు వెళ్ళి ఉండదు. కిటికీ తలుపు తెరచి ఉంది. పార్ అసలాగదిలోకి రాగానే కిటికీ తెరిచి ఉన్న సంగతి కనిపెట్టాడు. కిటికీలోంచి చూశాడు. ఎనభై అడుగుల ఎత్తున ఉన్న కిటికీ నుండి నిచ్చెన లాంటి సాధనమైనా ఏమీ లేకుండా పారిపోవడం అసాధ్యం.

"ఏం జరిగిందో తెలియడం లేదు," అన్నాడు యేల్. అప్పటికతడు కొంచెం తేరుకున్నాడు. "నేను కుర్చీలో కూర్చుని ఉన్నాను. హఠాత్తుగా నా ముఖంమీద ఎవరో ఒకగుడ్డ కప్పారు. మానవాతీతమైన బలం గల చేతులు నన్ను పట్టుకున్నాయి. నేను విడిపించుకోవడానికి, అరవడానికి, ప్రయత్నం చెయ్యకముందే నాకు స్పృహ పోయి ఉండాలి"

"నేను పిలవడం వినిపించిందా?" పార్ అడిగాడు.

లేదన్నాడు యేల్.

"కాని మిస్టర్ యేల్! మాకు ధన్మని చప్పుడు వినిపించింది. ఏం జరిగిందని పార్ మిమ్మల్ని అడిగాడు. ఏదో తగిలికింద పడ్డా


ఖాయమైన ఉద్యోగం

కొత్తగా పనిలో చేరిన ఒక నరసయ్య మూడో రోజు నే, ఇల్లు సర్దబోయి, బల్లమీది రేడియో క్రిందకి తోసేసి, దాని మీదకి బీరువా పడ్డతోసేసి, బిక్కమొహం వేసి నిలబడిపోయాడు.

యజమాని చివాట్లు పెట్టిన తరవాత, రేడియో ఖరీదు ఐదు వందలూ, నెలకి పదిచొప్పున జీతంలో కోసి రాబట్టుకుంటానని చెప్పాడు.

నరసయ్య ఎంతో సంతోషించాడు.

"మా ఆవిడ కూడా సంతోషపడుతుంది. మీరు చెప్పిన లెక్కప్రకారం, నాలుగేళ్లు ఈ ఉద్యోగం ఖాయం కావడానికి ఇదే తొలిసారి సుమండీ" అన్నాడు వినయంగా.


అంజలీదేవి
ఎల్లప్పుడూ
లక్స్
టాయ్‌లెట్
సబ్బును
వాడుచున్నది
"నాకు తెలిసియున్నట్టి మిక్కిలి తెల్లని
మిక్కిలి శుద్ధమైన సబ్బు"
ఈ విషయంలో మీరు ఆమె మాటను విశ్వసింపవచ్చును : లక్స్ టాయ్‌లెట్ సబ్బుయొక్క స్వచ్ఛమైన తెలుపు అంటే శుద్ధత — అనగా మీ చర్మసౌందర్యమును దివ్యముగా కాపాడునట్టిది — మరియు లక్స్‌యొక్క నురగ : పరిపుష్టమైనది, మీగడవంటిది, అది మీ చర్మమును ఎంతో బాగుగా శుభ్రపర్చును, దానిని చాలా ఎక్కువ హాయిగా నుంచును. మరి పొదుపు కొరకై, పెద్ద సైజును మరువకుడు !
LUX
TOILET SOAP
సినీమా తారలకు
సౌందర్యము
నిచ్చు సబ్బు

...ని మీరు సమాధానమిచ్చారు," అని జాక్ విభ్రాంతుడై అన్నాడు.

"నేను కాదు ఆ మాటాంటింది. నాకు ఖాన గుడ్డ కప్పినప్పటినుంచీ నాకు స్పృహ లేనే లేదు మీరు ఆగుడ్డ తీసినప్పుడే నాకుమళ్ళీ తెలివివచ్చింది."

ఇన్‌స్పెక్టర్ పార్ మళ్ళీ కిటికీ వద్దకు వెళ్ళాడు కిటికీ తలుపు వేసి, మళ్ళీ తీశాడు వెనక్కి తిరిగేసరికి అతనిముఖం పెద్దనవ్వుతో విప్పారిఉంది

"చాలా తెలివి తేటలతో జరిగిందీ పని" అన్నాడు.

జాక్‌కి ఇన్‌స్పెక్టరు మీద పూర్వపు జుగుప్స మళ్ళీ కలిగింది

"ఇందులో తెలివితేటల్ని మీరు మెచ్చుకుంటున్నారా? మిస్టర్ యేల్‌ను దాదాపు చంపినంతపని చేసి తప్పించుకుని పారిపోయారువాళ్లు."

"చాలా తెలివిగా వుందని అన్నాను. నిశ్చయంగా ఇది తెలివితేటలతో చేసిన పనే" అని పార్ దృఢస్వరంతో అన్నాడు. "నేను కిందికివెళ్ళి కాపలా అధికారులతో మాట్లాడివస్తాను"

కాపలాగా వున్న అధికారులు యేమీ చెప్పలేకపోయారు ఆ దివసంనుంచి తపాలా బంట్రోతుతప్ప మరెవరూ పోలేదు, లోనికి రాలేదు.

"ఓహో, తపాలా బంట్రోతు ఒక్కడే వెళ్లాడన్నమాట సరే సరే, సార్జెంట్! నీ మనుషుల్ని పొమ్మను" పార్ మళ్ళీ లిఫ్టులో పైకివెళ్ళి యేల్‌ను కలుసుకున్నాడు

"డబ్బు పోయిందని తేలిపోయింది పై అధికారులకు రిపోర్టుచేయడం తప్ప మనం ఇంకేమీ చెయ్యలేము" అన్నాడు పార్.

"ఈసారి తప్పేదం నాదే పార్! అధికారులు ఈసారి నన్నేమీ నిందించరు. ఆకిటికీలోంచి దొంగలు ఎలా వెళ్లిపోగలిగారా అని ఆశ్చర్యపడుతున్నాను. అసలు చప్పుడు కాకుండా వాళ్ళెలా సమీపించారా అనేది ఇంకా ఆశ్చర్యంగా ఉంది"

"నువ్వు కిటికీకి వీపుపెట్టి కూర్చున్నావా?"

"అవును నేను కిటికీనుండి ప్రమాదం ఉందని భావించలేదు రెండు తలుపులనూ చూడవచ్చుగదా అని ఇటు తిరిగే కూర్చున్నాను. నా జీవితంలో ఇంత అభేద్యమైన సంఘటన ఎన్నడూ చూడలేదు. ఫ్రాయంట్‌కు ఈ సంగతి తెలియజెయ్యాలి నువ్వుకూడా నాతో రా. నామీద మండిపడతాడు నువ్వు వచ్చి చెబితే శాంతిస్తాడు"

ఆఫీసునుండి ముగ్గురూ బయటికి వచ్చారు యేల్ రెండువైపుల తలుపులనూ జాగ్రత్తగా తాళంవేసి, తాళంచెవులు జేబులో వేసుకున్నాడు

ధనం పోయిందని వినగానే ఫ్రాయంట్ మండిపడ్డాననడం చాలదు పిచ్చెక్కినట్లు ప్రవర్తించాడు.

"నా డబ్బు నాకు తిరిగివస్తుందని వాగ్దానం చేశారు ఇప్పుడేమో వచ్చి ఏదో మత్తుమందు పెట్టారని కాకమ్మ కథ చెబుతున్నారు. దారుణం! అన్యాయం! మీ రెక్కడున్నారు మిస్టర్ పార్!"

"నేను ఆ సమీపంలోనే ఉన్నాను. యేల్ చెప్పినదంతా నిజమే," అన్నాడు పార్.

హఠాత్తుగా ఫ్రాయంట్‌కు కోపం దిగిపోయింది చాలా శాంతిభావం వహించాడు

"సరే ఇక చేసేదేమీ లేదు అరుణవలయం కోరిన ధనం అరుణవలయానికి దక్కింది. మీకు చాలా ఋణపడిఉన్నాను మిస్టర్ యేల్! మీరు చేసినపనికి బిల్లు పంపించండి," అని ఫ్రాయంట్ సంభాషణ ముగించాడు యేల్, పార్ బయట వీధిలో తమ కోసం వేచిఉన్న జాక్‌ను కలుసుకున్నారు.

"చిత్రంగా ఉన్నదే ఫ్రాయంట్‌కు వచ్చిన ఆగ్రహం చూస్తే మూర్ఛపోతాడని పించింది మళ్ళీ అంతలో అతని కోపమంతా దిగిపోయి మామూలు మనిషై పోయాడు"

"అవునవును" అని యేల్ తల ఆడించాడు.

ఫ్రాయంట్‌కు కోపం చల్లారిన క్షణంలోనే అతని మనస్సులో ఒక విచిత్రమైన ఊహ మెరిసింది

"సరేగాని, నీ మీద ఫ్రాయంట్‌కు కోపం రాకుండా చేశాను గదా. ఇప్పుడు నువ్వు నాకు సహాయం చెయ్యాలి పోలీసు కార్యాలయంలో నా పరపతి ఏమీ బాగా లేదు నా మాటకంటె నీ మాటకే ఎక్కువ విలువ ఉన్నది అందుచేత నావెంట వచ్చి కమీషనరుతో జరిగిందంతా చెప్పి నాతప్పేమీ లేదని నచ్చచెప్పు" అని పార్ అడిగాడు

* * *

డెరిక్ యేల్ కార్యాలయం నిశ్శబ్దంగా, నిర్జనంగా ఉంది జాక్, యేల్, పార్ ముగ్గురూ వెళ్ళిపోయి పది నిమిషాలైంది. నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ కిర్రుమని ధ్వని అయింది. డెరిక్ యేల్ గదిలో మూలగా ఉన్న బట్టల బీరువా తలుపు మెల్లిగా తెరుచుకుంది ధాలియా ప్రెమండ్ బయటికి వచ్చింది తలుపులు మళ్ళీ యథాప్రకారంగా మూసివేసి, గది కలయ చూసింది జేబులోంచి తాళం చెవి తీసింది తలుపు తెరుచుకుని వసారాలోకి వెళ్ళి తాళం వేసింది ఆమె లిఫ్టులోంచి కిందికి దిగదలుచుకోలేదు. వసార అవతలి కొసను మెట్లున్నాయి ఈ మెట్లను ఆపై అంతస్తులో వారు తప్ప మరెవరూ ఉపయోగించరు ఆ మెట్లు దిగింది. కింద ఒక తలుపు ఉంది ఆ తలుపు తెరిచి పెరటిలోకి వెళ్ళింది. మరికొద్ది సేపటిలో ఆమె వీధిలో ఆ సమయంలో ఇళ్లకు తిరిగి వెళ్ళే ఉద్యోగుల సమ్మర్దంలో కలిసిపోయింది. (ఇంకా ఉంది)

రెండోదే బాగుంది

'కథా రచన మీద అభిలాష గల ఒక యువ రచయిత, ఒక పెద్ద రచయిత దగ్గరకు వెళ్లాడు

"నేను రెండు కథలు రాశానండి. కాస్త విని, ఏది బాగుందో చెప్పండి" అన్నాడు.

పెద్దాయన ఒకకథవిన్నాడు. ఆపైన లేచి, ఆవులించి, "రెండోదే చాలా బావుంది" అన్నాడు.

వనితాలోకం

చల్లటి తల్లులు

“స్త్రీ తనకు తెలియకుండానే మరొక స్త్రీకి అపకారముచేస్తుంది. తల్లులందరూ పిల్లలను అష్టకష్టాలుపడి పెంచుతారు; పెద్దవాళ్ళను చేస్తారు; విద్యాబుద్ధులు చెప్పిస్తారు; రెక్కలు రాగానే ఒక ఇంటివాళ్లను చేస్తారు. ఈ శ్రమించటములో తల్లుల దృష్టి సంతానాభ్యుదయముపైననే ఉంటుందిగాని - మరొక విధముగా ఉండదు. ఇతరులకు అపకారము చేయవలెనన్న ఉద్దేశ్యము లేశమయినా వారికి ఉండకపోవచ్చు. కాని - కొందరు తల్లులు తమ బిడ్డలను ఉత్తమపౌరులుగా తయారు చేయటానికి ఇచ్చే శిక్షణా, దాని పర్యవసానమూ, ఇతరులకు సహింపరానివవుతాయి. ముఖ్యముగా కొడుకులను కన్నతల్లి తనకుమారులను ఆదర్శభర్తలుగా తయారుచేయకపోవటమే కోడళ్ళకు అపకారము. ఒక తరములో జరిగిన ఈ అపకారము అనువంశికముగా బిడ్డలకు సంక్రమిస్తుంది” అని ఒక మనస్తత్వ వైద్యుడు తన సలహా కొరకు వచ్చిన యువతితో అన్నాడు.

ఆ యువతి తన సంసారపు గోడును ముఖ్యముగా పెనిమిటి స్వభావాన్ని గురించి చెప్పుకొని మనస్తత్వ వైద్యుడి సలహా అర్థించింది. ఆయన అడిగిన ప్రశ్నలకు సమాధానముగా “మా వివాహమయిన అయిదు సంవత్సరాలనుండి బాగా గమనించి చూస్తున్నానండీ ఇంతవరకూ ఇల్లు ఏ విధంగా చక్కబెట్టితే ఆయనకు నచ్చుతుందో, ఏపాకము ఆయన జిహ్వకు రుచిస్తుందో - నేను తెలిసికోలేక పోయాను. నా వేషభాషలు ఏ తీరుగా ఉంటే ఆయనకు ఆనందకరమో ఆయన సంతోషమూ ఉత్సాహాల తీరుతెన్నులు ఎటువంటివో ఎంత ప్రయత్నించినా అర్థము చేసుకోలేక పోతున్నాను. ఆయన స్వభావమే నాకు బోధపడకుండా ఉన్నది ఎప్పుడూ అంతులేని విచారముతో దీర్ఘాలోచనచేస్తూ ఉంటాడు. సినిమాలు, వేడుకలు, వినోదాలవల్ల ఆయనలో మార్పు రాకుండా ఉన్నది ఈ విశాలప్రపంచములో ఆయనకు తృప్తినీ సంతోషాన్నీ కలిగించేదేదయినా ఉన్నట్లయితే తెలుపండి. నా ప్రాణాన్నయినా పోకడపెట్టి ఆ పనిచేస్తాను నన్ను ఏంచెయ్యమంటారో చెప్పండి” అని ప్రాధేయపూర్వకముగా అడిగింది.

~~~~~~~~~~~~~~

ఇల్లిందల సరస్వతిదేవి

~~~~~~~~~~~~~~

సుమారు మూడునాలుగు గంటల సంభాషణతరువాత, ఆ మనస్తత్వవైద్యుడు ఆమె కుటుంబాన్ని గురించి తెలిసికోనగలిగినదేమంటే-ఆమె పెనిమిటి అతడితల్లికి ఏకైకపుత్రుడు. అతి గారాబముగా ఆమె కుమారుని పెంచింది అతడు పెద్దవాడయినా తన చేతిమీదుగా అన్నము కలిపి పెట్టేది. తన దగ్గరే పడుకోబెట్టుకునేది. అతడి వస్త్రాలంకరణ ఆమె తన అభిరుచుల కనుగుణ్యముగా చేసేది. అతడు పాఠశాలలో ఉన్నంతసేపూ ఉపాధ్యాయులు చెప్పినట్లు నడచుకునేవాడు అతడికి సంతోషమూ, ఉత్సాహమూ తల్లి కల్పించినవే ఆమె కుమారునికి యుక్తవయసు వచ్చినదని వివాహము చేసింది. సౌందర్యవతినే ఏరి కోరి జతపరచింది. కన్నకుమారుడి విషయములో ఇంతగా శ్రమించినతల్లి, అతడు భార్యతో మెలగవలసిన రీతులను బోధించలేకపోయింది. కుటుంబ జీవితములో అతడికి అభిరుచిని కలిగించలేకపోయింది కాగా-కోడలి ముఖము చూడగానే అత్తముఖము ముకుళించుకొని పోయేది భార్యవిషయములో తల్లికేదో అసంతృప్తి కలిగిందని అతడి అనుమానము. తల్లి జీవించి వున్నంతకాలము ఆమె యెదుట బడి కారణమేమని ప్రశ్నించలేకపోయాడు.

★ చల్లటి తల్లులు ★

బాల్యమునుండీ అతడికి స్వతంత్రాభిప్రాయాలు మొలకలెత్తటానికి ఆ తల్లి అవకాశము ఇవ్వలేదు. కాగా-అతడి జీవితమంతా తల్లితోటే కమ్ముకొనిపోయేవిధంగా అతడికి శిక్షణనిచ్చింది. అతడికి తల్లి ఆనందమే తన ఆనందము తలికనిష్టమయినవి అతడికి గిట్టవు. ఆమెకు సంబంధించని అంశాలు అతడికి సరిపడవు. తల్లి పోగానే అతడు నిరాధారుడయినాడు; లోకమంతా శూన్యమయినటయింది; అసంతృప్తి,అశాంతి అతడిలో కరడుకట్టాయి


మన సత్యవైద్యుడికి ఆ యువతి మీద జాలి కలిగింది ఆమె విద్యావతి; ఉత్సాహము కలది బుద్ధివంతురాలు. అన్నిటికంటె ఆశావాదతత్వము ఆమె గుణములలో గొప్పది దానినాతడు ప్రశంసించకుండా ఉండలేకపోయాడు. "అమ్మాయీ! నీకొక సలహా ఇస్తాను. అన్యథా భావించకు. నీలో వున్న భార్యత్వము కొంత తగ్గించుకొని మాతృత్వము వృద్ధి చేసుకో. భార్యవలె కాక తల్లివలె అతడిని సమీపించి చూడు. రెండు నెలల తరువాత దీని పర్యవసానము నాకు తెలుపు మాతృ క్లేశమువల్ల గాయపడిన అతడి హృదయానికి స్వస్థత చేకూర్చు." అని బోధించి పంపాడు.

గడువు పూర్తి అయిన తరువాత ఆమె తిరిగి వైద్యునిసందర్శించింది ఆమె ముఖము మీద పూర్వపు దైన్యములేదు. సంతోష చిహ్నాలు కొట్టగా కనబడుతున్నాయి. ఈ రెండు నెలలకాలములో జరిగినదంతా పూసగ్రుచ్చినట్లు చెప్పింది; "ప్రతిదానికీ 'మా అమ్మ అయితే ఇట్లా చేసేది కాదు. మా అమ్మ వంటచేస్తే చాలా రుచిగా ఉండేది; మా అమ్మ బట్టలు ఉదికితే ఎంతో తెల్లగా ఉండేవి; మా అమ్మచేతి పెరుగు తియ్యగా ఉండేది;' అంటూ విసుగూ విరామమూ ఎరుగకుండా ఉదయము లేవగానే తన ధోరణి ప్రారంభము చేస్తారు 'పాపము - ఇంకా నాలుగేళ్లపాటు కొడుకును సాకుకొనే అదృష్టము ఆమెకు లేకపోయింది ఆమెకు కాలము తీరింది కాని ఆమెకంటె పెద్దవాళ్లు జీవించిలేరా?' అంటూ సానుభూతి చూపించి మాట్లాడుతూ,' ఆమే ఉంటే మీకు 'ఇంకా బాగా సదుపాయాలను కల్పించేది; ఆమె ఉంటే మీ కొరకు ఇంకా ఏమేమి చేసేదో-మీరిట్లా ఉంటే ఆమె మనస్సు ఊరకొనేదా?' అన్న దగుసలో శాంతింపచేయగా - చేయగా - ఇప్పుడిప్పుడే కాస్త మన దోరణిలో పడుతున్నారు " ఆ యువతి తన కృషి ఫలితాన్ని కృతజ్ఞతలతో శాస్త్రజ్ఞుడికి తెలిపింది

ఆయన పకపకనవ్వుతూ 'నేను ముందుగా ఈమాట చెప్పితే ఎవరూ నమ్మరు తనకు తెలియకుండానే ఒక స్త్రీ ఇంకొక స్త్రీకి ఎంత అపకారము చేస్తుందో చూడు! ఈ తల్లి చాలు బిడ్డలున్నారే-వాళ్లు ఎంత పెద్దవాళ్లయినా సరే-తల్లి ఒడిలో మెలగినట్టే బయట కూడా మెలగుతారు మాతృ వాత్సల్యము మితిమీరి గ్రోలినవాడికి ప్రపంచమేమయిపోయినా లెక్కలేదు. మాతృదేవికి సాటి మరొకటి కానరదు. మాతృ వాత్సల్యము తప్ప మరదీ వారిని ఆకర్షించలేదు నీకు ఇదే విచిత్రముగా కనబడుతున్నట్టున్నది మొన్న సాయంకాలము వేళ ఒక కేసు వచ్చింది అది మరీ విచిత్రముగా ఉన్నది. ఆ యువతి తన పెనిమిటినిగురించి సావివెళబోసుకొన్నది. అతడు తల్లికి పుట్టిన పదిమంది పిల్లలలో ఒకడు. సామాన్య కుటుంబములో పుట్టినవాడు. అది సాధారణ కుటుంబాలలో ఉన్న అన్ని రకాల చిక్కు సమస్యలతో మునిగి తేలే కుటుంబము వాస్తవానికి ఇటువంటి పరిస్థితులలో పెరిగిన పిల్లలు కష్టాలను ఎగురొత్తగలిగే ఉంటారు. ఇటువంటి కుటుంబములో పుట్టి పెరిగిన బిడ్డడు పెద్దవాడయిన తరువాత, ఒక సమస్యగా భావింపబడటము ఆశ్చర్యకరమే! ఆ యువతి చెప్పిన దానిని బట్టి తేలినదేమంటే 'ఆమె పెనిమిటికి విపరీతమైన వింత చికాకు' అని. కాని అదిపైకి స్పష్టముకాదు ఎక్కడికి వెళ్ళినా, ఎంత దూరము పోయినా, ఎవరిని చూచినా అతడికి - అకారణమైన కోపము; అంతులేని అసంతృప్తి అది ఒకవిధముగా కాని ఒకందుకు గాని తీరనిది. ఈ అసంతృప్తి అతడికి బాల్యమునుండే ఏర్పడ్డది. దీనికి మూలము తల్లి. బాల్యములో అతడికి తల్లిప్రేమ కరవైపోయింది మిగతా పిల్లలందరూ తల్లిప్రేమతో పెరిగారు ఇతడొక్కడే ఆ యింట నెక్కసముగా పెంచబడ్డాడు ఇతడి మీద తల్లికి అకారణమైన వైముఖ్యము తోడివారి మీద తల్లి కనబరిచే ప్రేమతో అభివృద్ధిచెందిన అతడి అసంతృప్తి, అక్కసు క్రమముగా ద్వేషముగా మారిపోయాయి. ఆ ద్వేషము అతడిని బాల్యమునుండీ అంటిపెట్టుకొని పెద్దవాడయినా విడిచిపోలేదు - అతడికి ఎవరిమీదా విశ్వాసము లేదు ఎవరెంత మృదువుగా మాట్లాడినప్పటికీ, తనవెంత గౌరవించినప్పటికీ - బాల్యపు అసంతృప్తి ఛాయలు అతడికి వీడిపోలేదు అదృష్టవశాత్తు విద్యనార్జించాడు ధనార్జన చేస్తున్నాడు. కాని అతడికి ఏదో తెలిసి - తనకేదో లోపం జరిగిందన్న కించ మనసు నంటిపెట్టుకొనే ఉన్నాయి. అతడు తన కుటుంబములో కూడా ఈ స్వభావముతోనే మెలగుతున్నాడు ఆయువతి 'నేను ఆయనను ఎంతో గౌరవిస్తాను - ఎంతగానో ఆరాధిస్తాను. త్యాగము చేస్తున్నాను కాని ఆయనకు ఏదో వెలితి - ఏదో లోపము కలిగినట్టుగా కలుపుగా మాట్లాడుతారు ఇంట్లో ఎవరికి కనీసావసరాలు తీర్చటానికి ప్రయత్నించినా 'ఎందుకూ? ఏమి ప్రమాదము వచ్చింది? అంటారు పిల్లలను నేను లాలిస్తుండగా చూడలేరు నేమందరమూ గొప్ప అపరాధము చేసినట్లుగా గడగడ వణకుతూ ఉండాలి జీవితములో ఈ బాధ భరించలేకుండా ఉన్నాను' అన్నది. ఆమె బాధ కూడా అసామాన్యమయినదే' అన్నాడు మన సత్యవైద్యుడు.

"పిల్లలకు తల్లిప్రేమ అధికమయితే ఒక విధమయిన ప్రమాదము. జీవితములో భావస్వాతంత్రము నశించిపోతుంది. తల్లి ఏ మార్గము ఏర్పరిస్తే దానిలో గాడి తప్పకుండా నడవటమే అతడు కర్తవ్యమనుకుంటాడు. కొత్తబాటలను స్వయముగా నిర్మించుకోలేడు ఇతడు తల్లిచాటు బిడ్డడు. తల్లిప్రేమ అధికమయినందువలన మానసిక దౌర్బల్యము కలిగింది రెండవరకము తల్లిప్రేమ నెరుగనివాడు. జీవితములో మాతృప్రేమ, దాని మాధుర్యము, సారళ్యము నెరుగనివాడు. ఈ రెండు రకాల వారికీ పెరిగి పెద్దవారయినా అభియాలు పోవు" అన్నాడు.

ఈ రెండు రకాలకు చెందినవారు మనకు ఎక్కడ చూసినా కనబడుతునే ఉంటారు. తల్లికి ఒక్కడే కొడుకు కావటం వల్లనూ ఆమెకు కుమారుని మీద అమిత వాత్సల్యము ఉండటము చేతనూ మొదటి రకము తయారవుతుంది. ఒక్కొక్కసారి మురిపెం తల్లులు మన తలలు ఎక్కడా ఆధారములేక-ఇతడి మీదనే తమ పంచప్రాణాలూ పెట్టుకొని జీవిస్తారు. తమకు ఉన్న స్థిరచరాస్తులన్నీ అతడికి సమర్పించి పెంచుతారు. ఆ పెంపకములో అతడి జీవితనౌకను చుక్కానివలె కృషి చేస్తారు. కాని అతడు స్వతంత్రించి ఏ చిన్నపని చేసినా ఓర్చుకోలేరు. ప్రకృతి సహజమయిన భావాలను బహిర్గతము చేయ



విశ్వాసం. అతడు కుటుంబీకుడయినా ఈ మార్గాన్నే అనుసరించాలని వత్తిడి చేస్తారు. చాలా సంసారాలలో శాంతిని చేకూర్చలేని ప్రబల కారణాలు ఈ రకాలే.

రెండవ రకము కూడా అరుదైనది కాదు. తనుకన్న సంతానమే అయినా తల్లికి కొందరిమీద అపరిమితమైన వాత్సల్యము, కొందరిమీద విముఖ్యము 'అతడి మీద నీకు ఎందుకు ఆపేక్ష లేదు? నీవు కన్న కుమారుడే కదా!' అని ప్రశ్నించినా ఏ తల్లీ వెంటనే సమాధానము చెప్పలేదు. దీనికి కొన్ని సాంసారికమైన పరిస్థితులు తోడ్పడుతాయి. అవిభక్త కుటుంబాలలో మనస్పర్థలూ, తగవులూ పిల్లలచేత బహిర్గతము చేయబడుతూ ఉంటాయి. వార్తాహరులు గాను సంగ్రామకులు గాను గూఢచారులు గాను పిల్లలే పనిచేస్తూ ఉంటారు. ఎదుటి పక్షములోని వారలు తెలియకపోగా - తన మీద చాడీలు చెప్పవచ్చే కుమారుని ఏమి చేయజాలని తల్లి క్షమించదు. చేతనయినంతగా శిక్షిస్తుంది. అతడిదే ఆమెకు వైముఖ్యము కలుగుతుంది. అక్కడినుంచి ఆమెకు ప్రేమ వృద్ధి కాదు. ఈ రకపు పరిస్థితులు జీవితమంతా సమకూడినటుయితే ఆమె హృదయములో ఆ కుమారుడికి తావు ఏర్పడదు. కనుకనే మనకు సంఘములో కన్న కుమారుల యెడ తటస్థ భావముకల తల్లులు, వైముఖ్యము కల తల్లులూ కనబడుతూ ఉంటారు.

తల్లిచాటు బిడ్డడూ, పరిత్యక్తుడూ విభిన్న వాతావరణములలో పెరిగినవారు. ఒకరికి మాతృవాత్సల్యము అధికమయి కర్తవ్యజ్ఞాన శూన్యతకు అవకాశము కలిగిస్తుంది; మరొకరికి మాతృవాత్సలము కరవై సమగ్రమయిన జీవితమాధుర్యాన్ని అందుకోలేని కర్కశత్వము ఉద్భవించి వృద్ధిపొందుతుంది. మొదటి రకములో అసమర్థత ఏర్పడుతుంది. రెండవదానిలో అసంతృప్తి, తెగువదారీతనము కలుగుతాయి. మొదటి రకానికి జంకూ, అనుమానమూ పీడిస్తూ ఉంటాయి. రెండవరకాన్ని నిశ్చయము నిర్లక్ష్యమూ ఆవరించుకొని [illegible] తెలియని విషయము. ఈ విధంగా ఈ రెండు రకాలకూ అనేక విషయాలలో భిన్నత ఉన్నా నిర సాంసారిక జీవితాలలో అసంతృప్తి అశాంతి ఉండటము రెండింటికీ సమానమే. అయితే వాటి స్వరూపాలు పరిస్థితులూ విభిన్నముయినవి.

ఇటువంటి పరిస్థితులు ఏర్పడినంత మాత్రాన అందరూ ఈ రెండు రకాలుగా తయారవుతారని చెప్పటము సాహసమే. కాని ఆ రకపు వ్యక్తులకు ఈ విధానాల కారణాలవి గ్రహించటములో ఏ లోపమూ ఉండదు. కొందరు శాస్త్రజ్ఞులు, ఇంటి అధికారము చలాయించే తల్లి తన కుమారుని అసమర్థునిగా తయారుచేస్తుందని విశ్వసిస్తున్నారు; గృహచ్ఛిద్రాలకూ, సాంఘిక దురాచారాలకూ బలి అయినతల్లి తన వాత్సల్యముతో కుమారుని పెంచలేక తెగువ దారిగా తయారు చేస్తుందని నమ్ముతున్నారు. ఒక శాస్త్రజ్ఞుడిని ఒక పర్యాయము స్త్రీలు తమ సంఘములో ఉపన్యసించవలసినదని కోరగా "నేను మీకు ఏం చెప్పగలను? నీతులను ఉపదేశించలేను గాని మీ కిష్టమయితే మీలో ఉన్న లోపాలను బహిర్గతము చేస్తాను-సమ్మతమేనా?" అని ప్రశ్నించాడట. వారిలో కొందరి బలవంతము మీద "కుమారుడు పెద్దవాడు కాగానే అతడిమీద తన అధికారము తగ్గిపోతుందని దిగులుపడే వారు మీలో కొందరున్నారు, అతడికి తన మీద ప్రేమ తగ్గిపోతుందని భయపడే తల్లులు కొందరున్నారు. నిజానికి మీకు ఏం కావాలి? కుమారుడి సాంసారికానందము మీకు సంతోషాన్ని కలిగించక పోవటము ఒక లోపము క్రిందలెక్క. కాని ఆ లోపము తల్లులదే. తమ సంతానానికి రెక్కలువచ్చి స్వయముగా ఆహారము సంపాదించుకొనే శక్తి రావాలని పక్షులు ఎంత ప్రయత్నము చేస్తాయో గమనించారా? వాటి ప్రయత్నములో ఉండే స్వార్థరాహిత్యము ప్రశంసించ తగినది, అనుసరణీయమైనది. ఆదర్శమాత ఎప్పుడూ తన సంతానాభ్యుదయ దృష్ట్యా బిడ్డలను పెంచి శిక్షణ నిస్తుంది. బిడ్డల జీవితాలలో ఏ లోపమూ కలుగ కూడదని కోరుకుంటుంది." అని చెప్పాడట.

(Ralph Went worth - ROHR, Psychologist, Director, Psychological Adjustment Services.)

అవును! తల్లులకేమి కావాలి? వివేకవతులు ఎప్పుడూ ప్రతిదానికీ అవధులను గుర్తిస్తారు. తమ హృదయాలు ప్రకృతి సిద్ధముగా ప్రేమ కొరకు అర్రులు చాచేవయినా, ఆ ప్రేమకు అవధులను ఏర్పరచుకొంటారు. పెనిమిటి వద్దనుండి ఎంత కావాలి - కుమారుని వద్దనుండి ఎంత కావాలని ప్రశ్నించుకొంటారు. కుమారుల విషయములో కర్తవ్యమూ బాధ్యతా నెరవేర్చ వరకేగాని అధికముగా వారి వద్దనుండి ప్రేమనాకాంక్షించే అధికారము తల్లుల కెంత ఉన్నదో తెలిసికోగలుగుతారు. కుమారుడు సమగ్రమయిన జీవితానందము అనుభవించ లేక పోవటములో తమ దోషము కొంత ఉన్నదని గ్రహించగలిగిన మాతలు ఉత్తమరాండ్రు. తన ఆధారము చేసుకొని పెరిగి పెద్దవాడయిన కుమారుడు, తన ప్రమేయము లేకుండా, బాధ్యతలను నెరవేర్చుకొన జాలిన ఉత్తమపౌరుడు కాగలిగినాడని ఆనందించి మురిసే తల్లులు చల్లటితల్లులు.

★

వాచీ దొంగ

ఆ వేళ ఆదివారం. అన్నయ్య కాస్త ఆలస్యంగా లేచాడు. ఎందుచేతంటే క్రితంరాత్రి 'సెకండు షో సినిమా'కి వెళ్లాడు. కళ్లు ఎర్రగా జేవురించి వున్నాయి. కళ్ళు నులుపుకుంటూ, వొళ్ళు విరుచుకుంటూ, బద్ధకంగా పక్కమీదనుంచి లేచాడు. టేబిలుమీదున్న తన 'రిస్టువాచీ'ని చూచాడు. 8-30 అయింది. బ్రష్, టూత్ పేస్టు, నాలికబద్ద తీసుకొని పెరట్లోకి వెళ్లాడు పళ్లు తోముకుందుకు. పెరట్లో అరుగుమీద కూర్చుని, పళ్లు తోముకుని, నీళ్ళ కోసం తన పక్కన చూచాడు. కాని తను నీళ్లు తెచ్చుకోవటం మరచిపోయేడు. ఎప్పుడూ నీళ్లు ముందుగానే తెచ్చుకునేవాడు. కాని ఇవాళ అంతా మతి మరుపులా వుంది. ఇంకా నిద్రమత్తు వొదలలేనట్లుంది. తన గదిలోంచి సరాసరి పెరట్లోకి వచ్చేశాడు. అంచేత నీళ్లు తెచ్చుకోవటమే మరచిపోయాడు.

"సూర్యం! సూర్యం!" అని కేకవేశాడు అన్నయ్య

వస్తున్నా నన్నయ్యా!" అని అన్నయ్యని సమీపించాడు సూర్యం. అన్నయ్య బ్రష్ నోట్లో పెట్టుకొని అదోలా ఆలోచిస్తున్నాడు "ఎందుకన్నయ్యా పిలిచావు" అన్న సూర్యం మాటకి అన్నయ్య మళ్ళా ఈ ప్రపంచంలో పడ్డాడు. "ఒక చెంబుతో నీళ్లు తీసుకరా, మొహం కడుక్కుంటాను" అన్నాడు. "అలాగే తీసుకొస్తాను," అని చెప్పి సూర్యం నీళ్లు తేవటానికి వెళ్ళాడు.

రమేశ్ కుమార్

కళ్లు కొద్దిగా మండుతున్నాయి. ఎన్నడూ లేని బద్ధకం ఇవాళ తనకి వచ్చి పడింది. అంతా అయోమయంగా వున్నట్టుంది. ఎప్పుడూ అన్నయ్య సూర్యోదయానికి ముందుగా లేచేవాడు. కాని క్రితం రాత్రి సెకండు షోకి వెళ్ళటం మూలాన ఇవాళ ఆలస్యంగా లేచాడు. అబ్బ! ఏమిటోగా వుంది వొంట్లో. అన్నయ్య క్రితం రాత్రి సెకండు షోకి వెళ్ళినందుకు తనని తాను నిందించుకున్నాడు. తను ఇది ఇదివరకెప్పుడూ సెకండుషోకి వెళ్ళలేదు. ఒకటి రెండుసార్లుమాత్రం బావతో వెళ్లాడు, అంతే! అదేనా బావ చిన్నబుచ్చుకుంటాడనిగాని, లేకపోతే సుతరామూ వెళ్ళేవాడు కాదు. ఐతే, క్రితం రాత్రి ఎందుకెళ్ళినట్లు? తన తోటిలెక్చరర్స్ అంతా పట్టుపట్టి, మరీ తీసుకెళ్ళారు. "నేను రాను! నన్నీసారికి వొదిలేద్దురూ?" అని తను అన్నా వాళ్ళు వొప్పుకున్నారూ? బలవంతాన తీసుకెళ్ళారు. మా ఇంటి ప్రక్కనేవున్న లెక్కల లెక్చరర్ భాస్కరరావుగారు మరీను! "ఏమిటోయ్ సుబ్రహ్మణ్యం! సరదాగా లెక్చరర్స్ నలుగురూ కలసి వెళ్దామనుకుంటే నువ్వు రానుపొమ్మంటే, బాగుంటుందా?" అని బ్రతిమాలి మరీ లాక్కెళ్లారు. అన్నయ్య కాలేజీలో సైన్సు లెక్చరర్ గా పనిచేస్తున్నాడు. భాస్కరరావుగారూ, అన్నయ్యా ఇంటర్మీడియట్ వరకూ క్లాసుమేట్స్! కాని ఆనర్స్లో గ్రూపు మార్చుకున్నారు. అన్నయ్యకి సైన్సుమీద ఇష్టం వుంది. కాబట్టి, ఆనర్స్లో సైన్సు గ్రూపు తీసుకున్నాడు. భాస్కరరావుగారికి లెక్కలంటే బలే ఆసక్తి. అంచేత ఆయన ఆనర్స్లో లెక్కల గ్రూపు తీసుకున్నారు. ఇద్దరికీ అదృష్టంవల్ల ఉన్న వూళ్లోనే ఉద్యోగం దొరికింది. భాస్కరరావుగారు రాత్రి బలవంతం చేసినందుకు, దాని ఫలితంగా ఇప్పుడు తనకు బద్ధకం మతిమరపు కలిగినందుకు అన్నయ్య ఆయన్ని నిందించాడు... 'సెకండు షో' ప్రభావం అన్నయ్యమీద ఈ విధంగా పని చేసింది.

సూర్యం చెంబుతో నీళ్లు పట్టుకుని తయారయ్యాడు. అన్నయ్య

చెంబులోని నీళ్లతో ముఖం కడుక్కోటం పూర్తి చేసి, సూర్యాన్ని తనతో తన గదికి తీసుకెళ్లాడు. బ్రష్...వగైరాలు టేబిలు మీద పెట్టి, ఓ పావలా తీసి వాడి చేతికిచ్చి "బేడిచ్చి రెండు ఇడ్డెన్లు పట్టుకరా, కారం పొడి వేయించడం మరచి పోకు, ముద్దచట్నీ వేరేగా కట్టించు. మిగతా బేడ నువ్వే తీసుకో! వేగంగా రావాలి సుమా!" అని చెప్పాడు. సూర్యానికి డబ్బులిస్తే చాలు ఎటువంటి పనైనా చిటికెలో చేస్తాడు. "అన్నయ్యా! వెల్‌కం హోటల్లోనా, లేక ఉడిపీఅయ్యరు హోటల్లోనా? దేంట్లో తెమ్మంటావ్?" అని అడిగాడు. "దేంట్లోనో వొకదాంట్లో తీసుకురా. వెధవ చొప్పదండు ప్రశ్నలూ, నువ్వూను" అన్నాడు అన్నయ్య చిరాగ్గా. "సాంబారైతే ఉడిపీ గాని, కారం పొడీ అయితే వెల్‌కంవాడే బాగా చేస్తాడు, అంచేత వెల్‌కంలోనే తెస్తా" నంటూ సూర్యం వెళ్ళిపోయాడు. అన్నయ్య వాడి మాటలకి నవ్వుకున్నాడు తనలో తాను.

పాలు పొంగటానికి సిద్ధంగా వున్నాయి. అన్నయ్య వెంటనే క్రిందకి దింపి, ఓవల్టీను, కాస్త పంచదార కలుపుకుని, తన గదిలోకి తెచ్చుకున్నాడు. ఇంతలోకి సూర్యం పొట్లాలు పట్టుకునివచ్చాడు. "అరె! చాల వేగంగా తీసుకొచ్చావే! పనికొస్తావురా సూర్యం! ఈ చలాకీ చదువులోకూడ కాస్త చూపించు!" అన్నాడు అన్నయ్య. "నేనూ పెద్ద చదువు చదివి నీలా లెక్చరర్నవుతా నన్నయ్యా!" అన్నాడు సూర్యం. "అయ్యవారి వుద్యోగం ఏం ఖర్మంరా నీకు. నువ్వు కలక్టరు వగుదువు గాని", అని అన్నయ్యవాణ్ణి వుబ్బించాడు. అన్నయ్య పొట్లాలు విప్పుతూ, "మరి నీకు బేడ ఇచ్చానుగా, వెళ్ళు." అన్నాడు. సూర్యం గదిలోంచి బయటకు వచ్చేశాడు. అన్నయ్య ఫలహారంపూర్తిచేసి ఓవల్టీను సేవించి, ఆకులు చుట్టబెట్టి కిటికీలోంచి సందులోకి పారేశాడు.



"ఏయ్, తప్పు!"

ఫొటో: బి. రవీంద్రనాథ్ —గుంటూరు.

సావిట్లో గోడగడియారం తొమ్మిది గంటలు కొట్టింది. అన్నయ్య టేబిలుమీదున్న తన 'రిస్టువాచీ' చూచుకున్నాడు. అదీ సరిగ్గా తొమ్మిదే అయింది. ఎడంచేత్తో తువ్వాలు తీసుకొని భుజంమీద వేసుకొని, కుడిచేత్తో గ్లాసూ, గిన్నె పట్టుకుని తలుపు తీసుకుని సందులోంచి పెరట్లోకి వెళ్లేడు. దాసీ దాన్ని గిన్నె గ్లాసూ తీసుకోమని తను ఇంట్లోకి వెళ్లి కుళాయిదగ్గర చేతులు కడుక్కొని, సబ్బు పెట్టె తీసుకుని మళ్ళా పెరట్లో నూతి దగ్గరకు వచ్చాడు, స్నానం చెయ్యటానికి. అన్నయ్యకి వేసవికాలంలో నూతిదగ్గర స్నానం చెయ్యటమే అలవాటు.

బాలగేయం:

బడిలో చిన్నది

శ్రీ. కోటి

మా బడిలో ముచ్చటైన
చిన్న దొకతె ఉండు!
ఆమె నన్న గైకొనియే
బడి నడచుచునుండు!

అందమైన మోము మాకది
గుండ్రంగా నుండు.
ముక్కు, చెవులు లేవు గాని
ముచ్చటగా నుండు!

చేతులు గల వామెకు, మరి
చిత్రముగా రెండు!
వేళ్లు లేవు గాని మరీ
విచిత్రముగ నుండు!

ఠీవిగాను నడచు నామె
టీక్ టాక్ మనుచుండు.
మితభాషిణియైన, గొంతు
ఖంగ్ ఖంగ్ మనుచుండు!

చెప్పుకోండి, చిన్నదాని
పేరేమైయుండు!
తెలియనిచో, గోడమీద
నున్న దామె రండు!

★ వాచీ దొంగ ★

2

స్నానం ముగించుకొని మళ్ళా యథాప్రకారంగా తన గదిలోకి వందులోనుంచేవచ్చాడు. తడితలకే కాస్త వాసననూనె రాచుకుని దువ్వుకుని, బట్టలు వేసుకున్నాడు వాచీపెట్టుకుందామని టేబిలుమీద చూస్తే వాచీ లేదు. అన్నయ్యకి గుండె ఆగినంత పని అయింది. గాభరా పడ్డాడు. గది అంతా వెతకటం ప్రారంభించాడు. గుండె దడ, దడా కొట్టుకుంటోంది. "సూర్యం! సూర్యం!" అని పిలిచాడు. సూర్యం వచ్చాడు. "నువ్వు నా వాచీకాని తీశావా?" అని అడిగాడు. "నేను తియ్యలేదన్నయ్యా!" అని జవాబిచ్చాడు. "నీకు డబ్బులిచ్చానుగా, మరో బేడ కూడ ఇస్తానులే! నా వాఛీ తీస్తే చెప్పు-ఎక్కడపెట్టావో?" అన్నాడు. సూర్యం, "నాకు తెలీదు. నేను తియ్యలేదు. నువ్విందాకా వెళ్లిపోమన్న తర్వాత నేను వెళ్లిపోయాను. అప్పటినుంచి, ఇప్పటివరకూ అక్కయ్యతో నే వున్నాను. అక్కయ్య నాకు హిందీ అక్షరాలు నేర్పుతోంది. మళ్ళా నేను నీ గదిలోకి రాలేదు. నిజంగా నాకు తెలీదు" అని ఏడుపు మొహం పెట్టాడు. "నువ్వెళ్లి అక్కయ్యను పిలుచుకురా! ఎవ్వరితోనూ నా వాచీ పోయిందని చెప్పకు. వెధవ్వి, నువ్వు రేడియోలాంటి వాడివి!"

సూర్యం వెళ్లిపోయ్యాడు అక్కయ్యను పిలుచుకురావటానికి. "అవును! వాడు వెళ్లిపోయిన తర్వాత సావిట్లో గడియారం తొమ్మిది కొట్టింది. అప్పుడు నేను రిస్టువాచీ'ని టేబిలుమీదుండగా చూశాను. అదీ సరిగ్గా తొమ్మిది గంటలే చూపింది. అవును సూర్యానికి తెలీదు పాపం! వాడికి ఏమైనా తినే వస్తువులు కావాలి గాని, వాచీతో వాడికేంపని? ఆఁ......

అన్నట్లు వాడు అప్పుడప్పుడు సరదాపడి వాచీ పెట్టమంటే, నేను వాడి చేతికి 4, 5 సార్లు పెట్టాను. కాని, వాడు నా గదివిడిచి వాచీతో బయటకి వెళ్లేవాడుకాదు. ఓ ఐదు నిముషాలు వాడి చేతిని వుంచుకొని తరువాత వాచీ తీసెయ్యమంటే తీసేవాడిని. వాడి ఏడుపుమొహం చూస్తూంటేనే తెలుస్తోంది-వాడు తియ్యలేదని. అదీకాక, వాడు నాగది విడిచిన దగ్గరునుంచి ఇంత వరకూ మిగతా పిల్లలతో కలిసి అక్కయ్యదగ్గర హిందీ అక్షరాలు నేర్చుకుంటున్నాడుట. ఐతే ఎవరు తీశారు?" అని అన్నయ్య తనలో తాను ప్రశ్నించుకుంటూండగా అక్కయ్య వచ్చింది సూర్యంతో సహా. సూర్యం బిక్కమొహం చూస్తూంటే వాడినిందాకా "నువ్వు వాచీ తీశావా?" అని ఎందుకు అడిగానా అనిపిస్తోంది అన్నయ్యకి.

"అక్కయ్యా! నా వాచీ పోయిందే!" అన్నాడు అన్నయ్య.

"ఎలా పోయింది," అంది అక్కయ్య.

"నేను సరిగ్గా తొమ్మిది గంటలకు స్నానం చెయ్యటానికి వెళ్లాను వెళ్ళేటప్పుడు వాచీ టేబిలుమీద వుంది. నేను మళ్లీ, స్నానం చేసి తిరిగివచ్చి, తలదువ్వుకుని, బట్టలు వేసుకుని, వాచీపెట్టుకుందామని టేబిలుమీద చూస్తే వాచీలేదు. ఎలా పోయిందో? ఎవరు తీసి వుంటారో? తెలియటంలేదు. మొన్న ఫస్టు తారీఖున జీతం అందుకున్న తరువాత, జీతం తీసుకొచ్చి నాన్నకివ్వబోతే, 'నీకు చిన్నప్పటి నుంచీ వాచీపెట్టుకోవాలని సరదాగా వుండేది. నన్ను ఎన్నోసార్లు వాచీ కొనమని అడిగావు. కాని నేను నీకింతవరకూ వాచీ కొనివ్వలేదు. నువ్వు ఇప్పుడు లెక్చరర్‌వి. జీతగాడివి. హోదాలో వున్నవాడివి. ఈ డబ్బుతో నీకు నచ్చిన వాచీ కొనుక్కో. పదో, పాతికో కావలిస్తే నేను ఇస్తాను,' అని నాన్న అంటే వాచీ కొనుక్కున్నాను. 'వాచీ ఖరీదు నూటయాభైరూపాయలు. నాన్నకి తెలిస్తే ఏమంటాడో?' అక్కయ్యా! నువ్వేకనుక్కోవాలి వాచీ ఎవరు తీశారో?" అన్నాడు అన్నయ్య దీనంగా. అన్నయ్య కళ్ళలో నీళ్లు తిరిగాయి. కనుకొనుకుల్లోంచి ఆ నీరు బుగ్గల మీదుగా నేలమీద పడింది. అన్నయ్య ఎంత లెక్చరర్ అయినా, ఎంత మేధావంతుడైనా, ఉత్తప్పుడు ఎంత ధైర్యంగావున్నా, పాపం ఇప్పుడు కళ్ళ నీళ్లుకూడ పెట్టుకున్నాడు. భయపడ్డాడు! ఆశ్చర్యపడ్డాడు!! విచారిస్తున్నాడు!!! "నూటయాభై రూపాయలకు నీళ్లు వొదులుకోవటమేనా? కాని నెల్లాళ్లు కూడా కాలేదు. సరదా అయినా పూర్తిగా తీరలేదు. ఒక నెల కష్టపడి, చెమటోడ్చి సంపాదించిన డబ్బు. నా కష్టార్జితం, నా జీవితంలో ప్రథమంగా ఆర్జించిన ఈ డబ్బు నాకు దక్కకుండా పోవటమేనా?" అన్నయ్య చిన్న కుర్రాడిలా మాట్లాడుతున్నాడు.

"నువ్వు స్నానానికి ఏ తోవగుండా వెళ్ళావు? ఇంట్లోనుంచా? సందులోనుంచా?" అని అన్నయ్యని అక్కయ్య ప్రశ్నించింది.

"సందులోనుంచే వెళ్ళాను," అన్నాడు అన్నయ్య.

"ఐతే తలుపులు తీసే వెళ్ళావన్నమాట!"

"తలుపులు దగ్గరగా జారవేశాను."

"స్నానంచెయ్యటం ముగించుకుని మళ్ళీ ఎన్నిగంటలకి నీ గది చేరుకున్నావు?"

"సుమారు ఒక అరగంటలో చేరివుండవచ్చును."

"నువ్వు పెరట్లో నూతిదగ్గర స్నానం చేస్తున్నప్పుడు మనింట్లోకి గాని, పెరట్లోకిగాని సందుగుండా, అంటే నీ రూము ముందునుంచి ఎవరేనా రావటము చూశావా?"

"ఉహుఁ......నేను చూడలేదు. అదీకాక ఎలా చూడగలుగుతాను గడ్డిమోపు అడ్డుగా వుందికదూ?"

"మన దాసీదికాని అటువేపు వెళ్లిందా?"

"లేదు వెళ్లలేదు. నేను స్నానం చేస్తూన్నంతసేపు అదీ, దాని కూతురూ, అన్నం తింటున్నారు."

మా ఇంటిముందు కొద్దిగా ఖాళీ ప్రదేశముంది. ఆ ఖాళీ ప్రదేశాన్ని చిన్న పార్కులా చెయించింది అక్కయ్య. సాయంకాలం అక్కడ కుర్చీవేసుకుని బాబయ్య పేపరు చదువుతూ కూర్చుంటాడు. పిల్లలు ఆడుకుంటారు. మడత కుర్చీ వేసుకుని, తాతయ్య దాంట్లో కూలబడతాడు. ఇంటికెవరేనా వస్తే, కుర్చీలు వేసుకుని అక్కడ కూర్చుని మాట్లాడుకుంటారు. పార్కుకి ముందు ఎత్తుగోడలతో రెండు వీధి గుమ్మాలున్నాయి. ఒక గుమ్మం సందు గుమ్మానికి ఎదురుగా వుంది. ఇంకో గుమ్మం సావిడి గుమ్మానికి ఎదురుగా వుంది. అన్నయ్య గదికి మొత్తంమూడుద్వారాలున్నాయి. ఒకటి పక్కన వున్న అక్కయ్య గదికి, రెండవది ఇంట్లోకి, మూడవది సందులోకి.

అక్కయ్య సందువైపు వున్న ద్వారం తలుపులు తీసింది. అన్నయ్య గది సందులోని నేలకన్న ఎత్తుగా వుంది కాబట్టి, ఇటూ, అటూ మెట్లున్నాయి. అక్కయ్య మెట్లు దిగబోతోంది, అక్కయ్యకేదో కనిపించింది, తక్కున ఆగింది. అన్నయ్యకి, సూర్యానికి ఏం బోధపడలేదు; "ఎందుకాగింది?" అన్న సందేహం కలిగింది వారికి. "ఎందుకాగావు అక్కయ్యా?" అని ప్రశ్నించాడు అన్నయ్య.

"దొంగ దొరికాడు!" అంది అక్కయ్య.

"ఎవరు?" అన్నాడు అన్నయ్య సంతోషంగా.

"ఇప్పుడు చెప్పను; నా అనుమానం స్థిరపడేదాకా చెప్పను," అని కిందికి వంగి ఆ వస్తువును పరిశీలించింది. సూర్యం, అన్నయ్య

ఆ వస్తువును చూడకుండా తనకాలు ఆ వస్తువుమీద పెట్టేసింది.

అక్కయ్య దాసీ దాన్ని పిలిచింది, అది వచ్చింది.

"దాసీది ఎందుకు చెప్మా! అది నేను సాన్నం చేస్తూన్నంత సేపూ దాని కూతురుతో పాటు చల్ది అన్నం తింటోంది కదా? అనుకున్నాడు అన్నయ్య.

"ఏవే నీ కొడుకు వచ్చాడా?" అని అడిగింది అక్క.

"ఇంకా రాలేదమ్మా! రోజూ ఈపాటికే వచ్చేవాడు, చల్ది అన్నం తినటానికి; కాని ఇవాళ ఎందుచేత రాలేదో తెలియటం లేదు. అవును గాని పెద్దమ్మాయి గోరూ! ఆడి గురించి అడుగుతున్నారూ, మా వాడు ఏమైనా..." అని దాసీది అడగబోతూంటే, దాన్ని మధ్యలోనే వారించి, "అహా, ఏం లేదు! ఉత్తినే అడిగాను. వాడు రోజూ చల్ది అన్నం తినడానికి వచ్చేవేళ కదా, ఇది ఇంకా వచ్చినట్టు లేదని అడిగాను," అంది అక్కయ్య.

"అంతే కదా! ఇంకా ఏటో, మావాడు ఏంచేశాడో అనుకున్నాను. వస్తాను తల్లీ!" అని దాసీది వెళ్లిపోయింది.

అక్కయ్య సావిట్లోకి వెళ్ళి గడియారం చూసింది. పావు తక్కువ పది అయింది. "నువ్వు ఇప్పుడు మన దాసీదాని ఇంటికి వెళ్లాలి. దాని కొడుకు "సోవిఁగాడు" అక్కడ వుంటాడు. వాడిని మనింటికి తీసుకురా. వాడిదగ్గర వాచీ విషయం ఏమీ ఎత్తకు, నెమ్మదిగా మంచి మాటలాడి తీసుకురా. రానంటాడు. అప్పుడు బలవంతాన తీసుకురా. నాలుగు తగలనియ్యి, మరేం ఫరవాలేదు!" అంది అక్కయ్య.

"ఏవిటి, మన దాసీదానికొడుకు "సోవిఁగాడు" తీశాడా నా వాచీ? పాపం, వాడు ఇవాళ పొద్దుటనుంచీ మనింటికి రాలేదు కదా, వాడే తీశాడని ఎలా అనుకుంటాం? వాడెందుకు?" అన్నాడు అన్నయ్య వాడిని తీసుకరావటము అనవసరము అని సూచించేటట్టుగా మొహం పెట్టి.

"నన్ను మధ్యలో ఏమీ ప్రశ్నించవద్దు. వాడు తీశాడని, నేననటం లేదుగా. వాడిని తీసుకు రమ్మన్నాను. అంతే! తీసుకు రావటం నీవొంతు. త్వరగా వెళ్లు," అంది అక్కయ్య.

"నాకు, మరి మన దాసీ దాని ఇల్లు తెలీదు," అన్నాడు అన్నయ్య.

"నాకు తెలుసునక్కయ్యా!

కోడిపుంజు — చిక్కుడు గింజ

కొంతకాలం క్రిందట, ఒకవూళ్లో ఒక కోడిపెట్టా, కోడి పుంజూ వుండేవి. ఒకరోజున కోడిపుంజు, తోటలోని మన్ను తవ్వుతుండగా ఒక చిక్కుడు గింజ బయటపడింది.

"ఈ చిక్కుడు గింజను నువ్వు తిను" అంది కోడిపెట్టతో.

"అహాఁ, అలాకాదు! దీన్ని నువ్వే తిను" అంది కోడిపెట్ట.

"అయితే సరే –" అంటూ ఆ చిక్కుడుగింజను ఒక్క గుటకతో మింగేసింది కోడి పుంజు. కాని, పాపం, ఆ గింజ తిన్నగా కడుపులోకిపోక గొంతుకు అడ్డంగా నిలిచిపోయింది.

"నదిదగ్గిరకివెళ్లి తాగటానికి కాసినినీళ్లుయిమ్మని అడుగు" అంటూ కోడిపెట్టని బ్రతిమిలాడింది.

మొన్న దాంతో కూడా దానింటికి వెళ్లాను," అన్నాడు సూర్యం.

"ఐతే మరీ మంచిది. సూర్యాన్ని తీసుకుని దానింటికి వెళ్లు. వాడక్కడ వుండొచ్చు. లేకపోతే, ఎక్కడికి వెళ్లాడో నాకు కబురు చెయ్యి. వాణ్ణెలాగయినా, ఎక్కడున్నా ఇక్కడికి తీసుకురా," అంది అక్కయ్య.

"రా అన్నయ్యా నాతో, మన దాసీ దానింటికి వెళ్దాం," అని అన్నయ్య చెయ్యిపట్టుకుని వీధిలోకి తీసుకెళ్ళాడు సూర్యం.

(మిగతాకథ వచ్చేసంచికలో.)

ఏం చేస్తుంది పాపం! కోడిపెట్టకు వెళ్ళక తప్పిందికాదు.

"ఓనదీ, మా కోడి పుంజు గొంతులో చిక్కుడు గింజ అడ్డంపడింది; కాసినినీళ్ళియ్యవూ తాగటానికి?" అని ప్రాధేయపూర్వకంగా అడిగింది.

అంటే నది సమాధానంచెప్పింది! "అలాగా? అయితే నువ్వు సరాసరి నిమ్మచెట్టుదగ్గిరకి వెళ్లి ఒక ఆకు అడిగి తీసుకురా, అప్పుడు నీకు నీళ్లిస్తాను."

వేరే గత్యంతరంలేక కోడిపెట్ట నిమ్మచెట్టుదగ్గిరకి పరుగెట్టింది.

"ఓ నిమ్మచెట్టూ! నాకో ఆకు యివ్వవూ! ఆ ఆకు తీసుకువెళ్లి నదికిస్తే, నది నాకు నీళ్లిస్తే, ఆనీళ్లు తీసుకువెళ్లి కోడిపుంజుకుయిస్తే, కోడిపుంజు ఆనీళ్లు తాగితే, చిక్కుడు గింజ గొంతులోంచి జారుతుంది." అంటూ జాలిగొలిపేటట్లు అడిగింది.

కాని, నిమ్మచెట్టు ఏమందంటే: "అయితే నువ్వు రైతుకూతురుదగ్గిరకి వెళ్ళి కొంచం దారం అడిగి తీసుకురా" అని అంది.

వెంటనే కోడిపెట్టకు మరో మార్గం కనుపించక నిమ్మచెట్టు చెప్పినట్లు రైతుకూతురుదగ్గిరకు పరుగెత్తింది.

"ఓ రైతుకూతురా. మా కోడి పుంజు గొంతులో చిక్కుడుగింజ అడ్డంపడింది. అందుకు నీళ్ళు కావాలి. నదిని అడిగితే నిమ్మ ఆకు తెమ్మంది. నిమ్మచెట్టు నడిగితే దారం తెమ్మంది కాస్త దారం యియ్యవూ?" అంది అనునయంగా!

అయితే రైతుకూతురు కోడిపెట్టను చూసి—"నువ్వు వెళ్ళి దువ్వెన్నలు చేసేవాణ్ణి అడిగి ఒక దువ్వెన తీసుకువస్తే, నీకు దారం యిస్తా" అని అంది.

వెంటనే కోడిపెట్ట దువ్వెన్నలు చేసేవాడిదగ్గిరకి పోయింది.

"అయ్యా, మా కోడిపుంజుకి గొంతులో చిక్కుడుగింజ అడ్డం పడింది. నీళ్ళకోసం నదికి వెళ్తే నిమ్మాకు తెమ్మంది. నిమ్మచెట్టు దారం కావాలంది. రైతుకూతురు దువ్వెన తీసుకురమ్మంది. దయవుంచి ఒక దువ్వెన యియ్యవూ?" అంటూ ప్రార్థించింది.

ఆ దువ్వెన్నలు చేసేవాడు కోడిపెట్టను చూసి—"అలాగా పాపం! అయితే నువ్వు వెళ్లి మాకు కొన్ని రొట్టెలు తెచ్చిపెట్టు. అప్పుడు నీకు దువ్వెన యిస్తాను"—అంది.

కోడి పెట్టకు ఏమీ తోచక రొట్టెలవాడి దగ్గిరకి పరుగెత్తింది.

"అయ్యా, మా కోడిపుంజుకి గొంతులో చిక్కుడుగింజ అడ్డుపడింది. త్రాగటానికి నీళ్ల కోసం

నదికి వెడితే, నది నిమ్మాకు తెమ్మన్నది. నిమ్మచెట్టు దారం కావాలన్నది. రైతుకూతురు దువ్వెన తీసుకు రమ్మన్నది. దువ్వెన్నలు చేసేవాడు రొట్టెలుకావాలన్నాడు. దయవుంచి మీరు కొన్ని రొట్టెలు యిస్తే మా కోడిపుంజుకి నీళ్లు తీసుకువెళ్తాను" అని ప్రాధేయపడింది.

"పాపం అలాగా! నువ్వు ఒక పని చెయ్యి! వెంటనే కర్రల అడితికిపోయి కొన్ని కర్రలు తీసుకురా. నీకు రొట్టెలు యిస్తాను" అన్నాడా రొట్టెలవాడు.


అలాగే ఆ కోడిపెట్ట కర్రల అడితికి పరుగెత్తింది.

"స్వామీ, కాసినికర్రలు మీరు నాకిస్తే అవి తీసికెళ్లి రొట్టెల, వాడికిచ్చి చేసిన రొట్టెలు తీసుకుని, ఆ రొట్టెలు దువ్వెన్నలు చేసేవాడికిచ్చి ఒక దువ్వెన తీసుకుంటాను. ఆ దువ్వెన రైతుకూతురు కిచ్చి ఒక నిమ్మ ఆకు తీసుకుంటాను. ఆ నిమ్మాకు తీసుకెళ్లి నదికిచ్చి కాసినినీళ్ళు తీసుకుంటాను. ఆ నీళ్లు తీసుకెళ్లి మా కోడిపుంజుకిస్తే, ఆ కోడిపుంజు వాటిని తాగుతుంది. వెంటనే దాని గొంతులో అడ్డం పడిన చిక్కుడుగింజ కడుపులోకి పోతుంది అంటూ మొరపెట్టుకుంది కోడిపెట్ట

ఆ కోడిపెట్ట దీనాలాపాలు విని పాపం ఆ అడితి ఆసామీ దయతలచి దానికి కొన్ని కర్రలిచ్చి పంపించాడు.


వెంటనే కోడిపెట్ట అపరిమితానందంతో గంతులేస్తూ పోయి ఆ కర్రలు రొట్టెల వాడికిచ్చింది. రొట్టెలవాడు సంతోషించి దానికి కొన్ని రొట్టెలిచ్చాడు. ఆ రొట్టెల్ని తీసు

(56-వ పేజీ చూడండి)



తల్లీ, పిల్లా

ఫొటో: శ్రీపాద వెంకన్న, కడప.



జరిగిన కథ:—

అది 1866 వ సంవత్సరం ప్రారంభం. సాగర గర్భంలో బ్రహ్మాండమైన జలజంతువేదో కనిపించిందనే వార్త ప్రపంచప్రజలను విభ్రాంతులను చేసింది. సముద్రంలో ప్రయాణంచేసే నౌకల కది ఇట్టే కనిపించి ఇట్టే మాయ మయ్యేది. దానివలన నాగరిక ప్రపంచానికి, ముఖ్యంగా నౌకాప్రయాణాలకి ప్రమాదం సంభవించవచ్చునని అందరూ అభిప్రాయపడ్డారు. అమెరికా ప్రభుత్వం అబ్రహాం లింకన్ అనే యుద్ధనౌకను ఆ జలజంతువును వేటాడడానికి నియమించారు. అమెరికా ప్రభుత్వ నౌకాశాఖా కార్యదర్శి హాబ్సన్ ప్రకృతిశాస్త్రపరిశోధకుడు ప్రొఫెసర్ అరోనాను ఈ విజ్ఞానయాత్రలో పాల్గొనవలసిందని ప్రార్థిస్తాడు. అతడు వెంటనే దాని కంగీకరించి తన పరిచారకుడు కాన్సిల్‌తో సహా ఓడ ఎక్కుతాడు. అబ్రహామ్‌లింకన్ క్రమక్రమంగా పసిఫిక్ మహాసముద్రంలో ప్రవేశిస్తుంది. అది అలాగ కొంతదూరం ప్రయాణం చేసేసరికి కొంతదూరంలో సముద్రతరంగాలమీద ఒక పెద్ద వెలుగు కనిపించింది. ఆ వెలుగు ఒక పెద్ద జలచరానికి సంబంధించినదై ఉండాలని నౌకాధికారులంతా ఊహించారు. నావ దానిదగ్గిరికి పట్టించి దానిమీద ఫిరంగిగుళ్ల వర్షం కురిపించారు. అబ్రహామ్‌లింకన్ తరవాత జరిగిన పోరాటంలో ఎందుకు పనికిరానిదై పోతుంది. ప్రొఫెసర్ అరోనా, కాన్సెల్ నెడ్‌లాండ్‌లతో కలిసి ఒక జలాంతర్గామిలో ప్రవేశిస్తారు. కొంతసేపటికి ఓడనావికులు వారికి పుష్టిగా భోజనం పెడతారు. భోంచేసి అందరూ హాయిగా నిద్రపోతారు. తిరిగీ తమ కన్నపానాలు రాలేదని అంతా మథనపడుతూంటే వారికి హఠాత్తుగా జలాంతర్గామి అధికారి ప్రత్యక్షమౌతాడు. కెప్టెన్ నీమో ఇక ఆ ఓడలోనించి ఎవరు బయటపడలేరని చెప్పి ప్రొఫెసరు అరోనాకు జలాంతర్గామి యంత్రాల రహస్యాలు తెలియజేస్తాడు. ప్రొఫెసర్ అరోనా నీమో గదిలో వింతలు విశేషాలు చూచి ఎంతో ఆశ్చర్యపోతాడు.

అనువాదం: "వినాయక"

13

అటుతరవాత మే మిద్దరము చుట్టలు ముట్టించి సావకాశంగా సంభాషణ ప్రారంభించాము. కెప్టెన్ నీమో నాటిలస్ జలాంతర్గామి యంత్రాలనుగురించీ, అవి నడిపించే పద్ధతులను గురించీ ఎన్నెన్నో వివరాలే కరువు పెట్టాడు. జలాంతర్గామి ఆకారం కదురులా ఉండడంవల్ల మూలాన్ని సాగర గర్భంలో అది అత్యంత వేగంతో సాగిపోగలదని అన్నాడు. ఆపైన నే నడిగాను:

"అయితే సాగర గర్భంలో అంతా అంధకారమేగదా! ఆ పరిస్థితుల్లో మీ జలాంతర్గామి ఎలాగ నడిపిస్తారు?"

"చాలా పెద్ద పెద్ద విద్యుద్దీపాల సహాయంతో ముందుమార్గం జాగ్రత్తగా పరిశీలిస్తూంటారు. ఆ విద్యుద్దీపాలకాంతిలో సముద్రగర్భంలో

అరమైలు దూరందాకా స్పష్టంగా పరిశీలించవచ్చును."

"అయితే స్కోటియా మీరు ముంచివేయాలని ముంచివేయలేదన్నమాట! అది ఏదో యాదాలాభంగా జరిగిన సంఘటన అన్నమాట!"

"నిజమే! అది కేవలం తలవని తలంపుగా జరిగిన సంఘటనే! మేము నీటిలోపల కొంచెం లోతుగా పోతూంటే హఠాత్తుగా అనుకోకుండా ఆ సంఘటన జరిగింది. అయితే దానిమూలాన పెద్ద దుస్సంఘటన లేమైనా జరిగాయా?"

"లేదుగాని మీరు అబ్రహామ్ లింకన్ నౌక నెలా ముంచారు?"

"ప్రొఫెసర్! నిజానికి అమెరికా నౌకాదళంలో అబ్రహామ్ లింకన్ అంతటి గొప్ప నౌక లేనేలేదని చెప్పవచ్చును. కాని ఆ నౌక నామీదికి వచ్చినప్పుడిక తప్పనిసరిగా నా జలాంతర్గామి సంరక్షించుకోవలిసిన పరిస్థితి ఏర్పడింది. అయితే నేనంతగా గట్టి దెబ్బకొట్టలేదు. కొంచెం బాగుజేయిస్తే మళ్ళీ అబ్రహామ్ లింకన్ నడిపించడమేమీ అంత కష్టంకాదు."

"కెప్టెన్ నీమో! నిజంగా మీఓడ ఒక అత్యాశ్చర్యకరమైన నిర్మాణం!"

ఆపైన నీమో నామాటలకెంతో ఆనందించి నెమ్మదిగా ఇలాగన్నాడు:

ప్రొఫెసర్! నేనీ జలాంతర్గామిని కన్నకొడుకుకన్నా ఎంతో ఆప్యాయంగా చూచుకొంటున్నాను. మీ సామాన్య నౌకలలోలాగ మా జలాంతర్గామిలో ప్రాణభయంలేదు. ఇందులో ఆవిరిఇంజనులు పేలిపోతాయనే భయమేమీ లేదు. మా జలాంతర్గామి అంతా ఇనుముతో తయారుచేశాము. మాకు బొగ్గు సప్లయి తరిగిపోతుందేమోనన్న భయమేమీ లేదు. ఇది కేవలం విద్యుచ్ఛక్తి సహాయంతో నడిచే నౌక అని ఇంతకు పూర్వమే చెప్పానుగదా! సముద్ర గర్భంలో ప్రయాణం చెయ్యడంవల్ల మాకు గాలివానల భయమేమీ లేదు. దీని నిర్మాణంలోను, నడిపించడంలోను మేము తీసుకుంటున్న శ్రద్ధ ఇంతా అంతా కాదు. జలాంతర్గామి నిర్మాత, యంత్ర పరిశీలకుడు, సర్వాధికారి ఒకే ఒక వ్యక్తి. ఆ వ్యక్తి ఎవరో మీకు వేరే చెప్పవలసిన అవసరమేమీ లేదుగదా!"

అని కెప్టెన్ నీమో ఇలాగే ఎంతో ఉత్సాహంగా మాట్లాడుకుపోతున్నాడు. మళ్లీ నేనడిగాను:

"ఇంత అత్యద్భుతమైన నౌక మీ రెక్కడ, ఎలాగ నిర్మించారో మాత్రం నా కవగాహన కావడం లేదు."

"నేనీ జలాంతర్గామి భాగాలు ప్రత్యేకంగా ప్రపంచంలో వేర్వేరు దేశాలలో తయారుచేయించాను. వేరు వేరు చిరునామాలతో ఆ భాగాలన్నీ అతిరహస్యంగా ఒకచోటికి తెప్పించాను."

"అయితే అవ్వన్నీ అతికించడం ఎక్కడ జరిగింది?"

"అదే చెబుతున్నాను. అవ్వన్నీ ఒక చిన్న ద్వీపంలోకి తెప్పించి, అక్కడ అతి రహస్యంగా ఈ జలాంతర్గామితయారుచేయించాను. నా నావికులందరు ఎంతో కష్టం మీద ఇది నిర్మించారు. నౌకా నిర్మాణం జరిగిపోగానే దానికి సంబంధించిన ఆనవాళ్ళేమీ మిగలకుండా బాగా జాగ్రత్తపడ్డాను."

"అయితే మీకీ జలాంతర్గామి నిర్మించడానికి చాలా ఖర్చై ఉండాలే!"

"అవును! అయిన మాట నిజమే! ఇదంతా తయారయేసరికి నాకు 80 వేల పౌనులదాకా ఖర్చయింది. మొత్తంమీద ఈ జలాంతర్గామిలో ఉన్న అమూల్య శిల్పాలతో కలిపి నాకు రెండు లక్షల పౌనులదాకా ఖర్చయింది."

"అయితే మీరు బాగా ధనవంతులై ఉండాలే!"

"నేను చాలా డబ్బున్నవాణ్ణే! అవసరం అయితే ఇంగ్లండు దేశం ఋణం అంతా ఒక్క దెబ్బతో తీర్చివెయ్యగలను!"

నేనా మాటలు విని అతనివైపలాగే విస్తుపోయి చూశాను. ఒకవేళ అతిశయోక్తిగా మాటాడడం లేదుగదా! అని నాలో నేనాశ్చర్యపోయాను.

తరవాత కెప్టెన్ నీమో ఒకటి రెండుసార్లులొకమీట నొక్కాడు.

వెంటనే జలాంతర్గామిలోని పంపులు లోపల నిలవచేసిన నీరంతా పైకి తోడివేయడం ప్రారంభించాయి. భారమితి యంత్రం జలాంతర్గామి నీటిపైకి పోతూన్న విషయం సూచించింది.

"మనం సముద్రంపైకి వచ్చేశాము!" అన్నాడు కెప్టెన్ నీమో.

తరవాత మేము గదిలో అమర్చిన మెట్లెక్కి జలాంతర్గామి టాపు మీదికి వచ్చేశాము.

నాటిలస్ పై భాగం నీటిపైన మూడడుగుల వరకు మాత్రమే తేలింది. జలాంతర్గామి స్వరూపం అంతా ఇప్పు డొక కదురులా కని పించింది. నాటిలస్ ముమ్ముం దొక పెద్ద విద్యుద్దీపం తళతళా మెరిసింది.

సముద్రం అంతా ప్రశాంతంగా ఉంది. ఎంతైనా చూడ సొంపుగా కనిపించింది. ఆకాశం అంతా నిర్మ లంగా ఉంది. అందుచేత చాలా దూరంవరకు స్పష్టంగా చూడడా నికి వీలిచ్చింది. కనుచూపు మేరవరకు ఎక్కడ చూచినా నిశ్చల మహా సముద్రం తప్ప మరి వేరే ఏమీ కనిపించలేదు.

కెప్టెన్ నీమో తనదగ్గర ఉన్న యంత్రం సహాయంతో సము ద్రంలో మేమున్న ప్రదేశం జాగ్ర త్తగా గుర్తిస్తున్నాడు:

"మన మిప్పుడు జపాను తీరానికి 3 వందల మైళ్ల దూరంలో ఉన్నాము. ఈ వేళ నవంబరు 8 వ తేదీ. నేడే మనం సముద్రగర్భంలో వింతలు, విశేషాలు చూడడాని కుపక్రమిస్తున్నాము."

"భగవంతుని దయ వల్ల మీ ప్రయత్నాలన్నీ సుఖంగా సాగి పోవాలని కోరుతున్నాను." అన్నాను.

14

అటుపిమ్మట మళ్ళీ కెప్టెన్ నీమో నాకేసి చూసి ఇలా గన్నాడు:

"నేను మిమ్మల్నింక ఇబ్బంది పెట్టదలుచుకోలేదు. సుఖంగా మీ గదిలోకి వెళ్లి చదువుకోవచ్చును. మీకు నే నిప్పుడు మనం సము ద్రంలో ఎక్కడున్నామో స్పష్టంగా తెలియజేశాను. ఇవ్వన్నీ మన యాత్రకు సంబంధించిన విశేషాలు. జాగ్రత్తగా వీటికేసి చూస్తాంటే మీ కంతా బాగా అవగాహన అయిపోతుంది. ఈ గది అంతా మీ రింక ఇష్టం వచ్చినట్టు వాడుకో వచ్చును. నే నింక సెలవు తీసు కొంటున్నాను."

తరవాత నీమో నాదగ్గిర సవి నయంగా సెలవు తీసుకొని అక్కడ నించి వెళ్ళిపోయాడు.

ఇతనినే అందరు జలాంతర్గామి సర్వాధికారిగా గౌరవిస్తున్నారు. ఇంతకీ ఇత డే దేశీయుడో ఏమీ బోధపడలేదు. తా నే దేశానికీ చెందినవాణ్ణి కానని కెప్టెన్ నీమో సగర్వంగా చెప్పుకొంటున్నాడు. నిజంగా ఇతడి కింతగా మానవ విద్వేషం కలగడానికి గల కారణ మేమో తెలియడంలేదు. నన్నింతో గౌరవంగానే చూస్తున్నాడు కాని ఎందుచేతనో కొంచెం దూరదూరం గానే అట్టే బెడుతున్నాడు.

భూమిమీదలాగే సముద్రంలో కూడా నదీప్రవాహాలవంటివి కని పిస్తూంటాయి. ప్రత్యేకంగా వాటికి వేరువేరు పేరులు కూడా పెట్టారు. ఇలాంటి ప్రవాహాలలో ఒకదానికి గల్ఫ్ స్ట్రీమ్ అని పేరు. ఇంకొకదానిని నీలనదీ ప్రవాహమని పిలుస్తారు. ఇది ఆసియాతీరం అనుకుని ప్రవ హిస్తూ క్రమక్రమంగా ఉత్తర పసి ఫిక్ మహాసముద్రంలో ఎల్యూషి యన్ ద్వీపాలదాకా వెళ్లిపోతుంది. ఈ ప్రవాహంలో ఒక్కొక్కప్పుడు పెద్ద పెద్ద చెట్లు అవీ కూడా కని పిస్తూంటాయి. క్రమక్రమంగా మా జలాంతర్గామి ఈ ప్రవాహంలో ప్రవేశించింది. ఇంతలో నెడ్ లాండ్ కౌన్సెలు లిద్దరు నా గది గుమ్మంలోకే వచ్చి నిలుచున్నారు. వారిద్దరు ఆ నీలనదీ ప్రవాహంలో కనిపించే చిత్రవిచిత్రాలుచూచి నిర్ఘాంతపోతున్నారు. మన మిప్పు డెక్కడున్నామో అని అదేపనిగా ఆశ్చర్యపోతున్నారు. ఆపైన నే నన్నాను.

"మీ రేమీ అంతగా ఆశ్చర్యపో నక్కరలేదు. మనమిప్పుడు సముద్ర మట్టానికి సుమా రిరవై మైళ్ళు దిగువ నున్నాము."

"మీ రేమి చెప్పినా మాకు బైబిల్ సూక్తుల్లా వినిపిస్తున్నాయి. అసలు మీ గది చూస్తేనే నా కెంతో ఆశ్చర్యంగా ఉంది" అన్నాడు కౌన్సెల్.

నెడ్ లాండ్ కీ సాగరగర్భం వింత లేవీ నచ్చలేదు. అతడు కెప్టెన్ నీమో నాతో మాటాడిన సంగతు లనుగురించి గుచ్చిగుచ్చి అడిగాడు. కాని నా కతని ప్రశ్నలన్నిటికీ సమాధానం ఇవ్వడానికి తగినంత సావకాశం కూడా కలగలేదు. అప్ప టికి తోచినవేవో నాలుగు విష యాలు చెప్పి అతనికి తెలిసిన విష యాలనుగురించి ప్రశ్నించాను.

"నాకేమీ తెలియలేదు. అసలీ జలాంతర్గామిలో ఎంతమంది నావికు లున్నారో కూడా తిన్నగా తెలి యడంలేదు మొత్తంమీద ఈ ఓడ అంతా విద్యుచ్ఛక్తి మూలం గానే నడుస్తూన్నదా?"

"అవును."

"అయితే మొత్తంమీద దీనిలో ఎంత మంది నరంగు లున్నారో చెప్పగలరా?"

నే నతడి ప్రశ్న అడగడానికిగల కారణమేమో గ్రహించివేశాను. నెమ్మదిగా అతని కిలాగ నచ్చ చెప్పాను:



అమెరికా పచ్చిక బయళ్ళలో ఉండే ఉడుతలవంటి జంతువులు ఎప్పుడూ కులాసాగా ఉంటాయి. మంచివాడిగల పళ్ళు వీటి ఆయుధాలు. చురుకుతనం, తెలివితేటలు, పెద్దజంతువులకు బలికాకుండా వీటిని కాపాడుతూ ఉంటాయి. ఇది 'వానిషింగ్ ప్రెయిరీ' అనే చిత్రంలో ఒక దృశ్యం.

★ సాగరగర్భంలో సాహసయాత్ర ★

"నెడ్‌లాండ్! నే నొక ముఖ్య విషయం చెబుతున్నాను. జాగ్రత్తగా విను! నీవి జలాంతర్గామి స్వాధీనపరుచుకోవాలని ఆలోచిస్తున్నావు గాని, అలాంటి అభిప్రాయం నిన్ను పూర్తిగా విడిచిపెట్టు! ఈ ఓడలోనించి తప్పించుకుపోవాలనే అభిప్రాయం కూడా అలాంటిదే! అలాంటి గాలిమేడలవల్ల చిట్టచివరకి మిగిలేదేమీ ఉండదు. మాట్లాడకూరుకుని జరిగేవన్నీ కళ్ళారా కనిపెట్టి చూస్తూండడం తప్ప మనమిప్పుడు చెయ్యగలిగిందేమీ లేదు! జాగ్రత్తగా ఆలోచించుకో! నీ మేలుకోరి చెబుతున్నాను."

"ఈ ఇనపకమ్ముల కైదులో ఇక కనిపెట్టి చూడడాని కేమి ఉంది?"

నెడ్‌లాండ్ ఈమాటలన్నాడో లేదో అంతలోనే హఠాత్తుగా మేమున్న గదిఅంతా ఒక్కసారిగా అంధకారబంధురమైపోయింది. పైన తనాభిమీద జాజ్వల్యమానంగా వెలిగే విద్యుద్దీపిక ఒక్కసారిగా ఆరి ఊరుకుంది. నేనిక ఆ గాఢాంధకారం భరించలేకపోయాను. ఆ తరవాత మేమేమి చెయ్యడానికీ పాలుపోక కొంతసేపటివరకు అలానే నిలుచుండిపోయాము. అంతలోనే ఏదో తెరిచినట్టు చప్పుడయింది.

"ఈ దెబ్బతో మనందరిపని అయిపోయిందన్నమాటే!" అన్నాడు నెడ్‌లాండ్.

అంతలోనే గదిలో రెండువైపులా రెండుచోట్ల పెద్దపెద్ద విద్యుద్దీపాలొక్కమారుగా వెలిగాయి! ఆ రెండు వైపులనించి సముద్రజలం స్పష్టంగా కనిపిస్తోంది.

మాకు, సముద్రానికీ మధ్యగా ఉన్న పెద్ద గాజుఅద్దాలు మాత్రమే. మొట్టమొదట నాకవి రెండు నీటి ఒత్తిడివల్ల బద్దలయిపోతాయేమోనని భయం వేసింది. కాని వాటి వెనకాల రాగితీగెలతో గట్టిగా బిగించడంవల్ల అలాంటి ఆపత్తు కలిగే అవకాశమేమీ కనిపించలేదు. చుట్టూరా ఒక మైలుదూరం వరకు సముద్రం అంతా ఒక అద్దంలా స్పష్టంగా కనిపిస్తోంది. ఏమి అత్యద్భుతమైన దృశ్యమది! ఎంతటి మహారచయితలైనా అది వర్ణించలేరంటే అతిశయోక్తి ఏమి

ముగ్గురు మగలకథ

కామవరపు సూర్యనారాయణరావు

శ్రీకృష్ణదేవరాయల ఆస్థానమున కొకనాడు తెనాలి రామకృష్ణుడు ముందుగ వచ్చి కూర్చుండెను. అటుపిమ్మట మొల్ల వచ్చి తన సింహాసనముపై కూర్చుండెను. ఆనాడు రాజుగారు సభకు కొంచమాలస్యముగ వచ్చెదరనియు వచ్చిన పండితులను సభలో గూర్చుండవలసినదిగా సెలవిచ్చిరనియు దౌవారికుడు రామకృష్ణునితోను మొల్లతోను చెప్పి వెడలెను.

మొల్ల రామకృష్ణుని బిలచి కాలక్షేపమున కొక కథ చెప్పుమనెను. అంత రామకృష్ణుడు మొల్ల వైపునకు తిరిగి "అనగనగనగనగనగనగన....."యని కథ మొదలిడెను. మొల్ల "బాగానే ఉన్నది యిక కథ నారంభింపు"మనెను. రామకృష్ణుడు "అట్లా"యని మరల "అనగనగనగనగనగనవగా నొక యూరిలో నొక చక్కని చుక్క గలదు. ఆమెకు ముగ్గురు మగలు. ఒక మొగుడామెను..." అని చెప్పబోవుచుండగా—మొల్ల తాను గూరుచున్న కుర్చీనుండి లేచి "ఛీ! ఛీ! యిదేమి కథ రాజుగారు రానిమ్ము నీ పని పట్టించెద"ననెను.

ఇంతలో శ్రీకృష్ణదేవరాయలు మిగిలిన పండితులతో సభ కేతెంచి సింహాసనాసీనుడాయెను. మొల్ల రాజుతో రామకృష్ణుడు తన్ను అవమానించిన విషయమును విన్నవించుకొనెను. ఆమె మాటలను వినగనే, రామకృష్ణునిపై పగ దీర్చుకొన వేచియున్న పండితులు లేచి "ఏమీ! కథ చెప్పుమనగా నొక చక్కని చుక్కకు మూవురు మగలని ప్రారంభించినాడా! ఆడుదానవు గదా యనియు నొంటరిగా నుంటివనియు నిన్నవమానింపనెట్టి కథను జెప్ప మొదలిడినాడా! రాజుగారు వచ్చుచునే వాని పలుకుల నాలకించినారు వీనికి తగిన శిక్ష విధించెదరులే." యనిరి.

రాజు రామకృష్ణుని బిలచి "నీవు మొల్లకు చెప్పిన కథను మరల 'తు' 'చ'లు తప్పకుండ చెప్పుమనిరి. రామకృష్ణుడు కంఠము సర్దుకొని "మహారాజా! నేను చెప్పినవి నాలుగు ముక్కలు. వీరందులో ఆరు తప్పులను బట్టిరి. కథ మొదలుపెట్టగనే మూతిముడుచుకొన్నది. మొల్లవంటి విదుషీమణి నన్ను కథ చెప్పుమని వేడ పుక్కిటి పురాణములు గాక జరిగిన కథను జెప్పంబోవ, నన్నిట్లవమాన పరుప నెంచినది. నా కథలో దప్పున్న నన్ను దండింపుడు. [illegible]

[illegible] విధినకథ. మీరు చెప్పుమన్న మరల చెప్పెద" ననెను. రాజు కథను 'తు' 'చ' లు తప్పకుండ మొల్లకు చెప్పినట్లు చెప్పుమనెను. రామకృష్ణుడు కంఠమును సర్దుకొని "అనగనగనగనగనగనవగా నొక యూరిలో నొక చక్కని చుక్క గలదు. ఆమెకు ముగ్గురు మగలు. వారిలో నొకమొ"...అని చెప్పబోవుచుండ రాజు ఛీ! ఛీ! రాజసభలో నొంటరిగా నున్న మహా కవయిత్రి నిట్లవమానము చేయ నెంచితివా? నీవు నా రాజ్యమున నుండవలదు. యెందేనిబొమ్ము. నీ మూలమున నా మర్యాదలడుగంటుచున్నవి. మేమందరము సభలో నుండగనే నీవిట్టి కథను జెప్పబూనితివి. నిన్నేమి చేసినను తప్పులేదు. నీవు చెప్పబోవు కథ పురాణ గాథయంటివి. నాయాస్థానములో నీ వుండవలదు. పొమ్ము పొమ్ము "అనెను. రామకృష్ణుడు "రాజా! ఆంధ్ర దేశమున పుట్టి ఆంధ్ర భాషాభిమానినగు నన్ను మరొక దేశమునకు బొమ్మన్నం బోదునా? నా కథ నామూలాగ్రముగ విని యిది పురాణ గాథ కాకున్నచో నన్ను బొమ్మని శలవీయుడు. ప్రతిమానవునకు తాను విన్న మాటలను బట్టియు చూచిన వనులను బట్టియు అహంకార ముత్పన్న మగును. ఆ అహంకారము నణచుకొని శాంతముతో మనస్సును సమాధాన పరుచుకొన్నగాని తావిన్న మాటల యందలి సత్యాసత్యములు దెలియుట దుర్లభము. కావున నా కథ నామూలాగ్రముగ విని యంతు [illegible]

లేదు. ఆ సముద్రగర్భంలో తేజః ప్రసారంవల్ల కలిగిన విచిత్రదృశ్యం వర్ణించడమంటే మాటలతో పని గాదు! మా కింక ఎన్నెన్ని చిత్ర విచిత్రాలు కనిపిస్తాయో! ఎవరు చెప్పగలరు?

ముగ్గురు మగల కథ

రాయలు శాంతించి కథను చెప్పమని రామలింగని కాజ్ఞాపించి తాను సింహాసనాసీనుడాయెను. రామకృష్ణుడు మరల కంఠమును సవరించుకొని "అనగనగనగనగా నొక యూరిలో నొక చక్కని చుక్క కలదు. ఆమెకు ముగ్గురు మగలు. వారిలో సముద్రుడామెకు మొదటి భర్త. ఆమె పేరు గంగ హాలాహలమును మ్రింగి యా వేడిని బాపుకొనుటకై గంగను శివుడు తన నెత్తిపై ధరించుటచే గంగకు శివుడు రెండవ భర్త. ఈమె మూడవ భర్త శంతన మహారాజు. ఈ మహారాజున కష్టవసువులు గంగ గర్భమున జనియించిరి. వారిలో నేడుగురు పుట్టిన వెంటనే మరల గంగానదిలో గలిసిరి. ఎనిమిదవవాడు గాంగేయుడు. గంగమ్మ తల్లికి కడసారి బిడ్డ ఇతడు భీషణమైన బ్రహ్మచర్య వ్రతమును బూనుటచే నతనికి భీష్ముడని పేరు వచ్చినది. ఈతడీ వ్రతమును తన తండ్రియగు శంతనునకు సత్యవతిని పెండ్లిచేయుటకై బూనెను. శంతనునకు సత్యవతివల్ల చిత్రాంగద విచిత్రవీర్యులు బుట్టిరి. వారికి అంబికాంబాలికలను కాశీరాజు కుమార్తెలను దీసుకువచ్చి భీష్ముడు పెండ్లి చేసెను. చిత్రాంగద విచిత్రవీర్యులు సంతానవంతులు గాకుండగనే పరలోకగతులయిరి. సత్యవతికి పరాశరునివలన గలిగిన వ్యాసునివలన అంబికాంబాలికలకు ధృతరాష్ట్ర పాండురాజు లుదయించిరి. వీరి చరిత్రమే మహాభారతము. ఈ భారత గాథను [illegible] గంగమ్మ తల్లి. ఈ గంగమ్మకే ముగ్గురు మగలు.

అని నేను కథా ప్రారంభమును జేసితిని" అని రామకృష్ణుడు ముగించెను. రాయలు రామకృష్ణుని సత్కరించి సభ చాలించెను ★

కోడిపుంజు - చిక్కుడుగింజ

(50 వ పేజీ తరువాయి)

కుపోయి దువ్వెన్నలు చేసే వాడికిచ్చింది. వాడు దానికి ఒక దువ్వెన యిచ్చాడు. ఆ దువ్వెన పట్టుకొని రైతుకూతురు వద్దకు వెళ్ళింది. ఆమె దానికి కొంచెం దారం యిచ్చింది ఆ దారాన్ని తీసుకుపోయి నిమ్మచెట్టుకిస్తే, అది ఒక నిమ్మాకును యిచ్చింది. ఆ ఆకును నదికిస్తే, నది దానికి నీళ్లు యిచ్చింది. ఆ నీళ్ళు తీసుకొని సంతోషంతో కోడిపుంజుకు యిచ్చింది. కోడిపుంజు వెంటనే ఆ నీటిని త్రాగింది ఇంకేముంది-గొంతులో అడ్డంపడ్డ చిక్కుడుగింజ వెంటనే కడుపులోకి జారిపోయింది.

కోడిపుంజు సంతోషంతో గంతులేస్తూ "కొక్కొరోకో" అని కూసింది. (అంగ్ల మాతృక) ★

బారసాల

(27- పేజీ తరువాయి)

లేద"న్నాడు "వంటలు దివ్యంగావున్నాయి నలభీమపాకం" బ్రేవ్ మని తేనుస్తూ, బిగిసిన పంచలను కొస్త వదులు చేస్తూ అభినందించారు సుబ్బారావు స్నేహితులు.

భోజనాలయేసరికి రెండు గంటలయింది అనుకున్నట్టు బారసాల వైభవంగా జరిగిందనే సంతృప్తితో వాలుకుర్చీలో మేను వాల్చాడు సుబ్బారావు. గదిలో కూతురు, అల్లుడు ఏవో గుసగుసలాడుకుంటున్నారు. అబ్బాయి ఎవరి పోలికో? అని చర్చిస్తున్నారట. నీ పోలికే అంటాడు అల్లుడు. కాదు మీ పోలికే అంటుంది కూతురు. చివరికి యిద్దరి పోలికలూ అబ్బాయిలో ఉన్నాయని సమాధాన పర్చుకున్నారు.

"మీ నాన్న డబ్బుకి చాలా ఇబ్బంది పడి వుంటారు" అడిగాడు అల్లుడు.

"చాలా [illegible] అప్పు చేసినట్టుంది" అంది కూతురు

"నిజమే మరి, జీతం తక్కువ, ఖర్చు లెక్కువ"

"చేసిన అప్పు ఎట్లా తీరుస్తారో? రెండు వందలకు పైగానే అయివుంటుంది"

"తీర్చవలసిన అప్పు కాదేమో?"

"ఈ త్రిపుణ్యానికి ఈ కాలంలో డబ్బు ఎవరిస్తారండీ?"

"ఎవరో సహాయం చేసివుంటారు"

"మా నాన్న చెయ్యిచాచి కానీ అయినా ఎవర్నీ అడగరు."

"పారితోషికం పేరుతో పార్టీ లెవరో యిచ్చారేమో?"

"మా నాన్న లంచాలు పుచ్చుకునే బాపతయితే, ఈ పాటికి బంగారపు గోడలు పెట్టించేవారే"

"గవర్నమెంట్లో పని చేస్తూ లంచాలు పుచ్చుకోరంటే ఎవరయినా నవ్విపోతారు."

"అక్కడికి తాలూకాఫీసులో పని చేస్తున్న మీరు మడికట్టుకు కూర్చున్నట్టు"

"మేము లంచాలు పుచ్చుకోం అనాదిగా వస్తున్న ఆనవాయితే"

"డబ్బుకి చాలా ఇబ్బంది పడుతున్నారని నేను మీకు ఈ ఉత్తరం వ్రాశానే. మీరు కొంత సహాయం చేస్తే యింత అప్పు అయ్యేదికాదు"

అల్లుడు కాసేపు ఆలోచించి "సరళా, నీతో ఒక రహస్యం చెబుతాను. ఎవరితోనూ చెప్పబోక" అన్నాడు.

"ఏమిటండీ ఆ రహస్యం?"

"నీ ఉత్తరం చూసి, మీ నాన్నగారికి ఎట్లాగయినా కొంత ధనసహాయం చెయ్యాలనుకొన్నాను మనియార్డరు చేస్తే పసిమిగా మీ నాన్న అంగీకరించరు. మనియార్డరు వాపసు చేస్తారని నాకు తెలుసు ఏవిధంగా మీ నాన్నగారికి డబ్బు అందజెయ్యటమా అని కొంత తర్జన భర్జన చేశాక, చివరికి నా స్నేహితుడు వేణుకి - రెండువందలు మనియార్డరు చేశాను ఆ సొమ్ము యేదో విధంగా, మీ నాన్నకు తెలియకుండా అందచెయ్యమని వ్రాశాను వేణుకూడా బాగా ఆలోచించాడట వేణు తండ్రి వద్ద అప్పుకోసం వాళ్ళ యింటికి వెళ్ళినప్పుడు మీ నాన్న చూడకుండా పర్సులో ఆ డబ్బు పెట్టి పర్సు ఇంటిముందు విసిరాడట. మామగారు ఆ పర్సు ఎంతో చాకచక్యంతో తీసి జేబులో పెట్టుకున్నారో వేణు కిటికీలోంచి కనిపెడుతూ నేవున్నాడట."

అల్లుడు చెప్పిన రహస్యాన్ని తలుపువద్ద చెవి పెట్టివిన్న సుబ్బారావు తెల్లబోయాడు. అలుడిసొమ్ముతో తను బారసాల చేయ్యవలసి వచ్చినందుకు విచారించాడు.

బొగ్గు పొయ్యిమీద కాఫీకి నీళ్లు పెట్టి [illegible] జారిచేశాడు సుబ్బారావు. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press. 6 & 7, Thambu Chetty Street Madras-1 Editor S Sambhu Prasad.



ఓ పద్మ

ఫోటో: బి. [illegible]

